తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 09.03.2026 | సంపుటి :12 సంచిక : 229 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## టీ20 ప్రపంచకప్



# టీమిండియాదే

**ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలుపు**
**రాణించిన సంజు శాంసన్, ఇషాన్ కిషన్ ,అభిషేక్ శర్మ**
**మూడోసారి పొట్టికప్ దక్కించుకున్న భారత్**

డిఫెండింగ్ ఛాంపియన్ టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ 2026 టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారత్ గెలిచింది. దీంతో మూడోసారి ట్రోఫీని దక్కించుకొని టీమ్‌ఇండియా చరిత్ర సృష్టించింది. మరే జట్టు కూడా మూడు టైటిళ్లను గెలుచుకోలేదు. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ తర్వాత భారత్‌కు కప్ అందించిన సారథిగా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. ఆతిథ్య జట్టు స్వదేశంలో ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి కావడం విశేషం.ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. సంజు శాంసన్ (89), ఇషాన్ కిషన్ (54), అభిషేక్ శర్మ (52) హాఫ్ సెంచరీలు సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. టిమ్ సీఫర్ట్ (52) టాప్ స్కోరర్. మిచెల్ శాంట్నర్ (43) రాణించాడు. మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. భారత బౌలర్లు సమష్టిగా రాణించి కివీస్‌ను కట్టడి చేశారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 4, అక్షర్ పటేల్ 3.. హార్దిక్ పాండ్య, వరుణ్, అభిషేక్ తలో వికెట్ తీశారు.

### ఈ విజయం దేశ ప్రజలందరికీ గర్వకారణం

**టీమిండియాకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు**

టీ 20 వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుత విజయం సాధించి.. వరల్డ్ ఛాంపియన్ గా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు

మిగతా 2లో..




# మహిళా భద్రతే తొలి ప్రాధాన్యత

**విద్యార్థినులకు ఈవీ స్కూటీలు ఇవ్వాలనుకుంటున్నాం: సీఎం రేవంత్**

- మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నాం
- ఏ పదవైనా మహిళలకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది
- వారి ఉక్కు సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది
- మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం అభివృద్ధి చెందుతుంది
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు
- మహిళా జర్నలిస్టులను ఘనంగా సన్మానించిన ముఖ్యమంత్రి
- హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు




హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని చెప్పారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులకు సన్మానం చేశారు.మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోని ఏ పదవైనా మహిళలకు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, ఉక్కు మహిళ సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఎక్కడ అవకాశం ఉన్నా, ఉన్నత పదవుల్లో మహిళలను నియమిస్తున్నామని, హైదరాబాద్ కలెక్టర్‌గా మహిళ బాధ్యత వహిస్తున్నారని,

మిగతా 2లో..

**చెరువుల చెంత ఆర్థిక అభివృద్ధి జరగాలి**
- మహిళలకు ఆదాయ వనరుగా మారాలి
- బమ్‌రుకున్ - ఉద్- దౌలా చెరువును ప్రారంభించిన సీఎం రేవంత్

2లో..

"హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ నగరంగా మార్చాలి. హైదరాబాద్‌లో కాలుష్యం, దోమలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే అడ్డుపడుతున్నారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా? తొలగింపులు వద్దంటున్నారో స్పష్టత ఇవ్వండి. నష్టపరిహారం ఇచ్చే బఫర్ జోన్‌లోని ఇళ్లను తొలగిస్తాం. హైదరాబాద్‌లో ఏసీ ఈవీ బస్సులు తెస్తాం. ఈవీ వాహనాలు కొనుక్కుంటే జీరో ట్యాక్స్. కళాశాలకు వెళ్లే అమ్మాయిలకు ఈవీ స్కూటీలను ఇవ్వాలనుకుంటున్నాం."
- సీఎం రేవంత్ రెడ్డి

## 30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తాం

- ప్రాజెక్టుల భూ సేకరణ కోసం రూ.5 వేల కోట్లు కేటాయిస్తాం
- 2027 మార్చి నాటికి కల్వకుర్తి,నెట్టెంపాడు, భీమా,కోయిల్ పూర్తి
- అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): 30నెలల వ్యవధిలో పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.అదే విదంగా 2027 మార్చి మాసంతానికి కల్వకుర్తి,నెట్టెంపాడు ,భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టు లను పూర్తి చేసి సమృద్ధిగా సాగు నీరు,త్రాగు నీరు అం దిస్తామని ఆయన పేర్కొన్నారు. మహబూబ్నగర్ జిల్లాతో సహా దక్షిణ తెలంగాణా ప్రాంత రైతాంగానికి సరిపడా సాగు నీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని ఆయన చెప్పారు.మహబూబ్నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై ఆదివారం రోజున సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి జిల్లా కు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రత్యేక సమీ క్ష సమావేశం నిర్వహించారు

మిగతా 2లో..



## మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు

- సామాజిక తెలంగాణ సాధనలోనూ వారి పాత్రే కీలకం
- వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా రాజకీయాల్లోకి రావాలి
- 'గివ్ హర్ స్పేస్' తెలంగాణ జాగృతి నినాదం:కవిత

హైదరాబాద్(జనంసాక్షి): మహిళా దినోత్సవం రోజే కాదు.. ప్రతిరోజు మహిళలను గౌరవించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. 'గివ్ హర్ స్పేస్' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'స్టాండ్ విత్ హర్' కాదు.. 'గివ్ హర్ స్పేస్' జాగృతి నినాదం అని

మిగతా 2లో..



# ఇరాన్ బస్తీమే సవాల్

**6 నెలలైనా యుద్ధాన్ని కొనసాగిస్తాం • గల్ఫ్ దేశాలపై దాడులు ఆపేదిలేదు : ఐఆర్‌జీసీ**

- కువైట్‌పై బాంబుల వర్షం.. అగ్నికీలల్లో భారీ టవర్
- నార్వేలోని యూఎస్ ఎంబసీ వద్ద భారీ పేలుడు
- ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదు..
- జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజాని హెచ్చరిక
- ఇరాన్ చమురు డిపోలపై తొలిసారి ఇజ్రాయెల్ దాడులు
- ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తాం: నెతన్యాహు

**ఇరాన్ తదుపరి 'సుప్రీం లీడర్' ఖరారు!**
దాదాపు ఓ నిర్ణయానికి వచ్చిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' !

2లో..

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తత నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమా నాలు ఇరాన్‌పై భీకరంగా విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశా లపై దాడులు కొనసాగిస్తోంది. శనివారం రాత్రి ఇరాన్ మరోసారి తమపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ దాడుల్లో పలువురు ప్రజలు తీవ్రంగా గాయపడగా.. అనేక భవనాలు దెబ్బతిన్నాయని తెలిపింది. డ్రోన్ల శకలాలు పడడంతో నగరంలోని సోషల్ సెక్యూరిటీ టవర్‌కు మంటలు అంటుకున్నట్లు వెల్లడించింది. దానిలో అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని.. మంటలు ఆర్పడానికి అగ్నిమాపక దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. దాడులు కొనసాగుతున్నందున సురక్షితమైన ప్రదేశాల్లో తలదాచుకోవాలని కువైట్ సైన్యం ప్రజలకు సూచించింది. మరోవైపు ఆ దేశ అంతర్జాతీయ విమానాశ్రయానికి చెందిన ఇంధన ట్యాంకులు, పలు ప్రభుత్వ భవనాలకు అంటుకున్న మంటలను పూర్తిగా అదుపులోకి

మిగతా 2లో..



## మహిళా రైతులను ప్రోత్సహిస్తాం

**మంత్రి తుమ్మల**



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో మహిళా రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మెగా రైతు మేళా-2026ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి తుమ్మల ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజుల పాటు మహిళా రైతు మేళా జరగనుంది. సహజ వ్యవసాయం చేసే మహిళా రైతులకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 27 మంది మహిళా రైతులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

## మమత ప్రభుత్వం రాష్ట్రపతినే కాదు రాజ్యాంగాన్నీ అవమానించింది

**బెంగాల్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు:ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. టీఎంసీపై మండిపడ్డారు. రాష్ట్రపతి ముర్ము బెంగాల్‌కు వెళ్తే సత్కరించడానికి బదులు..ఆమె పాల్గొనే కార్యక్రమానికి అక్కడి ప్రభుత్వం అనుమతివ్వలేదన్నారు. ఇటువంటి చర్యలతో మమత ప్రభుత్వం రాష్ట్రపతిని మాత్రమే కాకుండా భారత రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని అన్నారు. ద్రౌపదీ ముర్ము ఎంతో కష్టపడి దేశంలోని అత్యున్నత స్థానానికి ఎదిగారని మోదీ పేర్కొన్నారు. మురికి రాజకీయాలు చేసే తృణమూల్‌కు బెంగాల్ ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. త్వరలో జరగనున్న బెంగాల్ ఎన్నికల్లో విజయం సాధించేది భాజపానేనని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగానే తప్పుడు ఆరోపణలు చేస్తోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం భాజపా దేశంలోని అత్యున్నత పదవిని దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి స్థానాన్ని తాము గౌరవిస్తామన్నారు. ఆ కార్యక్రమంలో ముర్ము పాల్గొంటారనే విషయంపై ఎటువంటి ముందస్తు సమాచారం లేదన్నారు.

**ప్రొటోకాల్ ఉల్లంఘనపై కేంద్రం సీరియస్..**
వివరణ ఇవ్వాలని బెంగాల్ ప్రభుత్వానికి ఆదేశం

2లో..

## ఒత్తిడి తగ్గించేందుకే ఒప్పుకున్నా

**రష్యా చమురు కొనేందుకు భారత్‌కు అనుమతిపై ట్రంప్ వివరణ**



వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌తో యుద్ధం తీవ్రమైన వేళ రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు భారత శుద్ధి కర్మాగారాలకు అమెరికా తాత్కాలిక మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ..కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం వల్ల పశ్చిమాసియా, గల్ఫ్‌లో చమురు సరఫరా మార్గాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రపంచ దేశాల్లోని ఇంధన మార్కెట్లపై ఒత్తిడి తగ్గించడానికి భారత్‌కు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే సముద్రంలో ఇప్పటికే ఉన్న రష్యా ముడి చమురును కొనుగోలు చేయడానికి భారత్‌కు 30 రోజుల మినహాయింపు ఇచ్చామని ట్రంప్ వివరించారు. దీనివల్ల రష్యాకు ఆర్థికంగా

మిగతా 2లో..

## భారత్, చైనా మధ్య శత్రుత్వం వద్దు

- ఇరు దేశాలు భాగస్వాములుగా ఉండాలి
- అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఇరుదేశాలు కట్టుబడి ఉండాలి
- సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా ముందడుగు వేయాలి: చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ



బీజింగ్(జనంసాక్షి):భారత్, చైనాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఒకరికొకరు ముప్పు అని భావించకుండా.. అభివృద్ధికి తోడ్పడే అవకాశంగా చూడాలన్నారు. వార్షిక మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలను మెరుగుపర్చుకునే

మిగతా 9లో..

**పోషణే భారమై..**
ముగ్గురు కుమార్తెల్ని చెరువులోకి తోసేసిన తండ్రి
కామారెడ్డిలో అదృశ్యమైన ముగ్గురు చిన్నారుల మృతదేహాలు చెరువులో లభ్యం

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
09.03.2026

## చెరువుల చెంత ఆర్థిక అభివృద్ధి జరగాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** చెరువుల చెంత ఆర్థిక అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చెరువులు మహిళలకు ఆదాయవనరుగా మారాలని సూచించారు. ఉదయమే వాకింగ్ చేసుకుంటూ చెరువుల చెంత ఏర్పాటు ఏర్పాటు షాపుల్లో పాలు, కూరగాయలు, పళ్లు కొనుక్కొని వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీలో ఇటీవల హైడ్రా పునరుద్ధరించిన బమ్‌రుకున్ - ఉద్ - దౌలా చెరువును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించి ప్రసంగించారు. నగరంలో అభివృద్ధి చేసిన చెరువులన్నీ లేక్ ఎకానమీ జోన్‌లుగా మారాలని సూచించారు. ఇదే పరిస్థితి మూసీ చెంత కూడా జరగాలని ఆదేశించారు. గండిపేట చెరువు నుంచి గౌరల్లి వరకూ 55 కిలోమీటర్ల మూసీ నదికి ఇరువైపులా నైట్ బజార్లు ఏర్పాటు చేసి నగర ప్రజలకు ఆర్థిక వనరుగా మార్చుతామని ముఖ్యమంత్రి చెప్పారు. వరదలు లేని నగరం ప్రభుత్వ లక్ష్యమని.. ఆ క్రమంలో నిజాంల కాలం నాటి గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించే కార్యక్రమాన్ని పెద్దయెత్తున చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా.. హిమయత్‌సాగర్ ఎకో పార్కును ప్రజలకు అందించాం.. నేడు బమృకున్ ఉద్ దౌలా చెరువును ప్రారంభించుకున్నామని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ రాక్స్, లేక్స్ తో ప్రపంచంలోనే సుందరమైన నగరంగా ఉండింది. ఈ నగరం మనది. దీన్ని రక్షించుకోవలసిన బాధ్యత కూడా అందరిపైన ఉంది.నగర ప్రజలకు కాలుష్యం లేని వాతావరణం, మంచి నీరు, గాలిని , మంచి జీవన ప్రమాణాలను అందించేందుకు చెరువులు దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఈ విజయం దేశ ప్రజలందరికీ గర్వకారణం

తెలిపారు. అహ్మదాబాద్‌లో భారత్ న్యూజిలాండ్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించింది. ఈ విజయం దేశ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం అన్నారు.మ్యాచ్ ఆరంభం నుంచి చివరి వరకు భారత జట్టు సమన్వయంతో, ధైర్యసాహసాలతో ఆడుతూ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిందని ప్రశంసించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్నింటిలోనూ టీమ్ ఇండియా ఆటగాళ్లు ఆల్‌రౌండ్ ప్రతిభను ప్రదర్శించి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని అభినందించారు.టీమ్? ఇండియా సాధించిన విజయం దేశ క్రీడా రంగానికి మరింత గౌరవం తెచ్చిందని అన్నారు. టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్‌తో పాటు టీమ్ సభ్యులందరికీ ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు

వివరించారు. “పెద్ద కులం, చిన్న కులం కాదు.. మహిళలంతా ఒక్కటే కులం. ఏ ఇంట్లో పుట్టినా సరే.. వారిపై వివక్షే ఉంటోంది. భర్త, తండ్రి, అన్న అందరూ తక్కువ చేసేవారే. మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు. సామాజిక తెలంగాణ సాధనలోనూ వారి పాత్రే కీలకం. వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా రాజకీయాల్లోకి రావాలి. కాంగ్రెస్ వచ్చాక వారిపై నేరాల శాతం పెరిగింది. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించింది” అని కవిత అన్నారు.

# పోషణే భారమై...

- ముగ్గురు కుమార్తెల్ని చెరువులోకి తోసేసిన తండ్రి
- కామారెడ్డిలో అదృశ్యమైన ముగ్గురు చిన్నారుల మృతదేహాలు చెరువులో లభ్యం

**కామారెడ్డి(జనంసాక్షి):** కామారెడ్డి పట్టణంలో హృదయవిదారక ఘటన వెలుగుచూసింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే ఆ బిడ్డల పాలిట కాలయముడిగా మారాడు. అభంశుభం తెలియని ముగ్గురు పిల్లలను బావిలోకి తోసేశాడు. ఈ ఘటనలో ముగ్గురు పిల్లలు మృతి చెందారు. ఒక్కసారిగా ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను పోషించలేకే తండ్రి ఇలా చేసినట్లుగా ఏఎస్పీ చైతన్య రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు నిందితుడుని అరెస్టు చేసిన రిమాండ్?కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు కామారెడ్డి పట్టణంలో ఆర్బీనగర్?కు చెందిన ఇస్మాయిల్?, షబీనా దంపతులకు షీఫత్(8), ఆయత్(7), మరియం(5) కుమార్తెలు. అతడు పొట్టకూటికోసం ఆటో నడిపిస్తుండగా, భార్య కూలీనాలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇస్మాయిల్ భార్య షబీనా పనికి వెళ్లి ఇంటికి తిరిగివచ్చేలోగా పిల్లలు కనిపించలేదు. పిల్లలు ఎక్కడున్నారని భర్తను ప్రశ్నించగా దోశ తినిపించి ఇంటికి పంపించానని వివరించాడు. ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో కంగారుపడ్డ ఆమె ఏం చేయాలో దిక్కుతోచక శనివారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి సబ్‌డివిజన్ ఏఎస్పీ చైతన్యరెడ్డితో పాటు సర్కిల్? ఇన్?స్పెక్టర్ నరహరి, రామన్‌ల ఆధ్వర్యంలో 3 బృందాలు ఏర్పాటయ్యాయి.విచారణలో భాగంగా ఇస్మాయిల్‌ను పోలీసులు ప్రశ్నించడంతో తాను పిల్లలకు దోశ తినిపించేందుకు హోటల్‌కు తీసుకెళ్లానని చెప్పాడు. అనంతరం ఆటో గిరాకీ రావడంతో వారిని ఇంటికి వెళ్లమని చెప్పి తాను వెళ్లిపోయినట్లు తెలిపాడు. సీసీ కెమెరా ఫుటేజీకి, ఇస్మాయిల్ సమాధానాలకు పొంతన లేకపోవడంతో పోలీసులు మరోసారి అతడిని తమదైన శైలిలో ప్రశ్నించారు. దాంతో తానే పిల్లలను పెద్దచెరువులోకి తోసేశానని చెప్పాడు. ముందుగా రెండో కుమార్తెను నీటిలోకి తోసేశానని, తర్వాత మూడో కుమార్తెను, చివరగా పెద్ద కుమార్తెను నీటిలోకి నెట్టానని నిందితుడు వివరించాడు.చిన్నారులు చనిపోయారని నిర్ధారించుకోడానికి అరగంట పాటు అక్కడే ఉన్నట్లుగా నిందితుడు తెలిపాడు. కుటుంబానికి రూ.5 లక్షలకుపైగా అప్పుల భారం ఉండడంతోనే పిల్లలను చంపానని, తానూ ఆత్మహత్య చేసుకుందామనుకున్నానని వివరించాడు. విచారిస్తున్న సమయంలో నిందితుడు పోలీసుల్ని ఘటనా స్థలానికి తీసుకెళ్లడంతో ఓ కుమార్తెకు సంబంధించిన హిజాబ్ లభ్యమైంది. దీంతో పోలీసులు ఫైర్ సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లను రప్పించి గాలించగా ముగ్గురు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి.తనకు అప్పు ఉందని, అందుకే కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుందామనుకున్నట్లు నిందితుడు తెలిపాడు. కానీ ఆయన భార్య మాత్రం తనకేపాపం తెలియదని చెబుతోందని పోలీసులు అంటున్నారు. ముక్కుపచ్చలారని బిడ్డలు మృతి చెందారని తెలియడంతో పెద్ద చెరువు వద్ద బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. నిందితుడిని మరోసారి కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు వివరించారు.

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై కేంద్రం సీరియస్..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ప్రొటోకాల్ ఉల్లంఘనకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తికి కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ లేఖ రాశారు. అందులో కేంద్రం కొన్ని అంశాలను ప్రస్తావించింది. రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్ ఎందుకు హాజరు కాలేదు? రాష్ట్రపతి కోసం ఏర్పాటు చేసిన వాష్ రూమ్‌లో నీళ్లు లేవు.రాష్ట్రపతి కాన్వాయ్ వెళ్లే దారి చెత్తతో నిండిపోయింది.డార్జిలింగ్ జిల్లా మేజిస్ట్రేట్, సిలిగుడి పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయండి. దీనికి సంబంధించి ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పశ్చిమ బెంగాల్‌కు కేంద్ర ప్రభుత్వం సమయం ఇచ్చింది.

## జేడీ(యూ)లో చేరిన నీతీశ్ కుమారుడు నిశాంత్

పట్నా(జనంసాక్షి): బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ నేడు అధికారికంగా జేడీ(యూ)లో చేరారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి లలన్ సింగ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ చౌదరి, సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో నిశాంత్ పార్టీలో చేరారు. ఇప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న నిశాంత్.. నీతీశ్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన కొన్ని రోజుల తర్వాత రాజకీయాల్లో అడుగుపెట్టారు.

# మహిళా భద్రతే తొలి ప్రాధాన్యత




ఎస్ఐబీ అధి పతిగా మహిళను పెట్టామని, వెయ్యి బస్సులకు మహిళలు యజమానులుగా ఉన్నారని గుర్తు చేశారు. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే వారిగా స్వయం సహాయక బృందాలను తయారు చేశామని, తెలంగాణ మహిళలు తయారు చేస్తున్న వస్తువులను అమెజాన్‌లో పెట్టి ప్రపంచానికి అందిస్తున్నామని వివరించారు.మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్న సీఎం, దేశంలో మహిళ శ్రమకు గుర్తింపు లేదని అన్నారు. దేశంలో కుల, జెండర్ వివక్ష ఉందని, అమెరికాలో కూడా వివక్ష ఉందని కానీ అక్కడ కష్టానికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ మాత్రం కష్టపడే వారికి గుర్తింపు ఉండదని, మహిళల ఆర్థిక శక్తిని పెంచాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పెంచే ప్రణాళికలను తయారు చేశామని పేర్కొన్నారు.మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్న సీఎం, దేశంలో మహిళ శ్రమకు గుర్తింపు లేదని అన్నారు. దేశంలో కుల, జెండర్ వివక్ష ఉందని, అమెరికాలో కూడా వివక్ష ఉందని కానీ అక్కడ కష్టానికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ మాత్రం కష్టపడే వారికి గుర్తింపు ఉండదని, మహిళల ఆర్థిక శక్తిని పెంచాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పెంచే ప్రణాళికలను తయారు చేశామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ నగరంగా మార్చాలని రేవంత్ రెడ్డి తెలిపారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని కొనియాడారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని, హైదరాబాద్‌లోని డీజిల్ బస్సులను 2026 డిసెంబర్‌లోపు జిల్లాలకు తరలిస్తామని, హైదరాబాద్‌లో 100 శాతం ఈవీ బస్సులను తెస్తున్నామని అన్నారు. డిసెంబర్ 9లోపు డీజిల్ బస్సులు హైదరాబాద్‌లో ఉండవని, హైదరాబాద్‌లో ఏసీ ఈవీ బస్సులు తెస్తామని తెలిపారు. ఈవీ వాహనాలు కొనుక్కుంటే జీరో ట్యాక్స్ అని, కళాశాలకు వెళ్లే అమ్మాయిలకు ఈవీ స్కూటీలను ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు.హైదరాబాద్‌లో కాలుష్యం, దోమలు ఎక్కువగా ఉన్నాయంటున్నారని, మూసీని ప్రక్షాళన చేస్తామంటే అడ్డుపడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా? తొలగింపులు వద్దంటున్నారో స్పష్టత ఇవ్వాలని కోరారు. నష్ట పరిహారం ఇచ్చే బఫర్ జోన్‌లోని ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అనేది చట్టంలో ఉంది తాను మార్చలేనని, నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఎవరూ మీతో ఉండరని, ఓట్ల కోసమే మీ దగ్గరకు వస్తున్నారని తెలిపారు.గాంధీ విగ్రహం కట్టడానికి రూ.500 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు అవుతుందని సీఎం చెప్పారు.




## నేర పరిశోధనలో కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకోవాలి

**తెలంగాణ పోలీస్ రిట్రీట్ ప్రారంభోత్సవంలో మంత్రి .శ్రీధర్ బాబు**

హైదరాబాద్ (జనంసాక్షి):మారుతున్న కాలానికి అనుగుణంగా నేర పరిశోధనలో అత్యాధునిక కృత్రిమ మేధ సాంకేతికతను పోలీసు శాఖ సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం నాడు 'తెలంగాణ పోలీస్ రిట్రీట్-2026' ను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో తీవ్రవాదం విస్తృతంగా ఉండేది. పోలీసు అధికారుల అలుపెరగని కృషి, త్యాగాల వల్ల నేడు తీవ్రవాదం అంతమైందన్నారు. సెలవులు కూడా లేకుండా విధులు నిర్వర్తిస్తూ, ఎందరో అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారనీ,వారి సేవలకు ఎప్పటికీ గౌరవం ఉంటుందని కొనియాడారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా పోలీసింగ్ వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రజలకు వాస్తవంగా న్యాయం చేస్తున్నామా? లేదా? అని స్వీయ విమర్శ చేసుకోవాలని మంత్రి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు నమ్మకం కలిగించినప్పుడే వ్యవస్థకు గుర్తింపు వస్తుందన్నారు. జనాభా పెరుగుతున్న నిష్పత్తిలో సిబ్బంది నియామకం ఎప్పుడూ సాధ్యపడదని, అందుకే అందుబాటులో ఉన్న వనరులతోనే పనితీరును ఎలా మెరుగుపరుచుకోవాలో యోచించాలన్నారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో ఉందని, ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్, 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఒత్తిడి తగ్గించేందుకే ఒప్పుకున్నా..

ఎటువంటి ప్రయోజనం చేకూరదన్నారు. భారత్ తమకు ముఖ్యమైన భాగస్వామి అని పేర్కొన్నారు. ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి అదనపు చర్యల గురించి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో కొంత మేరకు ఒత్తిడి తగ్గించే విషయం గురించి మాత్రమే తాను ఆలోచిస్తున్నానని అన్నారు. ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ప్రపంచ సరఫరా బలంగా ఉందని పేర్కొన్నారు. అమెరికా వద్ద అపారమైన చమురు నిల్వలు ఉన్నాయన్నారు.

## 30 నెలలలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తాం

నీటిపారుదల శాఖా సలహా దారు ఆదిత్యా దాస్ నాథ్,ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్ తో సహా నీటిపారుదల శాఖా ఇంజినీరింగ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణంలో ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేం దుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటా యించిందని కల్వకుర్తి ప్రాజెక్టుకు 909 కోట్లు,నెట్టెం పాడు కు 252 కోట్లు,భీమా ప్రాజెక్టుకు 200 కోట్లు,కోయిలసాగర్ ప్రాజెక్టుకు 185 కోట్లు కేటాయింపులు జరిగాయాని ఆయన వివరించారు.అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు భూసేకరణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ జూన్ 2 నాటికి 5000 కోట్లు విడుదల చెయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు.2014 లో బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురైయ్యయని ఆయన విమర్శించారు.పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం కలిగిందని అన్నారు. ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చడం తెలంగాణ రైతులకు అన్యాయం జరిగేలా చేసిందని ఆయన పేర్కొన్నారు.రైతులకు వాగ్దానం చేసిన సాగునీటి ప్రయోజనాలను అందించడానికి ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని తెలిపారు. అన్ని చర్యలు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని రైతులకు విశ్వసనీయ నీటి సరఫరా, అధిక దిగుబడులు, ప్రత్యక్ష ఆర్థిక మద్దతు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.సాగు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించిన మంత్రి, వారి ఆరోపణలను గోబెల్స్ శైలిలోని అబద్ధ ప్రచారంగా అభివర్ణించారు. పాలమూరు- రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.35,200 కోట్ల పరిపాలన అనుమతి తీసుకున్నప్పటికీ, సుమారు రూ.27,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసి పనులను నిర్లక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు.2023 సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టులో ఒక పంపును కేవలం ఒక గంట మాత్రమే నడిపి, ఒక్క ఎకరానికి కూడా సమర్థంగా నీరు అందించలేకపోయారన్నారు. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.55,000 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు.జూరాల ప్రాజెక్టు డీసిల్టింగ్‌జూరాల (ప్రియదర్శిని జూరాల) ప్రాజెక్టులో వెంటనే డీసిల్టింగ్ పనులు ప్రారంభించాలని మంత్రి నీటిపారుదల అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన సమయంలో దాని స్థూల నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలుగా ఉండగా, మట్టిపొరలు పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం ప్రభావవంతమైన సామర్థ్యం సుమారు 9 టీఎంసీలకు తగ్గిందని తెలిపారు. ప్రాజెక్టు నుంచి తవ్వి తీసే ఇసుకను గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టు పనులకు ఉపయోగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.



## ఇరాన్ తదుపరి 'సుప్రీం లీడర్' ఖరారు!

**దాదాపు ఓ నిర్ణయానికి వచ్చిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' !**

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎవరనే దానిపై 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' దాదాపు ఒక నిర్ణయానికి వచ్చేసినట్లు తెలుస్తోంది. అయితే, అధికారికంగా ఇంకా పేరును ప్రకటించలేదు. అసెంబ్లీ సభ్యుడు మొహ్సెన్ హెదరీని ఉటంకిస్తూ స్థానిక మీడియా ఈ విషయం వెల్లడించింది. “సరైన అభ్యర్థి ఎవరనేది నిర్ణయమైంది. 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్'లో ఆయనకు మెజారిటీ ఆమోదం లభించింది” అని మొహ్సెన్ చెప్పినట్లు తెలిపింది. మెజారిటీ సభ్యులను పరిగణనలోకి తీసుకుని ఓ నిర్ణయానికి వచ్చేసినట్లు మరో సభ్యుడు మొహమ్మద్ మెహదీ మిర్బాఘేరి తెలిపారు.'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్'లో 88 మంది సభ్యులు ఉంటారు. ఆ దేశ చట్టం ప్రకారం ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే అధికారం ఈ గ్రూపునకు ఉంది. ఇదిలా ఉండగా.. తదుపరి సుప్రీం నేత నియామకాన్ని అధికారికం చేయడానికి అవసరమైన విధానంపై సభ్యులు మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. దీనికోసం ఓ సమావేశం ఏర్పాటు చేయాలని కొంతమంది సభ్యులు కోరుతున్నారని, అయితే.. భద్రతాపరమైన కారణాల దృష్ట్యా సమావేశం అవసరం లేకుండానే నిర్ణయం ప్రకటించాలని మరికొందరు భావిస్తున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి.ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్ చేపట్టిన సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన బాధ్యతలను ఎవరు చేపడతారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. దేశ తదుపరి సుప్రీంగా ఖమేనీ కుమారుడు ముజ్తబా ఖమేనీ ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆయనకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఫిబ్రవరి 28న జరిగిన దాడుల్లో ముజ్తబా కూడా గాయపడినట్లు సమాచారం.

## కల్తీపాల ఘటన


### 12కు చేరిన మృతుల సంఖ్య

ఉంచి డయాలసిస్ చేసినా.. ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో ఈ నెల 7వ తేదీ వరకు 11 మంది మృతి చెందగా రామలక్ష్మి మృతితో ఆ సంఖ్య 12కి చేరింది.

## ఎండీఎంఏ డ్రగ్స్ తయారీ కేసు..

అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు వచ్చి డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. 10 కిలోల మెఫిడ్రిన్ తయారు చేసినట్లు ఈగల్ బృందం గుర్తించింది. తయారు చేసిన డ్రగ్స్‌ను రాజస్థాన్‌లోని దౌసా వద్ద మనీశ్ అనే వ్యక్తికి అప్పగించినట్లు పోలీసులు నిర్ధరించారు. డ్రగ్స్ తయారు చేస్తున్న గదిలో భారీగా రసాయనాలు, పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

# ఇరాన్ బస్తీమే సవాల్



తీసుకువచ్చినట్లు అగ్నిమాపక దళం పేర్కొంది. సౌదీ అరేబియా, ఖతార్‌లలోనూ దాడులు కొనసాగుతు న్నాయి. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తున్నందుకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పినప్పటికీ.. టెహ్రాన్ ఆయా దేశాలపై దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం. మరో వైపు ఇరాన్‌కు మద్దతిస్తున్న హెజ్‌బొల్లా నేతలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. బీరుట్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యం చేసుకుంటున్నందువల్ల ఆ ప్రాంతాన్ని వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని స్థానిక ప్రజలను హెచ్చరించింది. సెంట్రల్ బీరుట్‌లోని ఓ హోటల్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

నార్వేలోని యూఎస్ ఎంబసీ వద్ద భారీ పేలుడు ఐరోపా దేశం నార్వేలోని యూఎస్ ఎంబసీ వద్ద పేలుడు సంభవించింది. ఈ క్రమంలో భారీ శబ్దం వినిపించిందని.. పెద్ద ఎత్తున పొగ వ్యాపించిందని పోలీసులు పేర్కొన్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన జరిగింది.ఓస్లో నగరంలోని యూఎస్ ఎంబసీ ప్రవేశ ద్వారం వద్ద ఈ పేలుడు సంభవించిందని పోలీసులు పేర్కొన్నారు. దీంతో స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అయితే, ఎవరూ గాయపడలేదని స్పష్టం చేశారు. ఈ పేలుడుకు గల కారణాలు తెలియరాలేదన్నారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఘటనపై అమెరికా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. ఈ క్రమంలో నార్వేలోని యూఎస్ ఎంబసీ వద్ద పేలుడు చోటుచేసుకోవడం గమనార్హం.

**ఇరాన్ చమురు డిపోలపై ఇజ్రాయెల్ దాడులు..!**

ఇరాన్‌కు ఆర్థిక జీవనాడి లాంటి చమురు డిపోలపై ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ తొలిసారి వైమానిక దాడులు జరిపింది. దీంతో భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. ఇరాన్ ఇక్కడి నుంచే చమురును సైన్యం సహా పలు శాఖలకు తరలిస్తుంటుందని ఐడీఎఫ్ వెల్లడించింది. ఆ దేశ సైనిక మౌలిక వసతులను దెబ్బతీయడంలో మరో అడుగు వేశామని పేర్కొంది.అంతకు ముందు దక్షిణ టెహ్రాన్‌లోని చమురు డిపోలు, రిఫైనరీ కాంప్లెక్స్‌పై దాడి జరిగినట్లు ఆ దేశ మీడియా పేర్కొంది. మొత్తం మూడు డిపోల్లో మంటలు వ్యాపించినట్లు చమురు మంత్రిత్వ శాఖను ఉటంకిస్తూ ఇరానియన్ లేబర్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

మినాబ్‌లో దాడి ఇరాన్ పనే: ట్రంప్
మినాబ్‌లో బాలికల పాఠశాలపై ఇరానే దాడి చేసి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభిప్రాయపడ్డారు. వారి ఆయుధాలకు కచ్చితత్వం, గురి సరిగా లేదన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ దాడిలో 150 మందికిపైగా మరణించిన విషయం తెలిసిందే.

**కువైట్ ఎయిర్‌పోర్టు ఇంధన డిపోపై దాడి**

కువైట్‌లోని కీలక భవనాలపై నేడు కూడా దాడులు జరిగాయి. ఆ దేశ సోషల్ సెక్యూరిటీ భవనంపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద రెండు చమురు డిపోలపై దాడులు జరిగాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

**ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదు..**

ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ పై దాడికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదని జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజాని హెచ్చరించారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఆయన.. తమ నాయకుడి మృతికి ప్రతీకారం తీర్చుకుంటామంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'మేము ట్రంప్‌ను వదిలిపెట్టం. ఖమేనీ మృతికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. దాడుల్లో మా నాయకుడితో సహా అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సాధారణ విషయం కాదు. దీనికి తగిన రీతిలో మేం ప్రతీకారం తీర్చుకుంటాం' అని హెచ్చరించారు. ఈ సందర్భంగా యుద్ధం నేపథ్యంలో అనేక మంది అమెరికన్ సైనికులను తాము బంధించామని అలీ మరో పోస్టులో పేర్కొన్నారు. వారిని జైళ్లలో ఉంచినట్లు తెలిపారు. ఇరాన్ దాడుల్లో ఆరుగురు యూఎస్ సైనికులే ప్రాణాలు కోల్పోయారంటూ ట్రంప్ తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారన్నారు. నిజానికి చాలా మందే చనిపోయారన్నారు. కొన్ని రోజుల తర్వాత ప్రమాదాలు, కల్పిత సంఘటనలతో మృతుల సంఖ్యను పెంచేస్తారని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులపై లారిజాని స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోని యూఎస్ బలగాలు బందీగా తీసుకెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. వెనెజువెలాలో మాదిరిగా ఇరాన్‌లో కూడా త్వరగా యుద్ధం ముగించేయాలనుకున్నారని.. కానీ , అది విఫలమైందని అన్నారు. అయితే, యూఎస్ సైనికులను బంధించామంటూ లారిజాని చేసిన ఆరోపణలను అమెరికా ఖండించింది. ఇవి ఆ దేశ ప్రభుత్వ అబద్ధాలు, మోసాలకు మరో నిదర్శనం అని సెంటాకామ్ ప్రతినిధి మీడియాతో అన్నారు.

ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తాం: నెతన్యాహు
ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగుతోన్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ముందు ముందు ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తామన్నారు. ప్రజలు ఆ దేశంలోని ప్రభుత్వాన్ని పడగొట్టే క్షణం దగ్గరలో ఉందన్నారు. ఈ దాడులతో తాము ఇరాన్‌ను విభజించడానికి ప్రయత్నించట్లేదని.. నిరంకుశ పాలన నుంచి ఆ దేశానికి విముక్తి కలిగించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇరాన్ విషయంలో తమ ప్రణాళికలోని తదుపరి దశను త్వరలో చేరుకోబోతున్నామని నెతన్యాహు అన్నారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో కీలక నేతలను కోల్పోయి.. ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని నెతన్యాహు అన్నారు. ఆ దేశంలోని ప్రస్తుత పాలనను అస్థిరపరచడానికి.. ప్రభుత్వంలో మార్పులు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్కడి పాలక వర్గాన్ని గద్దె దించడానికి ఇదే సరైన సమయమని తెలిపారు. ఆ దేశ ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలే స్వయంగా పడగొట్టాలన్నారు. అప్పుడే ఇరాన్-ఇజ్రాయెల్‌లలో శాంతి నెలకొంటుందని తెలిపారు. ఇదీ చదవండి: ఇరాన్ చమురు డిపోలపై తొలిసారి ఇజ్రాయెల్ దాడులు..!

**స్వదేశానికి 52 వేల మంది భారతీయులు**

అమెరికా, ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్ దేశాలపైనా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తోంది. దీంతో గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న, యుద్ధ పరిణామాల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన భారత పౌరుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఈ నెల మొదటి వారంలో గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మందికిపైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది. పశ్చిమాసియాలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.“గల్ఫ్ రీజియన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి విమానాల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించడంతో ఈ నెల 1 నుంచి 7 మధ్యలో 52 వేల మందికిపైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. వీరిలో సుమారు 32 వేల మంది భారత విమానాల్లో ప్రయాణించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. విమాన కార్యకలాపాలు ఇంకా అందుబాటులోకి రాని దేశాల్లో ఉన్న భారత పౌరులు.. స్థానిక రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్‌ను సంప్రదించాలి” అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. విదేశాల్లోని భారత పౌరుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, సాయం అవసరమైన వారందరికీ అండగా నిలిచేందుకు స్థానిక ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.పశ్చిమాసియాలో ఉన్న భారత పౌరులు.. స్థానిక అధికారుల మార్గదర్శకాలను, అక్కడి భారత దౌత్య కార్యాలయాలు జారీ చేసే సలహాలను పాటించాలని విదేశాంగ శాఖ సూచించింది. ఇప్పటికే అవసరమైన అడ్వైజరీలను స్థానిక భారత ఎంబసీ, కాన్సులేట్ జారీ చేశాయని తెలిపింది. అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని తెలిపింది. అదే విధంగా విదేశాంగ శాఖ కార్యాలయంలో ఓ ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

# మహబూబ్‌నగర్ శేషాద్రినగర్‌లో ఘనంగా ఇఫ్తార్

**ముస్లిం సోదరులకు విందు ఏర్పాటుచేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్**

**పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ఓబేదుల్లా కొత్వాల్**



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 08 (జనంసాక్షి) :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మహబూబ్ నగర్ పట్టణంలోని 49వ డివిజన్ శేషాద్రి నగర్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ ప్రస్తుత కార్పొరేటర్ ప్రసన్న గౌడ్ మైనార్టీ సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల అనంతరం తమ ఉపవాస దీక్షలను ఆనంద్ గౌడ్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఉపవాసాన్ని విరమించారు. ఆనంద్ గౌడ్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఉపవాసాన్ని విరమించారు. అతిథులు మాట్లాడుతూ.. రంజాన్ పండుగ మత సామరస్యానికి, సోదరభావానికి గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి విందులు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఇఫ్తార్ విందులో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంజీవరాజ్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జహీర్ అక్తార్, ఎంఐఎం అధ్యక్షులు హాది, కార్పొరేటర్లు సాధతుల్లా, తాహెర్, రామస్వామి, ఉమేర్ కొత్వాల్, అవీజ్, సల్మాన్ పాల్గొన్నారు.



# మహిళలు సాధిస్తున్న విజయాలు దేశాభివృద్ధికి ముఖ్యమైనవి

**టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ • ఘనంగా 'విశ్వ మహిళ బాపు బొమ్మ పురస్కారం 2026'**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్‌లోని హోటల్ దస్పల్లాలో సినీనటి ఆధ్వర్యంలో నిర్వహించిన 'విశ్వ మహిళ బాపు బొమ్మ పురస్కారం 2026' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కళ, సాహిత్యం, సామాజిక సేవ, మీడియా, వ్యాపార రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు దేశ అభివృద్ధికి ముఖ్యమైనవని పేర్కొన్నారు. మహిళల సాధనను గౌరవిస్తూ వారికి ప్రోత్సాహం అందించే ఇటువంటి పురస్కారాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన దివ్యవాణిని మహేష్ కుమార్ గౌడ్ అభినందించారు. మహిళల ప్రతిభను వెలికితీసి సమాజానికి పరిచయం చేసే వేదికగా "విశ్వ మహిళ బాపు బొమ్మ పురస్కారం" కార్యక్రమం నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సినీ, సాంస్కృతిక, సామాజిక రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్న మహిళలను సన్మానిస్తూ అవార్డులు అందజేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.



**పరస్పర గౌరవానికి ప్రతీక ఇఫ్తార్**

పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని బర్కత్‌పురాలో పీసీసీ ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో ఆత్మీయమైన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరై రమజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రమజాన్ మాసం ఉపవాసం, ప్రార్థనలు, దానం, సహనానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన కాలమని అన్నారు. సమాజంలో ప్రేమ, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం పెంపొందించడంలో ఇలాంటి ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు కలిసి పాల్గొనే ఈ కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా మహమ్మద్ అజహరుద్దీన్, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరయ్యారు.



**మహిళా పాత్రికేయులకు శుభాకాంక్షలు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందుకున్న మహిళా పాత్రికేయులకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా మహిళా జర్నలిస్టులు నిబద్ధతతో, ధైర్యంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూరుస్తున్నారని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ, నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ బాధ్యతను మహిళా పాత్రికేయులు అత్యంత కర్తవ్యబద్ధతతో నిర్వర్తిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని కొనియాడారు. వార్తా రంగంలో మహిళలు ఎదుర్కొనే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధించడం గర్వకారణమని అన్నారు. ఈ అవార్డులు మహిళా జర్నలిస్టుల కృషికి లభించిన గౌరవమే కాకుండా, మరింత బాధ్యతను కూడా పెంచుతాయని మహేష్ కుమార్ గౌడ్ గారు తెలిపారు. సమాజానికి మార్గదర్శకంగా నిలిచే విధంగా వారు తమ సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. జర్నలిజం రంగంలో మహిళలు మరింత ముందుకు రావాలని, వారి కృషి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అవార్డులు అందుకున్న మహిళా జర్నలిస్టులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్వచ్ఛత యజ్ఞంలో మహిళా పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్మికులను సత్కరించిన జిహెచ్ఎంసి**

**హైదరాబాద్, 08 మార్చి (జనంసాక్షి) :**



హైదరాబాద్ నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులను జీహెచ్ఎంసీ ఘనంగా సత్కరించింది. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్)లో భాగంగా 'నారీ లెడ్ స్వచ్ఛత' కార్యక్రమం కింద యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని జయ ప్రకాశ్ నగర్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రత బలోపేతానికి కృషి చేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక మహిళలను అభినందించి సత్కరించారు. నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అధికారులు పేర్కొన్నారు. నగర పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో, క్లీన్ లినెస్‌ను ప్రమోట్ చేయడంలో పారిశుద్ధ్య మహిళా కార్మికుల సేవలు ఎనలేనివి అంటూ కొనియాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిహెచ్ఎంసి తన అధికార ఖాతాలో పోస్ట్ చేసింది.

# పారిశుద్ధ్య సమస్యలు మీ దృష్టికి వచ్చాయా..?

- **వెంటనే జీహెచ్ఎంసీ వాట్సాప్ 8125966586కు సమాచారం ఇవ్వండి**
- **సాంకేతిక దన్నుతో పారిశుద్ధ్య సమస్యల సత్వర పరిష్కారానికి జీహెచ్ఎంసీ శ్రీకారం**

**హైదరాబాద్, 08 మార్చి (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు త్వరితగతిన సమస్యల పరిష్కారం అందించేందుకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిహెచ్ఎంసీ కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నగరంలోని పారిశుద్ధ్య సమస్యలను ఇప్పుడు పౌరులు నేరుగా వాట్సాప్ ద్వారా జీహెచ్ఎంసీకి తెలియజేయవచ్చు. రోడ్లపై చెత్త పేరుకుపోవడం, చెత్త బిన్లు నిండిపోవడం, చెత్త సకాలంలో తొలగించకపోవడం, మురుగునాలాలు మూసుకుపోవడం (డీసిల్టింగ్ అవసరం), గ్రీన్ వెస్ట్ తొలగింపు వంటి పారిశుద్ధ్య సమస్యలను పౌరులు సులభంగా తెలియజేయవచ్చు. సమస్యకు సంబంధించిన ఫోటోతో పాటు లొకేషన్‌ను 8125966586 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతారు. ఈ వాట్సాప్ సౌకర్యం ద్వారా పౌరులు ఎలాంటి కార్యాలయాలకు వెళ్లకుండా, సులభంగా తమ ప్రాంతాల్లో ఉన్న పారిశుద్ధ్య సమస్యలను జీహెచ్ఎంసీ దృష్టికి తీసుకురావచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత పారిశుద్ధ్య బృందాలను అప్రమత్తం చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు. ఈ విధానం ద్వారా పౌరులు – జీహెచ్ఎంసీ మధ్య సమన్వయం మరింత మెరుగుపడి, నగర పారిశుద్ధ్య నిర్వహణ వ్యవస్థ మరింత బలపడుతుందని అధికారులు తెలిపారు. పౌరుల్లో అవగాహన కల్పించేందుకు వాట్సాప్ ద్వారా పారిశుద్ధ్య సమస్యలను ఎలా తెలియజేయాలనే అంశంపై ఒక అవగాహన వీడియోను కూడా జీహెచ్ఎంసీ ఆదివారం విడుదల చేసింది.

**పౌరుల సహకారంతోనే.. : జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్**

హైదరాబాద్‌ను పరిశుభ్రమైన, హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగర పౌరులు కూడా తమ సహకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. నగర ప్రజల తోడ్పాటు, సహకారం ఉంటే హైదరాబాద్ క్లీన్ , గ్రీన్ సిటీగా అవతరిస్తుందన్నారు.








## నిరుపేదలకు రంజాన్ తోఫా పంపిణీ

**గద్వాల (జనంసాక్షి) :** వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్, వడ్డేపల్లి, పైపాడ్‌లలో ఉండే నిరుపేద ముస్లిం 25 కుటుంబాలకు రంజాన్ పండగకు అవసరమయ్యే నిత్యసర సరుకులను ఒక కిట్‌లా తయారుచేసి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పండగ మంచిగా జరుపుకోవాలని ఈ నిత్య వసర సరుకులు పంపిణీ చేస్తున్నామని, గత నాలుగు సంవత్సరాల నుండి రేషన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇలా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడానికి కొద్దిమంది దాతలు సహకరిస్తున్నారని, భవిష్యత్తులో అందరి సహకారంతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పండగ మంచిగా జరుపుకుంటే అదే సంతోషమని, ఇలా సేవా చేసే అవకాశం మాకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, మాలిక్, రమేష్, సంజీవరాజు, ఖలీల్, రిహన్ పాల్గొన్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడింది

**ముధోల్ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్**



**బాసర, మార్చ్ 08 (జనం సాక్షి)** నిర్మల్ జిల్లా బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామంలో రూ.20 లక్షల నిధులతో వివో భవనం , వర్క్ షెడ్ నిర్మాణానికి ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచడం, మహిళా సంఘాలకు సౌకర్యాలు కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే మహిళా సంఘాల కార్యకలాపాలకు వివో భవనం, వర్క్ షెడ్ ఎంతో ఉపయోగపడతాయని, గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెంగాడే విశ్వనాథ్ పటేల్, ఉప సర్పంచ్, మాజీ జెడ్పిటిసి రమేష్, బిజెపి మండల అధ్యక్షులు పుట్నాల సాయినాథ్ పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లాను మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కూడా చైర్మన్ జిల్లా కలెక్టర్**



**హనుమకొండ ప్రతినిధి మార్చి 8 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లాను మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్, కుడా వైస్ ఛైర్మన్ చాహత్ బాజ్ పాయ్, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ఆదివారం నాడు దేవన్నపేట, గోపాలపూర్, ఉనికిచెర్ల, ధర్మసాగర్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యంగా "మా సిటీ" వెంచర్, దాని పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రాబోయే రోజుల్లో చేపట్టబోయే భారీ అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. ఫ్యూచర్ సిటీ హౌసింగ్ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆధునిక వసతులతో కూడిన సిటీ హౌసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించారు. క్రీడలు ఈకో పార్క్: యువత కోసం అత్యాధునిక స్పోర్ట్స్ హబ్, పర్యావరణ హితమైన ఈకో పార్క్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ధర్మసాగర్ అభివృద్ధి ధర్మసాగర్ పరిసరాలను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా చూడాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజిత్ రెడ్డి, రెవెన్యూ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగాలి

**శ్రీకాళహస్తి దేవాలయంలో దర్శనం చేసుకున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త**



**శ్రీకాళహస్తి (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి దేవాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. దేశ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని దేవుడిని ప్రార్థించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దిశగా అడుగులు వేయాలని అని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.



ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్ గుప్త , యూత్ అధ్యక్షుడు కట్ట రవికుమార్ గుప్త, సంభు పాండు గుప్త, రఘు వంశీ , సిరిసిల్ల జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్ కాళహస్తి ఆర్యవైశ్య సంఘం నాయకులు శశిధర్ మురళి ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు సమాన హక్కులు, సమాన న్యాయం ప్రతిచోట ఉండాలి



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు టీజీవో భవన్ నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, టీజీఈజెఎసి సెక్రటరీ జనరల్, స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి పి సుధారాణి టిజిఓ మహిళా కార్యదర్శి అధ్యక్షత వహించి, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి ప్రకటించిన హక్కులు, న్యాయం, కార్యాచరణ, అందరు మహిళలు, బాలికల కోసం అనే థీమ్‌తో పాటు, అంతర్జాతీయంగా "గివ్ టు గెయిన్" అనే ప్రచారంతో మహిళా సాధికారతకు కొత్త అర్థాన్ని ఇవ్వాలన్నారు. ఏలూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేవలం వేడుకలు జరుపుకోవడమే కాకుండా, మహిళలకు సమాన వేతనం, విద్య, రక్షణ కల్పించడమే ముఖ్య ఉద్దేశమని, మహిళలు ఆర్థికంగా స్థిరపడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని వివరించారు. స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల మాట్లాడుతూ, ప్రతి మహిళా తన హక్కుల కోసం, న్యాయం కోసం నిరంతరం పోరాడే స్ఫూర్తినిచ్చే రోజు మహిళా దినోత్సవం అభిప్రాయపడ్డారు. జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని కార్యాలయాలలో కూడా మహిళలకు సమానా హక్కులు కల్పించాలని జిల్లాలో మహిళలు అన్ని రంగాలలో సగభాగాన్ని కలిగి ఉన్నారని అభిప్రాయపడ్డారు. అనంతరం శ్రీ సత్య సాయి మహిళ వృద్ధాశ్రయంలో మహిళలకు పండ్ల పంపిణీ నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏలూరి శ్రీనివాసరావుతో నిర్వహించటం జరిగింది. భోజనం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో అధిక సంఖ్యలో మహిళా అధికారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్, కోశాధికారి సూరంపల్లి రాంబాబు, టీజీవో మహిళ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్. విజయ కుమారి, ప్రిన్సిపల్స్ అసోసియేషన్ నవీన జ్యోతి, మహిళ గెజిటెడ్ అధికారులు డాక్టర్ పి. అనిత, డాక్టర్ డి. సుజాత, లెక్చరర్ సంఘం అధ్యక్షురాలు ప్రమీల, చంద్రకళ, రాధా, లలిత, అగ్రికల్చర్ ఆఫీసర్స్ , ట్రెజరీ గెజిటెడ్ అధికారులు మంజుల, శారద, లావణ్య, నాలుగో తరగతి జిల్లా అధ్యక్షులు బిక్కు నాయక్, డ్రైవర్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి. పుల్లయ్య, మున్సిపల్ సంఘ అధ్యక్షులు సుధాకర్, భాస్కర్ మోదుగు వెంకటేశ్వర్లు, మల్లయ్య, కృష్ణార్జునరావ్ పాల్గొన్నారు.



# సూర్యాపేటలో సందడి చేసిన సినీనటి నిధి అగర్వాల్

**వివాహ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన హీరోయిన్ నిధి అగర్వాల్**



**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేటలో ఆదివారం ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వివాహ షాపింగ్ మాల్ ను సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ వారి మన్ననలు పొందాలని అన్నారు. శుభకార్యాలకు అవసరమయ్యే వస్త్రాలకు సుదూర నగరాలకు వెళ్లకుండా సూర్యాపేట పట్టణంలోనే మహిళలకు వివాహ షాపింగ్ మాల్ ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. పెద్ద నగరాలకు ధీటుగా షాపింగ్ మాల్ ను ఏర్పాటు చేసి మెన్స్, వుమెన్స్, కిడ్స్ వేర్ ను వినియోగదారులకు అతి తక్కువ ధరలకే అందిస్తున్న శింగిరికొండ రవీందర్, ఆయన కుమారుడు వంశీని అభినందించారు. తాను పవన్ కళ్యాణ్ అభిమాని అని, ఆయనతో హరిహర వీరమల్లు సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభాస్ తో రాజాసాబ్ సినిమా చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి పేరు వచ్చినట్లు తెలిపారు. తమ అభిమాన నటిని చూసేందుకు వచ్చిన సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలతో సందడి నెలకొంది. డాన్స్ చేస్తూ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు.





జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం 9 మార్చి 2026

# భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు - భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆధునిక అంతర్జాతీయ వ్యవస్థలో కీలక అంశంగా మారుతున్నాయి. 21వ శతాబ్దంలో ప్రపంచ రాజకీయాలు క్రమంగా భౌగోళిక వ్యూహాత్మక పోటీ కేంద్రంగా మారుతున్నాయి. మధ్య ప్రాచ్య ప్రాంతంలో ఏర్పడుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక నిర్మాణంపై ప్రభావం చూపగల ప్రధాన పరిణామాలుగా భావించబడుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు ఒకవైపు కొనసాగుతుండగా మరోవైపు ఇరాన్ మధ్య రాజకీయ సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ పరిణామాలు ప్రత్యక్షంగా పరోక్షంగా భారతదేశం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఎక్కువగా ఉంది. భారతదేశం శక్తి దిగుమతులపై ఆధారపడిన అభివృద్ధి విధానం కలిగి ఉండటం వల్ల అంతర్జాతీయ సంక్షోభాలు దేశీయ ధరల స్థిరత్వాన్ని దెబ్బతీయగలవు. పశ్చిమ దేశాల సైనిక రాజకీయ చర్యలు మధ్య ప్రాచ్య ప్రాంతంలో చమురు సరఫరా మార్గాలను అస్థిరతకు గురిచేయగల ప్రమాదం ఉంది. ప్రపంచ మార్కెట్లో చమురు సరఫరా తగ్గినప్పుడు ధరలు సహజంగా పెరుగుతాయి. భారతదేశం తన అవసరాల్లో సుమారు 80 శాతం పెట్రోలియం ఉత్పత్తులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది.

చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరుగుతుంది. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ఖర్చులు అధికమవుతాయి. దేశీయ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఏర్పడుతుంది. ఆర్థిక నిపుణులు ఈ పరిస్థితిని ద్రవ్యోల్బణ ఒత్తిడిగా విశ్లేషిస్తున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం ముఖ్యమైన స్థానం కలిగి ఉంది. అంతర్జాతీయ సంక్షోభాలు ఏర్పడినప్పుడు ఎరువుల ధరలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రపంచ ఎరువుల మార్కెట్ చమురు ధరలతో అనుసంధానమై ఉంటుంది. క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగితే నైట్రోజన్ ఆధారిత ఎరువుల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది.

రైతులు కొనుగోలు చేసే యూరియా, ఫాస్ఫేట్ ఆధారిత ఎరువుల ధరలు పెరగడం వల్ల వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం పడుతుంది. భారత వ్యవసాయ విధానం చిన్న సన్నకారు రైతులపై ఆధారపడి ఉండటం వల్ల ఈ వర్గం ధరల ఒత్తిడిని తట్టుకునే ఆర్థిక శక్తి తక్కువగా ఉంటుంది. ఫలితంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వినియోగ వ్యయం తగ్గే అవకాశం కనిపిస్తుంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు కొనసాగినప్పుడు ఆహార ధాన్యాలు, వంట నూనెలు, పప్పు ధాన్యాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉంటుంది. రవాణా వ్యయం పెరగడం ప్రధాన కారణంగా పరిగణించవచ్చు. పట్టణ ప్రాంత మధ్యతరగతి కుటుంబాల జీవన వ్యయం పెరుగుతుంది. సేవా రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గే అవకాశం ఉంటుంది.

ద్రవ్యోల్బణం 5 శాతం నుంచి 8 శాతం మధ్య పెరిగితే ఆర్థిక వృద్ధి వేగం మందగించే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

భారత పారిశ్రామిక రంగం చమురు ఆధారిత ఉత్పత్తి వ్యవస్థను ఉపయోగిస్తోంది. ప్లాస్టిక్, రసాయన పరిశ్రమలు, రవాణా రంగం ఎక్కువగా




పెట్రోలియం ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నాయి. చమురు ధరలు పెరిగితే తయారీ వ్యయం పెరుగుతుంది. ఎగుమతి పోటీ సామర్థ్యం తగ్గే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్లో భారత ఉత్పత్తుల ధరలు అధికమైతే కొనుగోలు తగ్గే ప్రమాదం ఉంటుంది.

అంతర్జాతీయ రాజకీయ సంక్షోభ సమయంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతారు. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలపై ఒత్తిడి ఏర్పడుతుంది. భారతదేశం కరెన్సీ విలువ తగ్గితే దిగుమతి వ్యయం పెరుగుతుంది. చమురు కొనుగోలు ఖర్చు పెరగడం ద్రవ్య లోటును విస్తరింపజేయగలదు.

భారత ప్రభుత్వం ధరల స్థిరీకరణ కోసం పెట్రోలియం నిల్వలను పెంచడం, ప్రత్యామ్నాయ శక్తి వనరులను ప్రోత్సహించడం, దేశీయ వ్యవసాయ ఉత్పత్తి పెంపు, ఎరువుల సబ్సిడీ విధానాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీర్ఘకాలికంగా సౌర శక్తి, హైడ్రోజన్ ఆధారిత ఇంధన వ్యవస్థల అభివృద్ధి ఆర్థిక భద్రతను పెంచుతుంది.

ప్రపంచీకరణ యుగంలో ఆధునిక ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా స్వయం సమృద్ధిగా ఉండటం సాధ్యం కాకపోయినా అంతర్జాతీయ వాణిజ్యం అవసరం. అయినప్పటికీ అత్యవసర రంగాల్లో దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెంపు అత్యంత ప్రాధాన్యం పొందాలి. భారతదేశం వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల సమతుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలి.

ధరల పెరుగుదల పేద వర్గాలపై అధిక ప్రభావం చూపుతుంది. పోషకాహార లోపం, గ్రామీణ వలసలు, ఉపాధి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రజా వ్యయం తగ్గితే దీర్ఘకాలిక మానవ మూలధన అభివృద్ధి మందగించగలదు. తదుపరి 12 నెలల కాలంలో మార్కెట్ అనిశ్చితి, చమురు ధరల ఊగిసలాట, ద్రవ్యోల్బణ ఒత్తిడి, ప్రభుత్వ విధాన జోక్యం వంటి మూడు దశల పరిణామాలు సంభవించే అవకాశం ఉంది.

పశ్చిమ దేశాల సైనిక రాజకీయ వ్యూహాలు ప్రపంచ ఆర్థిక సమతుల్యాన్ని ప్రభావితం చేసే శక్తి కలిగి ఉండగా, అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ చమురు మార్కెట్‌ను అస్థిరతకు గురి చేసే అవకాశం కలిగి ఉన్నాయి. భారతదేశం ఆర్థిక వ్యవస్థ శక్తి దిగుమతులపై ఆధారపడినందున ధరల ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తి, సేవా రంగాల సమన్వయ అభివృద్ధి సాధించినప్పుడే భవిష్యత్ ఆర్థిక భద్రత సాధ్యమవుతుంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళికలు, దేశీయ ఉత్పత్తి పెంపు, ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం ఆర్థిక స్థిరత్వానికి పునాది అవుతాయి. ప్రపంచ రాజకీయ సంక్షోభాలు తాత్కాలికమైనవిగా కనిపించినా వాటి ఆర్థిక ప్రభావం దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉంటుంది.

2.ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆధునిక అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో కీలక మలుపుగా నిలుస్తున్నాయి. ప్రస్తుత కాలంలో అంతర్జాతీయ శక్తి సమతుల్యం సైనిక వ్యూహాలు, వాణిజ్య విధానాలు, ఇంధన నియంత్రణ వ్యవస్థల ఆధారంగా రూపాంతరం చెందుతోంది. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు ప్రపంచ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు ఇరాన్ ప్రాంతీయ రాజకీయ స్థిరత్వంలో ప్రధాన పాత్ర పోషించే దేశంగా నిలుస్తోంది. ఈ మూడు దేశాల మధ్య కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పోటీ ప్రపంచ చమురు మార్కెట్ వ్యవస్థను అస్థిరత వైపు నడిపే అవకాశం కనిపిస్తోంది.

అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు ఎక్కువైనప్పుడు ఆర్థిక వ్యవస్థలు మొదటగా శక్తి రంగంలో ఒత్తిడిని ఎదుర్కొంటాయి. ప్రపంచ పరిశ్రమల నిర్మాణం ఇప్పటికీ చమురు ఆధారిత ఉత్పత్తి విధానంపైనే ఎక్కువగా ఆధారపడింది. రవాణా వ్యవస్థ, తయారీ పరిశ్రమలు, వ్యవసాయ యంత్రాలు, రసాయన ఉత్పత్తి రంగాలు చమురు సరఫరా స్థిరత్వంపైన ఆధారపడి ఉన్నాయి. సరఫరా వ్యవస్థలో చిన్న అంతరాయం ఏర్పడినా ప్రపంచ మార్కెట్లో ధరల పెరుగుదల సంభవించే అవకాశం ఉంటుంది.

భారతదేశం ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి మార్గంలో ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంది. భారతదేశం అభివృద్ధి నమూనా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల సమతుల్య వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. అయినప్పటికీ దేశీయ ఆర్థిక వ్యవస్థ శక్తి దిగుమతులపై ఆధారపడటం ఒక ప్రధాన సవాలుగా ఉంది. అంతర్జాతీయ సంక్షోభ పరిస్థితులు ఏర్పడినప్పుడు చమురు ధరల పెరుగుదల దేశీయ ద్రవ్యోల్బణ స్థాయిని ప్రభావితం చేయగలదు.

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం జీవనాధారంగా కొనసాగుతోంది. రైతుల ఆదాయం స్థిరంగా ఉండటం ఆహార భద్రతకు కీలక అంశంగా పరిగణించబడుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు పెరిగితే వ్యవసాయ ఉత్పాదక వ్యయం పెరుగుతుంది. చిన్న సన్నకారు రైతులు ధరల ఒత్తిడిని తట్టుకోవడం కష్టం కావచ్చు. అందువల్ల ప్రభుత్వాలు సబ్సిడీ విధానాలను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరం ఉంటుంది.

పట్టణీకరణ వేగం పెరుగుతున్న ప్రస్తుత కాలంలో మధ్యతరగతి కుటుంబాల జీవన వ్యయం పెరుగుతోంది. రవాణా ఖర్చులు, ఆహార వస్తువుల ధరలు, విద్యా వైద్య సేవల వ్యయాలు అధికమవుతున్నాయి. ద్రవ్యోల్బణం నియంత్రణలో లేకపోతే ప్రజల కొనుగోలు శక్తి తగ్గే ప్రమాదం ఉంది. ఆర్థిక అసమానతలు పెరిగితే సామాజిక స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం పడవచ్చు.

పారిశ్రామిక రంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్నా ఇంధన భద్రత సమస్య ప్రధాన సవాలుగా ఉంది. ఉత్పత్తి వ్యయం పెరిగితే అంతర్జాతీయ మార్కెట్లో పోటీ సామర్థ్యం తగ్గే అవకాశం ఉంటుంది. ఎగుమతి రంగం స్థిరంగా కొనసాగాలంటే దేశీయ పరిశ్రమలు అధిక సామర్థ్యంతో ఉత్పత్తి చేయాలి.

కరెన్సీ విలువ మార్పులు అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రభావితం చేస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెట్టుబడిదారులు స్థిరత్వం ఉన్న ఆర్థిక వ్యవస్థలను ఎంచుకునే అవకాశం ఎక్కువ. కాబట్టి ఆర్థిక విధానాల పారదర్శకత, ద్రవ్య విధాన నియంత్రణ అత్యంత అవసరం.

భారత ప్రభుత్వం దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కోసం ప్రత్యామ్నాయ శక్తి వనరుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. సౌర శక్తి, గాలి శక్తి, హైడ్రోజన్ ఇంధన వ్యవస్థల వినియోగం పెంచడం భవిష్యత్ ఆర్థిక వ్యూహంలో కీలక పాత్ర పోషిస్తుంది. దిగుమతి ఆధారిత ఇంధన వినియోగం తగ్గితే విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది.

విద్యా ఆరోగ్య రంగాల అభివృద్ధి మానవ మూలధన నిర్మాణానికి పునాది అవుతుంది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు యువత ఉపాధి అవకాశాలను పెంచగలవు. సాంకేతిక విద్యా వ్యవస్థ బలోపేతం చేస్తే దేశీయ పరిశ్రమలు ఆధునిక ఉత్పత్తి విధానాలను అనుసరించగలవు.

ప్రపంచీకరణ యుగంలో దేశాలు పూర్తిగా స్వయం సమృద్ధిగా ఉండటం సాధ్యం కాకపోయినా వ్యూహాత్మక స్వావలంబన అవసరం. అత్యవసర రంగాల్లో దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెంపు జాతీయ భద్రతకు బలం చేకూరుస్తుంది. వ్యవసాయ ఉత్పత్తి నిల్వ వ్యవస్థలు, ఆహార భద్రతా విధానాలు గ్రామీణ ఆర్థిక స్థిరత్వాన్ని పెంచగలవు. భవిష్యత్ కాలంలో అంతర్జాతీయ రాజకీయ సంక్షోభాలు పూర్తిగా తొలగిపోతాయని చెప్పలేం. అయినప్పటికీ శాంతి దౌత్య విధానాలు ప్రపంచ ఆర్థిక అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించగలవు. దేశాల మధ్య వాణిజ్య సహకారం పెరిగితే ఆర్థిక అస్థిరత తగ్గే అవకాశం ఉంది. సాంకేతిక విప్లవం ఆర్థిక వ్యవస్థ రూపాన్ని మార్చుతోంది. డిజిటల్ వాణిజ్యం, కృత్రిమ మేధా ఆధారిత ఉత్పత్తి వ్యవస్థలు భవిష్యత్ పరిశ్రమలను ప్రభావితం చేస్తాయి. దేశాలు సాంకేతిక పరిశోధనల్లో పెట్టుబడులు పెంచితే ప్రపంచ పోటీలో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది. మొత్తంగా పరిశీలిస్తే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తాత్కాలికమైనవి కావచ్చు కానీ వాటి ఆర్థిక ప్రభావం దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉంది. ప్రపంచ శాంతి స్థిరత్వం ఆర్థిక అభివృద్ధికి మూలాధారంగా నిలుస్తుంది. భారతదేశం తన ఆర్థిక వ్యూహాలను బలోపేతం చేసుకుని అంతర్జాతీయ మార్కెట్ మార్పులకు అనుగుణంగా విధానాలు రూపొందించుకోవాలి. సమతుల అభివృద్ధి, సామాజిక న్యాయం, సాంకేతిక పురోగతి దేశ భవిష్యత్ శ్రేయస్సుకు మార్గం చూపుతాయి.

డాక్టర్ . రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం.

# భారత్ మౌనం - వ్యూహమా, బలహీనతా?

## మధ్యప్రాచ్యంలో నైతికతకు, వాస్తవికతకు మధ్య సంఘర్షణ: భారత్ పాత్ర

ఇది భారత్ సంప్రదాయ విదేశాంగ విధానానికి పూర్తిగా విరుద్ధం. గతంలో ఎన్ని సంక్షోభాల్లోనైనా భారత్ అన్ని పక్షాలతో సంభాషణ కొనసాగించేది. కానీ ఇప్పుడు అమెరికా, ఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపడం వలన తనదైన "మధ్యవర్తిత్వ పాత్ర" అనే అవకాశాన్ని స్వచ్ఛందంగా కోల్పోయింది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఈ మౌనాన్ని "తటస్థత కాదు, విఫలమైన విదేశాంగం"గా విమర్శించారు.

భారత్ మౌనానికి మరో కారణం కూడా ఉంది. ప్రభుత్వం వాస్తవిక దృక్పథంతో ఆలోచిస్తోంది. గల్ఫ్ దేశాల్లో 1 కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరి భద్రత, చమురు వ్యాపారం, వ్యాపార ప్రయోజనాలు ప్రధానంగా అమెరికా-ఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపిస్తున్నాయి. కానీ, ఈ వాస్తవికతకు, నైతికతకు మధ్య సమతుల్యత కోల్పోయినట్లు కనిపిస్తోంది.

ప్రస్తుత అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం మధ్యప్రాచ్యాన్ని మరోసారి నిప్పులు గుప్పించేలా చేస్తోంది. ఇరాన్‌పై జరుగుతున్న ఈ దాడుల వలన అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమత్వం వంటి ప్రాథమిక సూత్రాలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ఈ సందర్భంలో భారత్ తీసుకుంటున్న విదేశా విధాన వైఖరి మాత్రం చరిత్రాత్మకమైన నైతిక వైఖరికీ, ప్రస్తుత వాస్తవిక రాజకీయాలకూ మధ్య జరుగుతున్న సంఘర్షణకు అద్దం పడుతోంది.

### అమెరికా దాడుల చట్టబద్ధతపై సందేహాలు:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫిబ్రవరి 28న ఇరాన్ పై 'ఎపిక్ ఫ్యూరీ' ఆపరేషన్ ప్రారంభించారు. ఇరాన్ అణ్వాయుధాల తయారీ పూర్తి చేసుకుంటోందన్న ఆరోపణలతో ఈ దాడులు జరిగాయి. (ఈ విషయం అసత్యం అనే విషయం ప్రపంచానికి తెలుసు ) అయితే, అయితే ఈ యుద్ధం చట్టబద్ధమా! నైతికమా! అన్నది ప్రధాన ప్రశ్న .

ఐక్యరాజ్య సమితి చార్టర్ ప్రకారం, తక్షణ ముప్పు ఉన్నప్పుడు లేదా భద్రతా మండలి ఆమోదం ఉన్నప్పుడు మాత్రమే ఒక దేశం మరొక దేశంపై దాడి చేయవచ్చు. ఇక్కడ ఈ రెండు షరతులు పాటించటం జరగలేదు. ట్రంప్ అసలు ఐక్యరాజ్య సమితినీ, భద్రతా సమితినీ, అంతర్జాతీయ చట్టాలను, అంతర్జాతీయ కోర్ట్ ఆఫ్ జెస్టిస్ అనేవి ఉనికిలో ఉన్నట్లు కూడా ఆయన గుర్తించటం లేదు. పైగా వాటి మనుగడ కోసం అమెరికా ఇతర దేశాలకన్నా ఎక్కువ హృదా ఖర్చు చేస్తుంది అనే భావనతో ఉన్నాడు. కనుక ఐక్యరాజ్య సమితి సలహాలు, సూచనలు పట్టించుకొనే స్థితిలో లేడు. అంతేకాకుండా, దాడులకు ముందు రెండు రోజుల వరకు జెనీవాలో అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరుగుతుండటం మరింత ఆశ్చర్యకరం. దౌత్య చర్చలు జరుగుతుండగానే దాడులు ప్రారంభించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా జాతీయ గూఢచార సంస్థ డైరెక్టర్ మార్చి 2025లోనే ఇరాన్ అణ్వాయుధాల తయారీకి పూనుకోలేదని కాంగ్రెస్ కు నివేదించారు. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అటువంటి పరిస్థితిలో ఈ దాడులకు ఎలాంటి చట్టబద్ధత లేదని స్పష్టమవుతోంది.

### మోడీ ఇజ్రాయెల్ పర్యటన - సమయం, సందర్భం:

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 25న ఇజ్రాయెల్ పార్లమెంట్ నెసెట్లో చారిత్రాత్మక ప్రసంగం చేశారు. ఇదే మొదటిసారిగా ఓ భారత ప్రధాని ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించడం. ఆయన మాట్లాడుతూ, "అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడిలో ప్రపంచం ఛిన్నాభిన్నమైన కుటుంబాలకు భారత ప్రజల తరపున సంతాపం తెలియజేస్తున్నాను. ఈ సమయంలో భారత్ పూర్తి విశ్వాసంతో ఇజ్రాయెల్తో ఉంది" అని ప్రకటించారు.

ఈ పర్యటన సమయం చాలా కీలకం. ఆయన పర్యటన ముగిసిన రెండు రోజుల తర్వాతే అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమయ్యాయి. ఇంత సున్నితమైన సమయంలో ఇజ్రాయెల్తో బహిరంగంగా స్నేహహస్తం అందించడం, భారత్ ఇంతకాలం అనుసరిస్తున్న తటస్థ వైఖరిపై (అలీన విధానం అనే విదేశాంగ విధానం) పై ప్రశ్నలు లేవనెత్తింది. అంతర్జాతీయ మీడియా కూడా దీన్ని "అనుమానాస్పద, దౌత్యపరంగా ప్రమాదకరమైన చర్య"గా అభివర్ణించింది .

ఇజ్రాయెల్ జర్నలిస్ట్ ఒకరు మోడీ పర్యటనను నెతన్యాహూ ఎన్నికల ప్రచారానికి "చౌక బారు ప్రకటన"గా అభివర్ణించారు. (గతంలో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికల ప్రచారంలో అక్కడి ప్రవాస భారతీయులను ఉద్దేశించి " ఆప్ కా బార్ ట్రంప్ సర్కార్ " అనే నినాదాన్ని గుర్తుకు తెస్తుంది.) ఇజ్రాయెల్ పై అంతర్జాతీయ నేర న్యాయస్థానం వారెంట్ కూడా ఇప్పటికే జారీ చేసిన సమయంలో, గాజాలో జరుగుతున్న విధ్వంసం మధ్య ఈ పర్యటన జరగడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది .

ఇరాన్ పై దాడులు జరిగిన తర్వాత భారత్ స్పందన మౌనంగా ఉంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ మాత్రం లో గొంతుకతో బలహీనంగా, నీరసంగా "తీవ్ర ఆందోళన" నెమ్మదిగా వ్యక్తం చేసింది. కానీ, ఇరాన్ సార్వభౌమత్వ




ఉల్లంఘనపై మాత్రం నోరు తెరవ లేదు. స్పష్టమైన నిరసనను కూడా తెలపలేదు . ప్రధాని మోడీ మాత్రం ఇజ్రాయెల్ ప్రధానితో ఫోన్లో మాట్లాడి, "శత్రుత్వాలను త్వరగా ముగించాలని" కోరారు. కానీ ఇరాన్ నేతృత్వానికి కనీసంగా ఫోన్ కూడ (మర్యాద కోసం కూడా ) చేయలేదు. ఈ గ్లోబల్ ప్రపంచంలో ఏ విషయమైనా మనం దాచాలీ అనుకున్నా దాచలేం. అంతర్జాతీయంగా ప్రపంచ దేశాలు, అంతర్జాతీయ మీడియా, భారత ప్రజలు, విపక్షాలు భారత ప్రధాని వైఖరిని గమనిస్తున్నారు.

'చాబహార్ ఓడరేవు' - ప్రశ్నార్థకమైన భవిష్యత్తు:

ఇరాన్ తో భారత్ సంబంధాల్లో 'చాబహార్ ఓడరేవు' కీలకమైన ప్రాజెక్ట్. ఇప్పటివరకు భారత్ ఈ ప్రాజెక్ట్లో ￥370 మిలియన్ల పెట్టుబడి పెట్టింది. పాకిస్తాన్ ను దాటవేస్తూ మధ్య ఆసియాకు చేరుకోవడానికి ఇది వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన మార్గం. కానీ, ఇప్పుడు ఇరాన్ దృష్టిలో భారత్ శత్రు పక్షంలో చేరింది. ఇరాన్ కొత్త నేతృత్వం వస్తే, శత్రువుతో ఒప్పందాలు చేసుకున్న భారత్ ను అనుమానంతో చూస్తుంది. అమెరికా ఒత్తిడి కారణంగా చాబహార్ ప్రాజెక్ట్ భవిష్యత్తు ఇప్పటికే అనిశ్చితంలో పడింది . ఏప్రిల్ 2026 వరకు అమెరికా మినహాయింపు ఇచ్చింది. కానీ, ఆ తర్వాత ఏం జరుగుతుందో చెప్పలేం.

### నైతికతకు, వాస్తవికతకు మధ్య ఊగిసలాట:

భారత్ విదేశాంగ విధానం చరిత్రాత్మకంగా నైతిక విలువలపై ఆధారపడి ఉండేది. మహాత్మా గాంధీ "పాలస్తీనా సమస్యను" నైతిక, వలసవాద వ్యతిరేక సమస్యగా భావించారు . 1974లో వర్ణవివక్ష దక్షిణాఫ్రికాతో డేవిస్ కప్ ఫైనల్ ఆడడానికి నిరాకరించింది భారత్. అలాంటి నైతిక వైఖరి నేడు ఎక్కడో కోల్పోయినట్లు కనిపిస్తోంది. కానీ, ప్రస్తుత ప్రపంచ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. ఇజ్రాయెల్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో భారత్ కు కీలక భాగస్వామి. గల్ఫ్ దేశాలు చమురు, వ్యాపార, కార్మిక రంగాల్లో భాగస్వాములు. అమెరికా మొత్తం పాశ్చాత్య దేశాలతో సంబంధాలు బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం పూర్తి తటస్థత వహించటం సాధ్యమా అన్నది మరికొందరు భిన్న కోణంలో భావిస్తున్నారు.

### ఇంతకు నష్టపోయేది ఎవరు?:

ఈ యుద్ధంలో ఏ పక్షం గెలిచినా భారత్ నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇరాన్ పక్షం గెలిస్తే, చాబహార్ ప్రాజెక్ట్, మధ్య ఆసియా కనెక్టివిటీ ప్రమాదంలో పడతాయి. అమెరికా-ఇజ్రాయెల్ పక్షం గెలిస్తే, వారు తమ ప్రయోజనాలకు అనుగుణంగా మధ్యప్రాచ్యాన్ని పునర్నిర్మించుకుంటారు. భారత్ అందులో ద్వితీయ శ్రేణి భాగస్వామిగానే ఉంటుంది. చైనా ఇప్పటికే ఇరాన్ తో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఇరాన్ కొత్త నేతృత్వం చైనాతో మరింత సన్నిహితంగా ఉండవచ్చు. ఈ పరిణామాలు భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలకు విఘాతం కలిగించవచ్చు .

భారత్ విదేశాంగ విధానం ఒక కీలకమైన దశలో ఉంది. నైతిక విలువలకు, వాస్తవిక ప్రయోజనాలకు మధ్య సమతుల్యం కోల్పోకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇజ్రాయెల్ వైపు కనిపిస్తున్న మొగ్గు వలన భారత్ "మధ్యవర్తిత్వ పాత్ర" హోదాను కోల్పోయింది. ఇది తాత్కాలిక లాభాలకు దారితీయవచ్చు కానీ, దీర్ఘకాలంలో భారత్ స్వతంత్ర విదేశాంగ విధానానికి విఘాతం కలిగిస్తుంది.

గాంధీజీ బోధించిన నైతిక విలువలకు, నేటి ప్రపంచ వాస్తవిక రాజకీయాలకు మధ్య సమతుల్యం సాధించడమే భారత్ ముందున్న సవాలు. ఇందుకు పార్లమెంట్ ను విశ్వాసం లోకి తీసుకోవాలి. అన్ని విపక్షాలతో సంభాషణ కొనసాగించడం, స్పష్టమైన వైఖరి తీసుకోవడం అవసరం. మౌనం వలన లాభం లేదు. స్పష్టత వలన గౌరవం లభిస్తుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# పెళ్లి ఖర్చుకు తగ్గేదేలే

ఆధునిక టెక్నాలజీ హంగుల ప్రపంచంలో వివాహ మహోత్సవాలు రోజు రోజుకు మరింత ఆర్భాటంగా మారుతున్నాయి. ఒకప్పుడు ప్రముఖులు, సంపన్నులు మాత్రమే తమ హోదాను ప్రదర్శించేందుకు భారీగా ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. జీవన విధానంలో వచ్చిన మార్పులతో యువత తమకు నచ్చిన వ్యక్తితో జీవితాన్ని ప్రారంభించాలనే అభిప్రాయంతో ముందుకు వస్తోంది. కులమతాలకు అతీతంగా ఎన్నో జంటలు ఒక్కటవుతున్నాయి. తల్లిదండ్రులు కూడా పిల్లల అభీష్టాన్ని గౌరవిస్తూ పెళ్లిళ్లను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఇటీవలి కాలంలో పెళ్లి ఖర్చులు భారీగా పెరిగినట్టు పలు సర్వేలు సూచిస్తున్నాయి. "వెడ్ మి గుడ్" అనే సంస్థ నిర్వహించిన సర్వేలో గత సంవత్సరాలతో పోలిస్తే వివాహ వ్యయం గణనీయంగా పెరిగినట్లు వెల్లడైంది. 2022లో సగటు పెళ్లి ఖర్చు సుమారు రూ.25 లక్షలు కాగా, 2023లో అది రూ.28 లక్షలకు చేరింది. 2024 నాటికి అది మరింత పెరిగి సగటున రూ.36.5 లక్షలకు చేరిందని ఆ సర్వే తెలిపింది. డెస్టినేషన్ వెడ్డింగ్స్ కోసం సగటు ఖర్చు రూ.51.1 లక్షలకు పైగా ఉందని పేర్కొంది. పెళ్లికి కోటి రూపాయలకుపైగా ఖర్చు చేసే వారు సుమారు 9 శాతం ఉన్నారు. అలాగే రూ.50 లక్షలకుపైగా ఖర్చు చేసే వారు 18 శాతం, రూ.25 లక్షల లోపు ఖర్చు చేసే వారు సుమారు 60 శాతం ఉన్నారు. పెళ్లి ఖర్చుల కోసం రుణాలు తీసుకునే వారు కూడా దాదాపు 12 శాతం వరకు ఉన్నారని వెల్లడైంది. మొత్తం మీద భారతదేశంలో వివాహ మార్కెట్ విలువ సంవత్సరానికి సుమారు రూ.6 లక్షల కోట్లకు చేరిందని అంచనా.

### అందరికీ నచ్చినట్లే..

వివాహాలకు ఇంతగా ఖర్చు చేయడానికి అనేక కారణాలు ఉన్నాయి. యువత చిన్న వయసులోనే మంచి ఉద్యోగాలు సంపాదిస్తూ అధిక ఆదాయం పొందుతోంది. భవిష్యత్తులో మరింత సంపాదించగలమనే ధీమాతో పెళ్లి వేడుకలపై భారీగా ఖర్చు చేస్తున్నారు. తల్లిదండ్రుల వద్ద సరిపడా డబ్బు లేకపోతే యువతే ఆర్థికంగా ముందుకు వచ్చి ఖర్చు భరిస్తోంది.

పట్టణాల్లో ఉన్న కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టులు, విదేశీ డెస్టినేషన్‌లు వివాహాలకు వేదికలవుతున్నాయి. సంపన్నులు, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహిస్తుంటే, మధ్యతరగతి కుటుంబాలు కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో వేడుకలు నిర్వహిస్తున్నాయి. ప్రీ-వెడ్డింగ్ షూట్ నుంచి ఎంగేజ్మెంట్, బ్యాచిలర్ పార్టీలు, మెహందీ, సంగీత్, హల్దీ, పెళ్లి, రిసెప్షన్ వరకు ప్రతి కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తూ భారీగా ఖర్చు చేస్తున్నారు.

వెడ్డింగ్ కార్డులు, ఫోటోగ్రఫీ, అలంకరణలు, విందు వంటి ఏర్పాట్లకు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒక ప్లేటు భోజనానికి దాదాపు రూ.2000 వరకు ఖర్చు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అతిథులకు వందకు పైగా రకాల వంటకాలు వడ్డించడం కూడా సాధారణంగా మారింది.

ఇప్పటివరకు పెళ్లిళ్లలో కట్టకనుకలకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది. కానీ సమాజంలో వచ్చిన మార్పులతో ఆస్తులను కుమార్తెలకు కూడా సమానంగా పంచే విధానం పెరిగింది. దీంతో కట్టకనుకల కంటే వివాహ వేడుకలపై ఖర్చు పెట్టే ధోరణి పెరిగింది.

### టెక్నాలజీతో కొత్త ట్రెండ్

ఇటీవలి కాలంలో పెళ్లి ఆహ్వాన పత్రికలు కూడా కొత్త రూపం దాల్చాయి. ఒకప్పుడు సాధారణంగా ఉండే శుభలేఖలు ఇప్పుడు టెక్నాలజీతో ముస్తాబై ఆకర్షణీయంగా మారాయి. వెండి, బంగారు అక్షరాలతో అచ్చు వేసిన కార్డులు, ప్రత్యేక డిజైన్లు, బాక్స్ ఇన్విటేషన్లు, దేవతల ప్రతిమలతో కూడిన ఆహ్వాన పత్రికలు ఇప్పుడు ట్రెండ్‌గా మారాయి.

కొత్తగా వర్చువల్, ఎన్ఎఫ్‌సీ, 3డీ వెడ్డింగ్ ఇన్విటేషన్ కార్డులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్డును ఫోన్‌తో స్కాన్ చేస్తే వధూవరుల చిత్రాలు, వివాహ కార్యక్రమాల వివరాలు వీడియో రూపంలో కనిపించేలా రూపొందిస్తున్నారు. హల్దీ, మెహందీ, సంగీత్ వంటి కార్యక్రమాల వివరాలు కూడా అందులో చూపిస్తున్నారు. కొందరు వీడియో ఇన్విటేషన్లు రూపొందించి, కుటుంబ సభ్యుల సందేశాలతో అతిథులను ఆహ్వానిస్తున్నారు. ఇంకా కొందరు టెంపుల్ థీమ్ బాక్స్ ఇన్విటేషన్లు తయారు చేయిస్తున్నారు. బాక్స్ తెరిస్తే దేవతల విగ్రహాలు, మిఠాయిలు, పెళ్లి వివరాలు కనిపించేలా రూపొందిస్తున్నారు. మరికొందరు పజిల్ కార్డులు, ఆటల రూపంలో ఉండే ఆహ్వాన పత్రికలను రూపొందిస్తున్నారు. చదరంగం, లూడో, జిగ్సా పజిల్‌ల మాదిరిగా ఉండే ఈ కార్డులు అతిథులను ఆకట్టుకుంటున్నాయి.

### ఫ్యాషన్‌గా మారుతున్న ఖర్చు..

ఈ విధంగా వివాహ వేడుకలు ఒక ఫ్యాషన్‌గా మారుతున్నాయి. ఆర్థికంగా స్థోమత ఉన్నవారు భారీగా ఖర్చు చేస్తే అభ్యంతరం లేదు. కానీ కొందరు తమ స్థాయికి మించి కేవలం ప్రతిష్ఠ కోసం అప్పులు చేసి పెళ్లిళ్లను ఆర్భాటంగా నిర్వహించడం ఆందోళనకరం.

వివాహం జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టం. కానీ ఆ వేడుకను ఆర్థిక స్థోమతను దృష్టిలో ఉంచుకొని నిర్వహించడం అవసరం. అధిక డబ్బు ఉంటే పేదలకు సహాయం చేయడం, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ఖర్చు చేయడం కూడా ఒక మంచి సంప్రదాయంగా మారాలి.

అప్పుడు మాత్రమే వివాహ వేడుకలు ఆర్భాటానికి పరిమితం కాకుండా మానవీయ విలువలను ప్రతిబింబించే వేడుకలుగా నిలుస్తాయి.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

## యుద్ధోన్మాదుల తరిమేద్దాం.

మమకారంతో
మెత్తగా పిసికి
గోరు ముద్దల
అమ్మచేతి ఉగ్గన్నం
తినిపించే వేళలు లేవిప్పుడు ..
ఆకాశంలో జాబిలికేసి
వేలు చూపుతూ
మినుకు మినుకు తారల
అందాలు వివరిస్తూ
మురిపాలు పంచే
అమ్మల అనురాగాలు
మచ్చుకైనా కనపడవిప్పుడు ..
బువ్వదినకపోతే
బూచోడొస్తాడని
పసివాడని నోట్లో
పరమాన్నం పెడుతూ
వీపునిమిరే చిర్నవ్వులు
కనపడవిప్పుడు ..
బిడ్డల బుజ్జి బుజ్జి
బుగ్గలను నిమురుతూ
కొసరి కొసరి
కడుపు నింపే అమ్మలూ..
ఆ వెచ్చని వొడిలో
సేద తీరే బిడ్డలూ..
మిగిలి లేరిప్పుడక్కడ...
ఎక్కడ జూసినా
నలుదిక్కులా కమ్ముకుని
మానవ దేహాల కమురు వాసనలే..
ఎప్పుడు జుసినా
వొళ్ళు గగుర్పొడిచే
బాంబుల మోతలే..
రెప్పవాల్చే లోపల
చూపులు తేలేసిన
వందలాది ఛిద్రమైన దేహాలే..
కుప్పకూలిన ఇళ్ల
పొగలు చిమ్మే శకలాల కింద
కుప్పలుగా కప్పుకుపోయినవీ
చెల్లచెదురై దారులేల్లా
పర్చుకుపోయి
వేలాది తల్లులూ బిడ్డల దేహాంగాలే..
అక్కడ మిగిలి ఉన్నాదల్లా
ఉవ్వెత్తున ఎగిసిన
హాహాకార విలాపాలే..
దట్టమైన పొగలు నిండిన
కారుమబ్బుల ఆకాశంలో
మంటలు విరజిమ్ముకుంటూ
దూసుకు వొచ్చే శతఘ్ను లే..
పరాయి దేశాల సంపదపై
కన్నేసిన దుండగ దుర్నీతే..
రసాయన ఆయుధాల సాకుతో
లెక్కకు మించిన వందల వేల
విష వైమానిక మిసైళ్ళ
నిప్పుల వర్షం
ఆపకుండా కురిపించడం
సడలని దినచర్య గా
రికార్డు చేసుకు పోతున్నాయి
అక్కడి ఉదయాస్తమయాలు...
ఆకలని అల్లాడే జనుల
ఆకలి దప్పులు తీర్చజాలనిది
అత్యాధునిక శాస్త్ర
సాంకేతికతెట్లవురా
వెధవా అంటూ అడిగేదివ్వరు..
ఉన్న చోటునుండే
భూగోళం మీదెక్కడున్నోళ్ళనైనా
అంతంచేసే అణ్వాయుధాల
సృష్టించిన వీర ఘనత
నాదంటే నాదంటూ మొరుగుతు
మిడిసి పడే కొవ్వెక్కిన మదమృగాల్
అమెరికా.. ఇజ్రాయెల్.. దాని
తొత్తుల్
ఏవైతేనేం హంటర్ కిల్లర్ చిల్లర
గాళ్ళే..
తిథులను పెట్టి తొడలు గొట్టి
లోకము నెల్లా ఖాబ్జా జేస్తని
జనాన్ని జంపే ఈ ఖుని ఖోర్లకు
అడ్డే లేదా..అదుపే లేదా..!
రాజు ను అంతం జేస్తని జెప్పి
రాజేసిన నీఛపు యుద్ధంలో
పిల్లను..తల్లిని.. ఎంచక
ముసలని.. ముతకని కానక
ఆసుపత్రులూ.. బడులని..
నివాసముండే ఇళ్లని జూడక
విచ్చలవిడిగా విమాన దాడులు..
వొక ఇరాను ప్రజలనే గాదు
మొత్తం మానవాళినే
సర్వం తుద ముట్టించే
పైషాచిక ఆనందంపు
సామ్రాజ్యవాదుల
సాయుధ సంహార ఆటలు
యుద్ధ ఉన్మాద దాడులు
అంతం అయ్యే దారే లేదా...!!
నేనూ నా పరివారం
నా సర్వాంగములు
క్షేమమే అంటూ
ఎవడేమ్ జస్తే నాకేమంటూ
చూస్తూ ఊరక ఉండే
ప్రతి వెధవా యుద్ధోన్మాదే..
ఈ అధర్మ యుద్ధం ఆపండంటూ
ఏ బాంబో మనపై పడి పేలకముందే
గొంతులనిప్పుదాం..గర్జిద్దాం..
యుద్ధోన్మాదుల తరిమేద్దాం...

డా. ఇక్బాల్ పాషా
9440775732

# మహిళలు స్వయం సాధికారతతో ముందుకు సాగాలి

**హయత్‌నగర్, మార్చి 8 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శారదనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా నిర్మించిన మహిళా భవనం ప్రారంభోత్సవం, మహిళా దినోత్సవ కార్యక్రమాలకు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని వారు తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వారు చెప్పారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, బేటీ బచావో బేటీ పడావో, ప్రధాన మంత్రి ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడుతున్నారని వారు అన్నారు. మహిళల అభివృద్ధికి



మాత్రమే కాకుండా దేశంలోని లోక్‌సభ, రాష్ట్ర చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని తెలిపారు. మహిళలు స్వయం సాధికారతతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి కుటుంబం, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. శారదా నగర్ మహిళా భవన్ మహిళల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, వివిధ సామాజిక కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు ప్రదీప్, మహిళా సంఘం అధ్యక్షురాలు రమ దేవి, సంఘం సభ్యులు వర్షిణి, ఇందిర, పుష్పంజలి, లక్ష్మి, చంద్రిక దీప్తి, అనిత, శ్రీదేవి, కళ్యాణి, నసీమ, అరుణ, జ్యోతి, సావిత్రి గౌరీ, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళతోనే దేశం అభివృద్ధి

**నిజాంపేట, మార్చి 8 (జనం సాక్షి) :** మహిళలతోనే దేశం అభివృద్ధి సాధ్యమని మాజీ మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కొమ్మట బాబు అన్నారు. ఆదివారం రోజున మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో పారిశుద్ధ కార్మికులు, పంచాయతీ సభ్యులకు జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శు



భాకాంక్షలు తెలిపారు అలాగే శాలువాలతో సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలతోని సాధ్యమన్నారు. కుటుంబ బాధ్యత భుజాన వేసుకొని సమాజ భద్రత కోసం అహర్నిశలు పాటుపడే ది మహిళలే అని తను కొనియాడారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, పారిశుద్ధ కార్మికులు, పంచాయతీ సభ్యులు ఉన్నారు.

# శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు అత్యంత కీలకం



**ముషీరాబాద్, మార్చి 8 (జనం సాక్షి) :** క్రీడలు కేవలం సరదా కోసం మాత్రమే కాకుండా, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి అత్యంత ఉపయోగకరమని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ లు చెప్పారు. ఈ మేరకు హైదరాబాదు బాగ్లింగంపల్లి లోని సుందరయ్య పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును ఆదివారం వాకర్స్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షటిల్ ఆడడం యువత కే కాకుండా మధ్య వయసు, వయసు పైబడిన వారికి కూడా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. షటిల్ వంటి ఆటలు వేగం, దృష్టి, శారీరక సామర్థ్యం పెంచడంలో, రక్తప్రవాహం మెరుగుపరచడంలో, కండర శక్తిని పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. యువత మాత్రమే కాదు, మధ్య వయసు, వయసు పైబడిన వారు దీని ద్వారా శ్రద్ధ, సమయపాలన, చురుకుదనం సాధించవచ్చనీ తెలిపారు. నిరంతర వ్యాయామం, క్రీడల్లో పాల్గొనడం వలన శరీరంలోని ఎండోఫిన్‌లు స్రవించడం, ఒత్తిడి తగ్గించడం, మానసిక శాంతి, హృదయ ఆరోగ్యం, కీళ్ళు, మోకాల పటుత్వం కాపాడుకోవడం వంటి లాభాలు ఉంటాయన్నారు. ఇది ఏ వయసు వారికైనా ప్రారంభించదగిన సమర్థ వ్యాయామం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, ముఠా జయసింహ, కళ్యాణ్ నాయక్, నవీన్ నాయక్, నాగభూషణ్, శ్రీనివాస్ రెడ్డి, అంజి యాదవ్, నిరంజన్ రెడ్డి, నిమ్మ రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్, దామోదర్ రెడ్డి, ప్రభాకర్, లోకేష్ యాదవ్, వివేక్ కానంద్,మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ ప్రారంభం

**శేరిలింగంపల్లి, మార్చి 8 (జనంసాక్షి) :** భాగ్యనగరం మరో అంతర్జాతీయ క్రీడా వేదికకు ఆదివారం సాక్షి భూతంగా నిలిచింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి పరిధి హాకీ స్టేడియంలో 'మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్--2026' పోటీలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్), తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్‌లో ఎనిమిది దేశాల జట్లు పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాష్ట్ర క్రీడా శాఖా ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగింది. తొలి రోజు పోటీలకు సైబరాబాద్ పోలీస్ బాస్ డాక్టర్ ఎం. రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీలు నగరంలో నిర్వహించడం యువ క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. మ్యాచ్ లకు సంబంధించి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ ఒ ఎం.డి డాక్టర్ ఎ. సోనిబాలా దేవి కూడా పాల్గొన్నారు. మొత్తం ఎనిమిది జట్లు రెండు



పూల్‌లుగా విడిపోయి లీగ్ దశలో తలపడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 12:45 గంటలకు ఇంగ్లాండ్– ఇటలీ మధ్య తొలి మ్యాచ్ జరుగగా అనంతరం కొరియా–ఆస్ట్రియా, స్కాట్లాండ్–వేల్స్ జట్లు పోటీ పడ్డాయి. స్వదేశీ గడ్డపై భారత మహిళల జట్టు బోణీ కొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## చట్టాలను గౌరవించి బాధ్యతగా వ్యవహరించాలి



**హయత్‌నగర్, మార్చి 8 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ లోని భూలక్ష్మి నగర్ కాలనీలో కాలనీవాసుల ఏర్పాటు చేసిన చట్టాల పై అవగాహనా సదస్సు లో స్థానిక హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐఏఎస్ అధికారి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన ఉండడం చాలా అవసరమని తెలిపారు. రోజువారీ జీవితంలో మనం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చట్టాలను వివరించి, సమాజంలో శాంతి భద్రతలు, క్రమశిక్షణ కోసం ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించి, పాటించాలని సూచించారు. కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం చాలా అవసరమని అన్నారు. సమాజంలో సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చట్టాలపై స్పష్టత పెరుగుతుందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భూలక్ష్మి నగర్ కాలనీలో సేవలందిస్తున్న పారిశుధ్య మహిళా కార్మికులను కళ్లెం నవజీవన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. సమాజ పరిశుభ్రత కోసం వారు చేస్తున్న సేవలను అభినందిస్తూ, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాసిపతి, బీజేపీ సీనియర్ నాయకులు సంఘీ అశోక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మహిళలదే ప్రధాన పాత్ర

- **మున్సిపల్ చైర్మన్ సిఎం సురేష్**

**అయిజ, మార్చి 8 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన మహిళలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం హర్షనీయమని అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అన్నారు. మహిళలు విద్య, ఉద్యోగాలు, సామాజిక రంగాల్లో పూర్తిస్థాయిలో రాణిస్తేనే ఆ ఫలితాలు భవిష్యత్ తరాలకు నిజమైన ఉపయోగకరంగా ఉంటాయన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, ప్రతి ఆడపిల్లకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్నారు. హక్కులు, సమానత్వం, భద్రత కోసం అందరూ కలిసికట్టుగా ఉండాలని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలు చేపట్టే పనులన్నీ విజయవంతమైన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఈ సందర్భంగా సీఎం సురేష్ అన్నారు. పట్టణంలోని మహిళా



సభ్యులందరూ మున్సిపల్ చైర్మన్ సురేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేదింటి అడబిడ్డలకు సహకారం అందిస్తాం

**చేవెళ్ల, మార్చి 8 (జనంసాక్షి) :** పేదింటి అడబిడ్డల పెళ్లిలకు తమవంతు సహకారం ఉంటుందని చేవెళ్ల మాజీ సర్పంచ్, చేవెళ్ల మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ బండారి శైలజాఆగి రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ 15వ వార్డు ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వడ్డే సుజాత



కూతురు వివాహానికి రూ. 25వేలు చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డితో కలిసి మహిళా దినోత్సవం సందర్భంగా 15వ కౌన్సిలర్ బండారి శైలజాఆగిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని, పేదింటి అడబిడ్డల పెళ్ళిలకు తమ సహకారం ఉంటుందన్నారు. వార్డు ప్రజలకు ఏ అవసరాలు వచ్చిన తీర్చేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగలి కళ్యాణియాదగిరి, మద్దెల శ్రీనివాస్, అత్తెల్లి మనీషాఅనంత్ రెడ్డి, సోలిపురం సుచితబల్వంత్ రెడ్డి, బక్కరెడ్డి మాధవియాది రెడ్డి, కుర్వ మంగమ్మ మల్లేష్, డప్పు సువర్ణచందు, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, అత్తెల్లి నరేందర్ రెడ్డి, గుత్తి శేఖర్ తదితరులు ఉన్నారు.

## సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

**తాండూరు, మార్చి 8 (జనంసాక్షి) :** సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. తాండూర్ మున్సిపాలిటీ పరిధిలో



మొండి బకాయలు ఉన్న యజమానులకు శనివారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి రెడ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ బకాయి దారులు వెంటనే ఆస్తి పన్ను చెల్లించాలని మొండి బకాయి దారులు చెల్లించకపోతే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, ఆర్ ఐ రాములు, వార్డ్ ఆఫీసర్లు స్నేహ లతా రెడ్డి, అనిల్ కుమార్, తేజస్విని, బిల్ కలెక్టర్ హైమద్ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలి



**ఇబ్రహీంపట్నం, మార్చి 8 (జనం సాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో రాణించి,ఆర్థికంగా బలోపేతం కావాలని,తులేకలాన్ సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలో వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలను ఘనంగా సన్మానించారు.అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షిశీచారు. అనంతరం గ్రామానికి చెందిన చిలుకల సత్యనారాయణ అరుణ దంపతుల కుమార్తె బాస్కెట్ బాల్ లో జాతీయస్థాయిలో ఎంపికైనందున వారిని ఘనంగా సన్మానించారు. ఒక నిరుపేద కుటుంబం నుంచి జన్మించి జాతీయస్థాయిలో ఎంపికవ్వడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేష్ , ఉపసర్పంచ్ జగదీష్ , వార్డు సభ్యులు అచ్చన మౌనిక , బోడ కృష్ణకుమారి , హనుమండ్ల ఆంజనేయులు , సుర్వి జనార్ధన్ గౌడ్ , బోడ స్కైలాబ్ , జక్కుల అర్చన, బండి సంతోష ,గజ్జెల మహేష్, అంగన్వాడీ టీచర్స్ దయ్యాల యాదమ్మ , సామ సంతోష,విద్యా కమిటీ అధ్యక్షురాలు దాచపల్లి కమలమ్మ , ఫీల్డ్ అసిస్టెంట్ జక్కుల యమున, విలేజ్ బుక్ కీపర్లు దయ్యాల భాగ్యమ్మ , బాకారం మంజుల, మహిళా సంఘం అధ్యక్షురాలు లచ్చగారి మమత , కార్యదర్శి కలకొండ పద్మ , సభ్యులు సామ మంజుల,గ్రామస్తులు, పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్ తోట సాగుపై రైతులకు శిక్షణా శిబిరం

**శ్రీరంగాపూర్ మార్చి 8 (జనం సాక్షి) :** వీపనగండ్ల మరియు చిన్నంబావి మండలాలకు చెందిన ఆయిల్ పామ్ రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండలం, కంబల్లాపూర్ గ్రామంలో అభ్యుదయ రైతు శ్రీ ఆనంద్ రెడ్డి ఆయిల్‌పామ్ తోటలో క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఆయిల్ పామ్ సాగులో రైతులు అనుసరించవలసిన శాస్త్రీయ పద్ధతులు, పంట నిర్వహణ మరియు అధిక దిగుబడులు సాధించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీ కృష్ణయ్యమాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే రైతులకు మంచి దిగుబడులు మరియు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సరైన ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, పురుగు మరియు వ్యాధి నియంత్రణ పద్ధతులు, అలాగే సమగ్ర పంట యాజమాన్యంపై రైతులకు వివరంగా సూచనలు ఇచ్చారు. ఆయిల్ పామ్ తోటల్లో సరైన సమయంలో నీరు మరియు ఎరువులను అందించడం చాలా ముఖ్యమని తెలిపారు. కాపు వచ్చిన తోటలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి మొక్కకు 500 గ్రాముల యూరియా, 1 కిలో పోటాష్ మరియు 2 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులు వేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి మొక్కకు 80 గ్రాముల బోరాన్ మరియు 200 గ్రాముల మెగ్నీషియం



సల్ఫేట్ ఇవ్వడం ద్వారా మొక్కల పెరుగుదల మెరుగుపడి అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వివరించారు. చౌడు భూములు ఉన్న ప్రాంతాల్లో ముందుగా జిప్సమ్ వేయించి పది రోజుల తరువాత ఎరువులు వేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు. అదనంగా ప్రతి సంవత్సరం కనీసం ఒకసారి పశు వుల ఎరువులు వేయడం ద్వారా నేల సారాన్ని పెంచుకోవచ్చని రైతులకు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీలు మరియు ప్రోత్సాహకాలను రైతులకు వివరించారు. ఆయిల్ పామ్ నాటే మొక్కలు, ఎరువులు, నీటి వనరుల ఏర్పాటు, డ్రిప్ సిస్టమ్ మరియు ఇతర సాగు ఖర్చులపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల ద్వారా రైతులు ఎక్కువగా లబ్ధి పొందాలని కోరారు. ఈ సందర్భంగా అభ్యుదయ రైతు శ్రీ ఆనంద్ రెడ్డి తన ఆయిల్ పామ్ సాగులో పొందిన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. తాను అనుసరిస్తున్న సాగు పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, అలాగే అధిక దిగుబడులు సాధించడానికి తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించారు. తన తోటను రైతులకు చూపిస్తూ క్షేత్రస్థాయిలో పంట నిర్వహణ విధానాలను వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రీ యూనిక్ ఆయిల్ కంపెనీ ఏరియా మేనేజర్ శ్రీ కేతన్ రెడ్డి మాట్లాడుతూ కొత్తకోట మండలం సంకిరెడ్డి పల్లి సమీపంలో త్వరలోనే ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లు ప్రారంభం కానుందని తెలిపారు. రైతులు కోసిన ఆయిల్ పామ్ గెలాలను సకాలంలో కొనుగోలు చేయడానికి కలెక్షన్ సెంటర్ల ద్వారా సేకరణ చేపడుతున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కంబాలాపూర్ సర్పంచ్ పి విజయ్ కుమార్ రెడ్డి, విపన్ గాండ్ల మరియు చిన్నంబావి క్లస్టర్ ఆఫీసర్ మహేశ్, అలాగే పెబ్బేరు మరియు శ్రీరంగాపూర్ మండలాల క్లస్టర్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయిల్ పామ్ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణను ఆసక్తిగా వినిపించారు మరియు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి



**అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 8 (జనం సాక్షి) :** పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని బీసీ కాలనీలో సిపిఎం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు గుండె శివకుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మోదీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచే విధంగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచిందని విమర్శించారు. పెరిగిన గ్యాస్ ధరలతో పేద మరియు మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. సామాన్య ప్రజలపై అదనపు భారం మోపడం మానుకుని, పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పేదల పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న మొండి వైఖరిపై తీవ్రంగా మండిపడిన ఆయన, ఇదే విధంగా కొనసాగితే ప్రజలు తిరుగుబాటు చేయక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం స్పందించి పెంచిన ధరలను తగ్గించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిర్ర శివశంకర్, సురేష్, ప్రణయ్, మహేష్, రంగయ్య, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
09 మార్చి 2026

# తునికి కేవికేలో ఆహార ప్రాసెసింగ్ ల్యాబ్, రైతు వసతిగృహం ప్రారంభం

- రైతుకు వ్యవసాయానికి అనుబంధం కృషి విజ్ఞాన కేంద్రం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- మంత్రి బండి సంజయ్ కుమార్



**కౌడిపల్లి, మార్చి 8 (జనంసాక్షి) :** ఆదివారం కౌడిపల్లి మండలం కృషి విజ్ఞాన కేంద్రం-మెదక్ (తునికి) నందు ఆహార ప్రాసెసింగ్ ల్యాబ్, రైతు వసతి గృహం, ప్రారంభోత్సవ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్, ణూా=జు కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్,అఖిల భారతీయ కార్యకారని సదస్య భాగయ్య, ఇతర ప్రముఖులు ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి భారత హోం వ్యవహారాల సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జీవ నియంత్రణ ప్రయోగశాలను పరిశీలించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్ ను శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్‌లో పరికరాల పనితీరు ల్యాబ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న వివిధ పంటలను, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్లను పరిశీలించారు. అనంతరం మొక్క నాటారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భారత హోం వ్యవహారాల సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్, మాట్లాడారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సేంద్రీయ వ్యవసాయ రంగంలో రైతులను తయారు చేయడం ఏకలవ్య ఫౌండేషన్ ముందు చూపుతో వ్యవహరిస్తుందని అన్నారు. కేవీకెలో రైతులకు వసతిగృహం కట్టడం మంచి ఆలోచన అని.. ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అద్భుతం అని పేర్కొన్నారు 200 గ్రామాల ప్రజలు ఏడుగురు సైంటిస్టులు ఇక్కడ పనిచేయడం మామూలు విషయం కాదని వెల్లడించారు. రైతులకు ఏ కష్టమైనా ఏ ఇబ్బందున్న వారి సమస్యల పరిష్కారం కోసం కేవీకే ముందుకు వస్తుందన్నారు. రైతుకు వ్యవసాయానికి అనుబంధం కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని అన్నారు. మంచి విద్యార్థులను తయారు చేస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుంది అని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని ఆలోచనతో ముందు చూపుతో వ్యవహరిస్తుందన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ అందరికీ మెతుకులు పెట్టిన జిల్లా మెతుకు సీమ అని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆర్గానిక్ వైపు పరిగెడుతుశీదన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే సంస్థ కేవికె అన్నారు. రైతులు ఏ రకమైన పంటలు పండిస్తే భవిష్యత్తు బాగుంటుందో కేవికెల ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. రసాయన అవసరం లేకుండా సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను మళ్లించే ప్రయత్నం చేస్తుందని, రైతన్నలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచినా సంస్థ కేవికె అని కొనియాడారు. ఎలక్ట్రిక్ సిఎన్‌జి వాహనాలు వాడటం వల్ల చమూర్ నిల్వలు లేవని భయపడాల్సిన అవసరం ఉండదని అన్నారు. ప్రతి రైతు తానే తనకు అవసరమైన పెరటిలో పశువుల పెంపకంతో పాటు కూరగాయల సాగు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరు సేంద్రియం వైపు అడుగులేస్తూ దేశాన్ని సేంద్రియశీ వైపు నడిపించాలి. సేంద్రియ వ్యవసాయం వైపు నడిపిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ మంగీలాల్ జాట్ సెక్రెటరీ డిఏఆర్ఈ మాట్లాడుతూ వికసిత్ భారత్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందని, ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ రంగంలో మరింత సాంకేతికత గ్రామాలకు అందాలని చెప్పారు. వికసిత్ భారత్ వెలిగిపోతుందన్నారు. అఖిల భారతీయ కార్యకరణి సదస్య( తీంం) భాగయ్య.. మాట్లాడుతూ రాజకీయాలు పక్కన పెట్టి మన గ్రామాలు అభివృద్ధి చేయాలన్నారు. అందరం కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ఈ ల్యాబ్ కోసం టాటా కంపిని సహాయం చేసిందని వెల్లడించారు. రైతులు రెండో పంట వరి వేయకూడదు వరి వేస్తే కష్ట పడలిసిన అవసరం లేదని రైతులు ఆలోచన భిన్నంగా ఉందన్నారు. రెండో పంట నుండి రైతులు మారాలని నేటి దైనందిక జీవితంలో పసుపు, కారం తో పాటు ప్రతిది కల్తీ ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపితే మన ఆరోగ్యాలు ఎంతో బాగుపడతాయన్నారు. ఉగాది నుండి భూమి సుపోషణ అనే కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో దేవాలయం వద్ద చేయాలన్నారు. అనంతరం ప్రముఖులు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం గొప్పతనాన్ని కొనియాడారు చివరిగా జీవ నియంత్రణ పుస్తక ఆవిష్కరణ నిర్వహించిన అనంతరం ముఖ్య అతిథులను శాలువాలు మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, శ్రీదేవ్ కుమార్, డీఏవో, మెదక్ కౌడిపల్లి మండల వ్యవసాయ అధికారి స్వప్న, టాటా కెమికల్స్ ముంబై, రాజీవ్ రత్న, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు, ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కోహెడ, మార్చి 8 (జనంసాక్షి) :** మండలం లోని తీగలకుంటపల్లి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవమును పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్పంచ్ మ్యాకల స్వర్ణలత - సురేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేష్‌ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవమును పురస్కరించుకొని వివిధ రంగాలలో ఉన్న మహిళలను, అలాగే వార్డు సభ్యురాళ్ళను కార్యాలయంలో తనతో పాటు మిగతా వార్డు సభ్యులు కలిసి సర్పంచ్‌ను, వార్డు సభ్యురాళ్ళను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులు విజయవంతం చేద్దాం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్



**సంగారెడ్డి, మార్చి 8 (జనం సాక్షి) :** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విజయవంతం చేయాలనీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ పేర్కొన్నారు శిక్షణ తరగతులా అవగాహనా సమావేశం కన్వీనర్ శంషాబాద్ రాజు అధ్యక్షతన జరిగింది ఇట్టి సమావేశంలో పాల్గొన్న అయన మాట్లాడుతూ శిక్షణ తరగతులు అనేక విషయాలపై అవగాహనా కల్పిస్తూ నాయకత్వ లక్షణాలు పెంపోందిస్తాయని కావున ప్రతి మండలంలో కార్యశాలలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జిన్నారం వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూపార్టీ కోసం కస్టపడి పనిచేష వారికి అవకాశాలు కచ్చితంగా వస్తాయని తెలిపారు. పార్టీ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలనీ పేర్కొన్నారు ఈకార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సందేళ్ల ఆంజనేయులు, రాజేందర్ రెడ్డి, రాంబాబు,ఆగరెడ్డి ,ఈర్లరాజు, జగనరెడ్డి, ఆనంద్ రెడ్డి, మేఘన రెడ్డి, తలసి ,భారత్, చారి, బైండ్ల కుమార్, పుణ్యవతి పాల్గొన్నారు.

## పేదవారి సొంతింటి కళ నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కడవేర్గు గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్తా



**చేర్యాల, మార్చి 8 (జనంసాక్షి) :** పేదవారి సొంతింటి కళ నెరవేరుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని కడవేర్గు గ్రామసర్పంచ్ తాళ్లపల్లి రమేష్ అన్నారు. ఆదివారం చేర్యాల మండలంలోని కడవేర్గు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రోసిడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల లోపే కడవేర్గు గ్రామంలో 2 కోట్ల 60 లక్షల గల 52 ఇందిరమ్మ ఇండ్లను జనగామ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సహకారంతో సాంక్షన్ చేయడం జరిగిందని, గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఏ ఒక్క పేదవారికి కడవేర్గు గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదని, సొంత ఇల్లు అనేది పేదవారి కల, అలాంటి కలను నిజం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎక్కడ రాజీలేకుండా ఒక ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తూ వారి ఇంటి పెద్ద కొడుకుగా ప్రజల మనసులో చిరస్థానాన్ని సంపాదించుకున్నారని,రానున్న రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను పేదలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం,జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరుట్ల వినీత్, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు కొమినేని నరేందర్, దొంగల లింగారెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ జంగ సురేందర్, వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో- ప్రగతి ప్రణాళిక

- తడి - పొడి చెత్త పై అవగాహన కార్యక్రమం



**వెల్దండ, మార్చి 8 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెల్దండ మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 3వ రోజు చెత్త సేకరణకు బుట్టలను సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్ లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడి పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ సిబ్బందికి అందజేయాలని కోరారు. అనంతరం సిగ్రిగేషన్ షెడ్డు ను సందర్శించి సేంద్రియ ఎరువుల తయారీపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, గుద్దేటి కిష్టాల్, ముదిగొండ రమేష్, పురుషోత్తం చారి, గోసుల కొండయ్య, రంగనాథం, మారేపల్లి శ్రీను, బాధపెల్లి రమేష్, సిర్సనగండ్ల శేఖర్, ఈదులపల్లి వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి



**మాగనూర్, మార్చి 8 (జనం సాక్షి) :** పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని, సిపిఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు మాగనూరు మండల కేంద్రంలో ఆదివారం రోజు కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని బస్టాండ్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు భరత్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తూ గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్ ధరలను రూ. 60 లు, కమర్షియల్ సిలిండర్ ధరలను రూ. 115 లు పెంచడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ప్రజలపై వేస్తున్న భారానికి ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానందుతుంటే ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచడం పేద మధ్యతరగతి కుటుంబాలకు అదనపు భారం అవుతున్నది దేశ సంపదను అంబానీ ఆదాని వంటి కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ పేద ప్రజలపై అదనపు భారాలు విధించే కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి తక్షణమే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించేందుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది ఇట్టి కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బ్యాగరి నర్సింలు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె నర్సింలు, వర్కూర్ ఆంజనేయులు, ఎరుకల నరసింహ, ముష్టి విజయ్ కుమార్, హనుమంతు, వడ్డే రాజు, చాకలి రఘు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో ముమ్మరంగా పారిశుధ్య పనులు



**జడ్చర్ల, మార్చి 8 (జనంసాక్షి) :** మున్సిపాలిటీలో 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం మూడో రోజు పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగాయి. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది కలిసి మార్కెట్ యార్డులోని చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించారు. ఇదే క్రమంలో బోయలకుంట రోడ్డులో నూతన కంపోస్టింగ్ యూనిట్‌ను ప్రారంభించి, మార్కెట్ వ్యర్థాలను అక్కడే ఎరువుగా మార్చే ప్రక్రియను చేపట్టారు. ప్రతి వార్డులో 100 శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, తడి-పొడి చెత్త వర్గీకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- హాజరైన మాజీ హోం మంత్రి మహమూద్ అలీ



**సదాశివపేట, మార్చి 8 (జనం సాక్షి) :** ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఆవిర్భవించిన నెల రంజాన్ అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణంలోని హుస్సేనీ మైదాన్ పిట్టల కేరిలో రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ హోమ్ మినిస్టర్ మైముద్ అలీ, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బిఆర్ఎస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ముస్లింలకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతూ వారి అభివృద్ధికి సహకరించామన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందరితో పాటు ముస్లింలను కూడా మోసం చేసిందని విమర్శించారు. రానున్న రోజుల్లో మళ్ళీ కేసీఆర్ ను సీఎం చేసుకునేందుకు ప్రతి ఒక్కరు సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్, బిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ లు,మైనార్టీ నాయకులు అక్బర్ హుస్సేన్, ఖలీమ్ పటేల్,నాసిర్,లతీఫ్,ఖమీల్, యాదుల్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవంబర్ నాటికి ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 8 (జనం సాక్షి) :** మక్తల్ పట్టణంలో నిర్మించ నున్న 150 పడకల ఆస్పత్రి పనులను వచ్చే నవంబర్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర మత్స్య ,పాడి పరిశ్రమ, క్రీడలు యువజన శాఖా మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీ లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నవంబర్ లోగ ఆస్పత్రి నిర్మా ణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హైవే రోడ్డు నుంచి ఆసుపత్రికి వచ్చే రహదారి సంబంధించిన స్థలాన్ని కూడా మంత్రి శ్రీహరి పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందు లు ఉండకుండా విశాలమైన రోడ్డు ఉండాలని అధికారు లకు సూచించారు.



## 14 సంవత్సరాల బాలికలందరూ హెచ్‌పీవి టీకాను తీసుకోవాలి

- కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్, మార్చి 8 (జనంసాక్షి) :** 14 సంవత్సరాలు నిండిన బాలికలందరూ తప్పనిసరిగా మహిళలకు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ రాకుండా నివారణకు హెచ్ పీవీ టీకా తీసుకోవాలని కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆదివారం నాడు నాగర్ కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పివి టీకా కరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు వచ్చే క్యాన్సర్లలో రెండవ అతిపెద్ద క్యాన్సర్ గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చ్ 31 తారీకు వరకు జిల్లాలోని జనరల్ ఆస్పత్రిలో, ప్రాంతీయ ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాత్రమే 14 సంవత్సరాల బాలికలకు హెచ్ పి వి టీకాకరణ చేస్తారని, ఒకటో తారీకు ఏప్రిల్ నుండి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెచ్పివి టీకా కరణ ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ టీకా సురక్షితం, మీ పిల్లల భవిష్యత్తుకు రక్షణ కవచం కావున తల్లిదండ్రులు తమ 14 సంవత్సరాల నిండిన బాలికలందరికీ తప్పకుండా టీకాలు వేయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. తదనంతరం హెచ్‌పివి టీకా పోస్టర్లు, పాఠశాల ఆరోగ్య కార్యక్రమం పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్య సేవలు అందిస్తున్న వైద్యులను, నర్సింగ్ ఆఫీసర్లను, ఈ ఎన్ఎంలను ఆశా కార్యకర్తలను శాలువాతో సత్కరించారు. ఆశా కార్యకర్తలకు యూనిఫాం చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె రవికుమార్, జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శేఖర్, పీడియాట్రిషన్ డాక్టర్ రోహిత్, జిల్లా టీకా కరణ అధికారి డాక్టర్ సురేష్ బాబు, ప్రోగ్రాం



అధికారి డాక్టర్ కృష్ణమోహన్, నాగర్ కర్నూల్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, పిపి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ సృజన, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి, డిపిఓ రేనయ్య, పర్యవేక్షకులు వై శ్రీనివాసులు, సుకుమార్ రెడ్డి, కోట్ర నిరంజన్, డి.కుమార్, మరియమ్మ, నర్సింగ్ ఆఫీసర్ వనిత, ఏఎన్ఎంలు నర్సింగమ్మ, జీజే కవిత, సరస్వతి, ఆశా కార్యకర్తలు తదితర ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్

### హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రారంభించిన నగర మేయర్ : జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి (జనంసాక్షి) :** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం 14 సంవత్సరాలు పూర్తి చేసి 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా ఇప్పించాలని నగర మేయర్ గుండు సుధారాణి సూచించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేసి, వ్యాక్సినేషన్ ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. మహిళల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు నాలుగు వేల రూపాయల వరకు ఖర్చు అయ్యే ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం పేద కుటుంబాల బాలికలకు ఉచితంగా అందించడం సంతోషదాయకమని అన్నారు అనంతరంజిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ఈ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 14 సంవత్సరాలు పూర్తి చేసి 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు అవగాహనతో ముందుకు వచ్చి తమ పిల్లలకు వ్యాక్సిన్ ఇప్పించడం అభినందనీయమన్నారు. వ్యాక్సిన్ ఇవ్వడానికి ముందు తల్లిదండ్రుల అనుమతి పత్రాన్ని కూడా తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ , పరకాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, దశలవారీగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా విస్తరించనున్నట్లు చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ. అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో 7,000 మందికి పైగా బాలికలను గుర్తించినట్లు తెలిపారు. ఎలాంటిఅపోహలకు లోనవకుండా ప్రతి ఒక్కరూ ఈ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. మొదటి రోజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండలో 17 మంది బాలికలకు, పరకాలలో 12 మంది బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ. అప్పయ్య, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, డీటీసీఓ డాక్టర్ హిమబిందు, ఇంచార్జ్ డీఐఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మానస రెడ్డి, డాక్టర్ అనిల్, డాక్టర్ గీత, డెమో వి. అశోక్ రెడ్డి, హెచ్ఈఓ చంద్రశేఖర్, జీఎంహెచ్ మరియు పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# బాలసముద్రం యూనిట్‌ను వేస్ట్‌టు ఎనర్జీ పార్క్‌గా తీర్చిదిద్దండి

- కలెక్టర్ తో కలిసి వర్మి, విండ్రో కంపోస్ట్, కోకో పిట్ యూనిట్, డిఆర్‌సిసి కేంద్రాల పరిశీలన
- పార్క్ లలో కంపోస్ట్ విక్రయాలు జరపాలన్న మేయర్
- విక్రయదారులు వాడిన బోండా లను నేరుగా యూనిట్ కి అందజేయాలి



**వరంగల్ ఎంజీఎం,(జనంసాక్షి):** బాలసముద్రం యూనిట్ ను వేస్ట్ టు ఎనర్జీ పార్క్ గా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రపడ్డారు. ఆదివారం హన్మకొండ బాలసముద్రం లో బల్దియా నిర్వహిస్తున్న వర్మి, విండ్రో కంపోస్ట్, కోకో పిట్ యూనిట్, డిఆర్‌సిసి కేంద్రాలను హన్మకొండ జిల్లా కలెక్టర్/ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్మి కంపోస్ట్ ద్వారా తయారైన ఎరువు అమ్మకాలు జరపాలని, ఇందుకు సంబంధించిన ప్రొడక్ట్(ఉత్పత్తిని) ఎక్కువగా మొత్తం లో తయారు చేయాలని కంపోస్ట్ ఎరువు అమ్మకాలను ప్రజలకు అందుబాటులో ఉండేవిధం గా చూడాలని, విండ్రో కంపోస్ట్ కు సంబంధించి 60 సంచుల ఎరువును హార్టికల్చర్ వారికి అందజేసి విక్రయించాలని సూచించడం జరిగిందని,ప్రజలు ఎరువును కొనుగోలు చేయడానికి వీలుగా నగరం లోని పార్క్ లలో ఇట్టి కంపోస్ట్ ఎరువును అందుబాటులో ఉండేలా చూడాలని, తయారుచేసిన ఎరువును సంచులలో నింపి హార్టికల్చర్ వారికి అందజేయాలని ఎరువుల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. డిఆర్‌సిసి కేంద్రాన్ని సందర్శించిన తరుణం లో కేంద్రానికి వచ్చిన డ్రై మెటీరియల్ ను వేరు చేసి బ్యూటిఫికేషన్ సెంటర్ లా శుభ్రంగా ఉండేలా చూడాలని నగరంలోని అన్ని డిఆర్‌సిసి కేంద్రాలు ఇదే తరహాలో నిర్వహించేలా చూడాలని అన్నారు. అనంతరం కోకో పిట్ యూనిట్ కు చేరుకొని మాట్లాడుతూ గతంలో ఫంక్షన్‌లో లేని యూనిట్ ను ప్రస్తుతం వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని అంత్య ఉత్పన్నం అయిన కాయర్ (కొబ్బరి బోండాల నుండి తీసిన పీచు) ను మార్కెట్‌లో అమ్మే విధంగా సహకరిస్తూ యూనిట్ నిర్వాహకునికి బల్దియా పరంగా సంపూర్ణ సహకారం అందించాలని,కొబ్బరి బోండాల విక్రయదారులు వాడిన బొండాలను నేరుగా ఇక్కడే డంప్ అయ్యేలా చూడాలని బాలసముద్రం కేంద్రాన్ని వేస్ట్ టు ఎనర్జీ పార్క్ గా తీర్చిదిద్దడం తో పాటు వీటిని సందర్శించే విధంగా తీర్చిదిద్దాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్‌ఓ డా.రాజా రెడ్డి, సిహెచ్‌ఓ రమేష్, ఎంహెచ్‌ఓ డా.రాజేష్, హెచ్‌ఓ లక్ష్మారెడ్డి, సానిటరీ సూపర్వైజర్‌లు నరేందర్, వావ్ ప్రతినిధి పవన్ పాల్గొన్నారు.

### వరంగల్ కలెక్టరేట్లో

# మహిళా దినోత్సవ వేడుకలు



**వరంగల్ బ్యూరో, మార్చి 08 (జనంసాక్షి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలెక్టరేట్ సిబ్బంది జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ను సన్మానించి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. అనంతరం మహిళల సాధికారత, సమాన హక్కులు, విద్యా అభివృద్ధి , సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రపై అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మహిళలు కుటుంబ నిర్మాణంలోనే కాకుండా దేశ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. విద్య, ఉపాధి, పరిపాలన, వ్యాపారం, విజ్ఞానం, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటు కుంటూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుం దని పేర్కొ న్నారు. మహిళల గౌరవం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ క్యాంటిన్ నిర్వాహకురాలు శ్రీదేవిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సన్మానించారు. ముద్ర రుణం పొందుతూ స్వయం ఉపాధి ద్వారా కుటుంబ పోషణలో విజయవంతమైన వ్యాపా రవేత్తగా ఎదిగిన ఆమె ఇటీవల ప్రధాన మంత్రి చేతుల మీదుగా అవార్డు అందు కోవడం గర్వకార ణమని కలెక్టర్ అభినందించారు. ఆమె సాధించిన విజయం ఇతర మహిళ లకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యా రాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ కలెక్టరేట్ ఏఓ విశ్వ ప్రసాద్‌తో పాటు జిల్లా కలెక్టరేట్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీతి ఆయోగ్ 'బెస్ట్ ప్రాక్టీసెస్'కు పెంబి ఎంపిక

- రాష్ట్రం నుంచి నిర్మల్, గద్వాల జిల్లాలకు మాత్రమే చోటు
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, (జనంసాక్షి)** కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద నిర్వహించే 'బెస్ట్ ప్రాక్టీసెస్' సెమినార్‌కు జిల్లాలోని పెంబి ఆస్పిరేషనల్ బ్లాక్ ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగే ఉన్న త స్థాయి సెమినార్‌లో పెంబి బ్లాక్ సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక రంగాల్లో పెంబి మండలం గణనీయమైన పురోగతి సాధించి నందుకు ఈ అవకాశం దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నిర్మల్, జోగులాంబ గద్వాల జిల్లాలు మాత్రమే ఈ సెమినార్‌కు ఎంపిక కావడం జిల్లాకు గౌరవకరమని తెలిపారు. పెంబి బ్లాక్‌లో అమలవుతున్న ఉత్తమ విధానాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను జాతీయ వేదికపై ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

# పేకాట రాయుళ్లపై దాడులు

### ఏడుగురు అరెస్ట్, 23,600 నగదు,5 మొబైల్ ఫోన్లు స్వాధీనం



**ములుగు, (జనంసాక్షి):** ఆదివారం రోజున ములుగు మండలంలోని దేవగిరిపట్నం గ్రామ శివారు ప్రాంతంలో పేకాట (జూదం) ఆడుతున్న వారిపై ములుగు ఎస్హెచ్ఓ యు.ఉపేందర్ రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా ఏడుగురిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాద్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఎస్సై ఉపేందర్ రావు ఆధ్వర్యంలో జూదం ఆడుతున్న వ్యక్తులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 23,600 నగదు మరియు 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడి లో ఎస్సై ఉపేందర్ రావు తో పాటు ములుగు రెండవ ఎస్సై బి.చంద్రశేఖర్ , సివిల్ , టిజిపిఎస్ సిబ్బంది పాల్గొనడం జరిగిందనీ ఎస్ఐ ఉపేందర్ రావు తెలియజేశారు.

## జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎస్పీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భూపాలపల్లి ఎస్పీ కార్యాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పాత్ర సమాజ అభివృద్ధిలో ఎంతో ముఖ్యమని, మహిళలు ధైర్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. మహిళల ధైర్యసాహసాలకు ప్రతీకలైన రాణి రుద్రమదేవి, సమ్మక్కసారలమ్మ, రాణి లక్ష్మీబాయి వంటి మహ నీయ మహిళలను స్మరించుకున్నారు. వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మహిళలు విద్య, ఉపాధి, పరిపాలన, క్రీడలు రంగాల్లో పురోగతి సాధిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మహిళలపై జరిగే నేరాల ను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని ఆయన అన్నారు. అనంతరం మహిళా ఎస్ఐలు కేక్‌కట్ చేసి జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, భూపాలపల్లి సీఐ నరేష్, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ ఈస్ట్, (జనంసాక్షి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అస్మిత కేలో ఇండియా కార్యక్రమాన్ని మై భారత్ ఆధ్వర్యంలో వరంగల్ వెంకట్రామ సమీపాన గల ఓ సిటీ స్టేడియలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్ డబ్ల్యూ ఆర్‌డిసి డబ్ల్యూ వరంగల్ తూర్పుకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని ఎం.నందిని, 18 సంవత్సరాల పైబడిన విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగుపం దెలలో మొదటి బహుమతి సాధించి కళాశాలకు గౌరవం తీసుకు వచ్చింది. అలాగే ఎంఎస్‌టిసిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని లావణ్య 18 సంవత్సరాల లోపు విభాగంలో 200 మీటర్ల పరుగుపం దెలో మొదటి బహుమతి, 100 మీటర్ల పరుగుపందెలో రెండవ బహుమతి సాధించింది. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాధిక, అధ్యాపకులు డా.కె.రాజ్యలక్ష్మి, డా.సమత, ఇతర అధ్యా పకులు విద్యార్థినులను అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు. ఎన్ ఎస్ ఎస్ వలంటీర్లు కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని మహిళా సాధికారతకు తమ మద్దతును తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణాపై అటవీశాఖ కొరడా

- నిఘాపెంచిన అటవీ శాఖ, రాత్రి వేళల్లో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**గూడూరు (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అటవీ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. ఆదివారం తెల్లవారుజామున గూడూరు అటవీ శాఖ రేంజ్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను అధికారులు పట్టుకున్నారు. అటవీ ప్రాంతాలు నిషేధిత ప్రాంతాలు కావడంతో అక్కడ నుంచి కట్టెలు,ఇసుక వంటి ప్రకృతి సంపదను తరలించడం చట్ట విరుద్ధమని అధికారులు తెలిపారు. అయినప్పటికీ కొంతమంది ఇసుక అక్రమ దారులు అటవీ ప్రాంతంలో నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా కొంతమంది యదేచ్ఛగా అటవీ సంపదను సంపాదనగా మలుచుకొని రోజు 6000 నుండి 8000 వరకు ఈ స్మగ్లర్లు కాంట్రాక్టర్లులకు విక్రయిస్తున్నారు. ప్రతి రోజు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ వేల రూపాయలు సంపాదిస్తున్న ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని వారు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్లు తిరగడం వల్ల అడవిలోని జంతువులు కూడా భయాందోళనకు గురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో నిఘా పెంచినట్లు అధికారులు తెలిపారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంత మంది ఇసుక బకాసురులు అటవీ సంపాదనను కొల్లగొడుతూ డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకొని కొంత మంది ఇసుక స్మగ్లర్లుగా తయారయ్యారు. అనునిత్యం అదేపనిగా పెట్టుకొని ఇసుక వ్యాపారం చేస్తున్న ఇసుక బకాసులపై కఠినంగా వ్యవహరించాలని స్థానిక మండల ప్రజలు కోరుతున్నారు. అడవిని అక్రమ రవాణా దారుల నుంచి కాపాడాలని, రెవెన్యూ,పోలీస్ అటవీ శాఖలు కలిసి కట్టుగా చర్యలు తీసుకోవాలని గూడూరు మండల ప్రజలు కోరుతున్నారు.

# అర్హులైన ప్రతిఒక్కరు హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవాలి

### మున్సిపల్ చైర్పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి



**నిర్మల్ బ్యూరో, (జనంసాక్షి)** ఆదివారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నిర్మల్‌లో హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి ,జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, ప్రభుత్వ జనరల్ హాస్పి టల్ సూపరిం టెండెంట్ డాక్టర్ గోపాల్ సింగ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు అందరూ కూడా హ్యూ మన్ పాపిలోమా వైరస్ టీకాను తీసుకుని గర్భా శయ క్యాన్సర్ రాకుండా కాపాడు కోవాలని కోరారు. తదనంతరము ఆసుపత్రి సూపరిం టెం డెంట్ డాక్టర్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ మారి న జీవన రీతుల వల్ల అనేకమంది క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆరోగ్యకరమైన జీవన రీతులను అలవర్చుకోవాలని తెలియజేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడు తూ హెచ్‌పివి వ్యాక్సిన్ ను మొదటి దశలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ , సామాజిక ఆరోగ్య కేంద్రాలలో నెలరోజుల పాటు ఇవ్వడం జరుగుతుందని తదనం తరము గుర్తించబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రెండు నెలల వరకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని, తరువాత రొటీన్‌లో భాగంగా ఈ టీకా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రమేష్ చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం నిర్వాణా ధికారి డాక్టర్ నయనా రెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ , మీడి యా అధికారి బారె రవీందర్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గౌతమ్ డాక్టర్ ప్రీతం రాజ్, నర్సింగ్ సూపర్డెంట్ శ్రీమతి వనజ పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

### ఒకరికి స్వల్ప గాయాలు



**ములుగు/ వెంకటాపూర్, (జనంసాక్షి):** రామప్ప రామలింగేశ్వర స్వామి దర్శనం ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఆలయ తూర్పు ముఖ ద్వారం నుంచి ప్రధాన రహదారి క్రాస్ చేస్తున్న క్రమంలో వెంకటాపూర్ నుంచి చెల్పూరుకు వస్తున్న ద్విచక్ర వాహనదారుడు కారును ఢీకొట్టడంతో స్వల్ప గాయాలైనట్లు వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు తెలిపారు. సంఘటన వివరాలు ప్రకారం మహబూబాబాద్ నుంచి రామప్ప కు వచ్చి దర్శనం ముగించుకొని తిరుగు ప్రయాణం అవుతుండగా వెంకటాపూర్ నుంచి చెల్పూర్ కు వస్తున్న ద్విచక్ర వాహనదారుడు బల్గూరి సంపత్ రావు పాస్టర్ ఒక్కసారిగా ఢీకొనడంతో స్వల్ప గాయాలైనట్లు ఆయన తెలిపారు. గాయాలైన క్షతగాత్రుని ములుగు ఏరియా హాస్పిటల్ కు తరలించినట్లు ఆయన వివరించారు. బల్గూరి సరస్వతి ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

# నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం గణపురం మండలం కర్కపల్లి గ్రామంలో 'జల మహోత్సవం' కార్యక్రమం మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి శుద్ధమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన చెప్పారు. జల మహోత్సవం కార్యక్రమం ద్వారా ప్రజల్లో నీటి విలువపై అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నీటిని వృథా చేయకుండా సంరక్షిం చడం, భూగర్భ జలాలను కాపాడడం, చెరువులు, కుంటలు, నీటి వనరులను పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో నీటి వినియోగంపై ప్రజలు బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమని అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా ఉండేలా పర్యవేక్షణ కొనసాగి స్తున్నారని వివరించారు. అనంతరం సంబంధిత అధికారులు గ్రామ ప్రజలకు నీటి సంరక్షణ, నీటి వినియోగం, భూగర్భ జలాల పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు కూడా నీటి సంరక్షణకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, మిషన్ భగీరథ ఈఈ, సిబ్బంది, స్థానిక సర్పంచ్ అంబాల లక్ష్మీ సాంబయ్య, ఉప సర్పంచ్ తోరుపునురి రమేష్ , మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ నగరానికి భూగర్భ డ్రైయినేజీ మంజూరు

## సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల కృతజ్ఞతలు



**వరంగల్ బ్యూరో, (జనంసాక్షి):** వరంగల్ మహానగరానికి భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ) ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 5,257.20 కోట్లకు పాలనాపరమైన మంజూరు ఇవ్వడం పట్ల శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ మహానగరానికి భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు మంజూరు చేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కలను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో ప్రధాన నగరంగా వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారని ఎంపీ తెలిపారు. మౌలిక సదుపాయాలు, వైద్య, విద్య, రవాణా అన్ని రంగాల్లో వరంగల్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమా లను వేగంగా అమలు చేస్తోందని ఎంపీ అన్నారు. భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు అమలుతో నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వరద ముంపు సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వరంగల్ మహానగర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను అమలు చేస్తున్నదని చెప్పారు. త్వరలోనే మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ ప నులు ప్రారంభం కానున్నాయని, అలాగే రైల్వే వ్యాగన్ ఫ్యా క్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు కాకతీయ టెక్స్ టైల్ పరిశ్రమల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు అమలు లోకి వస్తే వరంగల్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో కొత్త దశకు చేరుకుం టుందని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్టు

- దొంగిలించిన మొత్తం సొత్తు విలువ 40 లక్షలు
- 10 లక్షలు విలువ చేసే ఒక లారీ రెండున్నర లక్షల నగదు స్వాధీనం
- దేవరకొండ డిఎస్పి శ్రీనివాస రావు, ఎస్ఐ అజ్మీరా రమేష్



**కొండమల్లేపల్లి, మార్చి 8 (జనంసాక్షి) :** ముంబై నుండి చెన్నైకి వెళ్తున్న రూ. 40 లక్షల విలువచేసే కెమికల్ లోడును దారి దోపిడీ చేసిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడిని కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకున్నట్లు దేవరకొండ డిఎస్పి శ్రీనివాస రావు తెలిపారు. ఆదివారం కొండమల్లేపల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్ఐ అజ్మీరా రమేష్ తో కలిసి డిఎస్పి వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఎస్.కె. షరీఫ్‌కు చెందిన లారీ ఫిబ్రవరి 6న ముంబై నుండి 112 డ్రమ్ముల గ్లిజరిన్ కెమికల్ లోడుతో చెన్నైకి బయల్దేరింది. లారీ డ్రైవర్ ప్రకాశ్ రాజేంద్ర సకరే మరో ఆరుగురు సభ్యులతో కలిసి ఎలాగైనా దొంగిలించాలని వాటిపై కన్నేశారు. ఫిబ్రవరి 8న రాత్రి సమయంలో కొండమల్లేపల్లి సమీపంలోని సాగర్ రోడ్డులో ఒక దాబా వద్ద లారీని నిలిపి పక్కా ప్లాన్ ప్రకారం లోడును దొంగలించి వెంటనే పరారయ్యారు. సంబంధిత బాధితుడి వెంటనే కొండమల్లేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం చెన్నారం గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రధాన నిందితుడు ప్రకాశ్ రాజేంద్ర సకరే పట్టుబడినట్లు డిఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద నుండి రూ.10 లక్షల విలువైన లారీ, రూ.2.50 లక్షల నగదు, ఒక చరవాణి స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు పరారీలో ఉన్న మిగిలిన ఆరుగురు నిందితులు లాల్ బహదూర్ సింగ్, హర్షల్ తికారం కావలె, అసన్ అలీ, అఫ్జల్, దీపక్, ఇర్ఫాన్ ల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని వివరించారు. ఈ కేసును ఛేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేశ్, క్రైమ్ సిబ్బంది హేము నాయక్, భాస్కర్, కృష్ణారెడ్డి, హోంగార్డ్ శేఖర్ లను డీఎస్పీ శ్రీనివాస రావు ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులను అందజేశారు. అంతర్ రాష్ట్ర దొంగల ముఠా కేసును ఛేదించినందుకు ఎస్పి శరత్ చంద్ర పవార్ పోలీసు బృందాన్ని ప్రశంసించినట్లు డిఎస్పీ తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యపై ఎమ్మెల్యే పరిశీలన



**భువనగిరి టౌన్, మార్చ్ 8 (జనం సాక్షి) :** పట్టణంలోని సింగన్నగూడెం చౌరస్తా వద్ద ప్రతి శనివారం, ఆదివారం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండడంతో ప్రజలకు రోడ్డు దాటడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం అక్కడ ఒక ట్రాఫిక్ పోలీసును నియమించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్, 9వ వార్డు కౌన్సిలర్ బొంతల నర్సింహా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, బాబ్లు, ప్రదీప్, సాయి, పిట్టల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధర్వేశిపురం వద్ద టెండర్ కం వేలం పాటలు

కనగల్లు, మార్చి 8 (జనం సాక్షి) : నేడు ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద 2026-2027 సంవత్సరం కాలం పాటు దేవదాయ శాఖ అధికారులు సూచించిన వస్తువులను అమ్ముకొనుటగాను టెండర్ కం బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి అంబటి నాగిరెడ్డి ఓ ప్రకటన లో తెలిపారు. టెండర్లకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి తలనీలాలు సేకరించు కొను హక్కు కై డిపాజిట్ 2 లక్షలు, టెండర్ షెడ్యూల్ ధర 1వెయ్యి, వాహనములకు బొట్టు పెట్టు హక్కుకై డిపాజిట్ 2 లక్షలు, టెండర్ షెడ్యూల్ ధర 1 వెయ్యి, కొబ్బరి చిప్పల సేకరణ హక్కు కై డిపాజిట్ 1 లక్షటెండర్ షెడ్యూల్ ధర 1 వెయ్యి, చీరలు-ఒడి బియ్యం సేకరణ హక్కుకై డిపాజిట్ 1 లక్ష టెండర్ షెడ్యూల్ ధర 1 వెయ్యి, గంటలు విక్రయించుకొను హక్కుకై (స్టాకు ఉన్నంతవరకే)డిపాజిట్20 వేలు టెండర్ షెడ్యూల్ ధర 1 వెయ్యి గా నిర్ణయించినట్లు ఆయన తెలియజేశారు. ఇట్టి డిపాజిట్లు ఏదేని జాతీయ బ్యాంకు లో చెల్లుబాటు అయ్యే విధంగా కార్యనిర్వాన అధికారి శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం ధర్వేశిపురం పేరున డీడీలు తీయాలని ఇ ట్టి డీడీలు సీల్డ్ కవర్ ద్వారా టెండర్ బాక్సులు వేయాలని కోరారు. దేవదాయ ఉ ధర్మదాయ శాఖ అధికారులు సూచించిన షరతులకు లోబడి పాటలో పాల్గొనాలని ఈవో పేర్కొన్నారు.

## జాతీయస్థాయి సీఏ ఫలితాలలో తీర్థాల స్పందన ప్రభంజనం



**ఖమ్మం, మార్చి 8 (జనంసాక్షి) :** జాతీయస్థాయిలో ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా సంస్థ ఆదివారం ప్రకటించిన సి ఎ ఫౌండేషన్ వార్షిక పరీక్ష ఫలితాలలో ఖమ్మం నగరానికి చెందిన తీర్థాల స్పందన 400 మార్కుల గాను 304 మార్కులు సాధించి డిస్టెన్స్ లో అత్యుత్తమ ఫలితాలను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం తీర్థాల స్పందన సి ఎ ఇంటర్లో ప్రవేశం పొందారు. ఖమ్మం రెజోనెన్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి గుంటూరులోని మాస్టర్ మైండ్స్ సి ఏ కళాశాలలో సి ఎ ఫౌండేషన్ పూర్తిచేసి సి ఎ ఇంటర్ చదువుతున్నారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సీఎంఏ ఫలితాలలో 304 మార్కులు సాధించి డిస్టెన్షన్ లో ఉత్తీర్ణత పొందారు. సిఏ ఫౌండేషన్ లో , సీఎంఏలో డిస్టెన్స్ లో ఉత్తీర్ణత సాధించిన తీర్థాల స్పందనను నాయనమ్మ భారతీ లక్ష్మి, పేరెంట్స్ తీర్థాల శివాజీ, కవిత, బంధుమిత్రులు, మాస్టర్ మైండ్స్ కళాశాల మేనేజ్మెంట్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

## యువత స్వశక్తితో ఎదగాలి



**సూర్యాపేట, మార్చి 8 (జనంసాక్షి) :** యువత స్వశక్తితో ఎదిగి ఆదర్శంగా నిలవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా సమీపంలో వినయ్, విజయ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వినయ్ జిరాక్స్ అండ్ ఆన్ లైన్ సర్వీస్ సెంటర్ ను డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు వివిధ పనులకు ఆన్ లైన్ ద్వారానే దరఖాస్తులు చేస్తున్నారని అన్నారు.ఆన్ లైన్ వర్క్ ద్వారా ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, వెలుగు వెంకన్న, కోడి శిరీష శివ, నాయకులు మొరిశెట్టి లక్షాది, పీసీసీ ఎస్సి సెల్ వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్,సేవాదల్ అధ్యక్షులు ఆలేటి మాణిక్యం, జిల్లా కాంగ్రెస్ నాయకులు అన్నమయ్య రాము, చెరుకు రాము, మద్దెబోయిన శ్రీనివాస్, గుణగంటి సైదులు, దండా వెంకట్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మాడుగులపల్లి కేజీబీవీలో ఆకలి కేకలతో విద్యార్థినులు

- విద్యార్థినుల నరకయాతన
- ఎస్ఓ నిర్లక్ష్యానికి పరాకాష్ట

**మాడుగులపల్లి, మార్చి 8 (జనం సాక్షి) :** పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మాడుగులపల్లి కేజీబీవీలో తుంగలో తొక్కబడుతోంది. సుమారు 200 మంది స్కూలు, కాలేజీ విద్యార్థినులు ఇక్కడ కనీసం తినడానికి తిండి లేక, నాణ్యత లేని భోజనంతో ఆకలితో అలమటిస్తున్నారు. విద్యార్థినుల పట్ల ఎస్ఓ వ్యవహరిస్తున్న తీరు ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది.

### కంపు కొడుతున్న కూరలు తినలేని తిండి!

హాస్టల్‌లో పెడుతున్న భోజనం అత్యంత దారుణంగా ఉంటుందని విద్యార్థినులు కన్నీరు మున్నీరవుతున్నారు. నాణ్యత లేని నీళ్ల చారు, సరిగా ఉడకని అన్నం పెడుతూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. స్నాక్స్, టిఫిన్ ఊసే లేదని, అడిగితే దుర్భాషలాడుతున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




### ప్రశ్నిస్తే వేధింపులా? ఎస్ఓ తీరుపై ఆగ్రహం!

భోజనం బాగుండటం లేదని ధైర్యం చేసి ప్రశ్నించిన విద్యార్థినులను ఎస్ఓ వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నట్లు సమాచారం. హక్కుల కోసం అడిగితే ఇబ్బందులకు గురి చేయడం, భయభ్రాంతులకు గురి చేయడం ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఎస్ఓ ఇంతలా రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అధికారులు మేల్కొనేది ఎప్పుడు?

వందలాది మంది ఆడపిల్లలు ఆకలితో రోడ్డు ఎక్కకముందే జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి. తక్షణమే ఈ పాఠశాలపై విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్ఓపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. నాణ్యమైన భోజనం అందించకుంటే పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.
ప్రభుత్వ నిధులు పక్కదారి పడుతున్నాయా? విద్యార్థుల నోరు కొట్టి ఎవరి జేబులు నిండుతున్నాయి? తక్షణమే విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలి.

# మహిళలను గౌరవించే సంస్కృతి మనది

- మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి



**శామీర్‌పేట, మార్చి 8 (జనం సాక్షి) :** మహిళలను గౌరవించే సంస్కృతి కలిగిన దేశం మనదే అని మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి అన్నారు. శామీర్‌పేట డివిజన్ హకీంపేటలో మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిసిడిఓ జి.హేమలత, హకీంపేట బస్తీ దవఖాన డాక్టర్ జోహనా, మహిళా కానిస్టేబుల్ బి.అనిత, జిహెచ్ఎంసి కార్మికులను శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా 'మీ సమస్య మా పరిష్కారం' అనే కార్యక్రమాన్ని అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షు రాలు ఎన్.హైమారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయిలోకి వెళ్లి సంఘం ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు ఆర్.భద్రమ్మ, మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ రాము, యువ నాయకులు ఆశీష్, ప్రశాంత్, జిహెచ్ఎంసి కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

## జాతి జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలి



**ముషీరాబాద్, మార్చి 8 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా ఏప్రిల్ ఒకటి నుండి మొదలుకానున్న జాతి జనగణన లో బీసీ కులగనన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్ లో ఆమోదించాలనే ప్రధాన డిమాండ్ తో మార్చ్ (ఈనెల) 23న బీసీల చలో ఢిల్లీ చేపట్టినట్లు తెలియజేశారు. బీసీల చలో ఢిల్లీ సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక రోజు భారీ ధర్నా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కొన్ని దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సమగ్ర కులగనన చేపట్టాలని కోరారు. బీసీలు ఉద్యమాలు చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి ఏప్రిల్ 30,2025 న జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో జాతీ జన గణనలో సమగ్ర కులగనన చేపడతామని ప్రకటించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కేంద్రం తాము ప్రకటించినట్లు గాని వచ్చే నెల ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా జాతిగణగ చేపడుతుందని మొదటి దపా లో కుటుంబ ఇంటి లెక్కలు తీస్తుందని, ఇందులో 33 ప్రశ్నలను రూపొందించి, అందులో ఎస్సీ ఎస్టీ కుటుంబాలు ఎన్ని అని అడిగిన కేంద్ర ప్రభుత్వం బీసీ కుటుంబాల సంఖ్యను విస్మరించడం చాలా బాధాకరమన్నారు. ఇండ్ల లెక్కింపులో కూడా బీసీ ఇండ్లను లెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టం కేంద్ర ప్రభుత్వానికి పంపి సంవత్సరాల కాలం గడిచినప్పటికీ ఇంతవరకు బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదించలేదని తక్షణమే ఈ బడ్జెట్ పార్లమెంట్ సమస్యలలో బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తరపున పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి దేశంలోని 29 రాష్ట్రాల నుండి బీసీ లు అందరూ పెద్ద ఎత్తున కదిలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మహిళా విద్యకు ప్రత్యేక ప్రణాళికలు అవసరం



**ముషీరాబాద్, మార్చి 8 (జనం సాక్షి) :** మహిళా విద్యకు ప్రత్యేక ప్రణాళికలు అవసరం అని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బాగ్లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మహిళా ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో "తెలంగాణ విద్యా కమిషన్ -- మహిళా విద్య" అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, డాక్టర్ వనమాల, జర్నలిస్టు సజయ్య లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారతతోనే అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యమని, మహిళలకు కుటుంబం, ప్రభుత్వాలు అందించవలసిన ముఖ్యమైన ఆయుధం విద్య మాత్రమేనని పేర్కొన్నారు. అయితే తెలంగాణ విద్యా కమిషన్‌లో మహిళలు, బాలికల విద్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక సూచనలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతంలో పురుషులు 87 శాతం ఉండగా మహిళలు 74 శాతం మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. వైద్య, సాంకేతిక, వృత్తి విద్యలలో మహిళలకు ప్రత్యేక సీట్ల కేటాయింపు అవసరమని, ప్రపంచ స్థాయి క్రీడల్లో మహిళలు విజేతలుగా నిలిచినప్పుడు ప్రభుత్వం భారీ నగదు బహుమతులు ప్రకటిస్తున్నప్పటికీ మహిళల కోసం ప్రత్యేక క్రీడా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలనే సూచనలు లేకపోవడం కూడా నిరాశ కలిగించే అంశమని తెలిపారు. పారిశ్రామికీకరణలో మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య అంగడి సరుకుగా మారుతున్న పరిస్థితుల్లో మహిళా ఉపాధ్యాయుల మేధో శ్రమ రక్షణకు ఎలాంటి సూచనలు లేకపోవడం విచారకరమని తెలిపారు.

# బొమ్మకల్లులో పంచాయతీ అనుమతి లేకుండానే వాటర్‌ట్యాంక్ కూల్చివేత

**మాడుగులపల్లి, మార్చి 8 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు గ్రామంలో ప్రభుత్వ ఆస్తుల పట్ల కొందరు వ్యక్తులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రజల దాహార్తిని తీర్చడం కోసం వేలాది రూపాయల ప్రజా ధనంతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా, కనీసం గ్రామపంచాయతీ తీర్మానం కూడా లేకుండానే కూల్చివేయడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.

### నిబంధనలకు పాతర

సాధారణంగా ఏదైనా ప్రభుత్వ కట్టడాన్ని తొలగించాలంటే అది నిరుపయోగంగా ఉందని ఇంజనీరింగ్ అధికారులు ధృవీకరించాలి. ఆ తర్వాత గ్రామపంచాయతీ పాలకవర్గం సమావేశమై తీర్మానం చేయాలి. కానీ, బొమ్మకల్లులో ఈ నిబంధనలన్నీ అటకెక్కాయి. ఏ అధికారి అనుమతి ఇచ్చారో.. ఏ చట్టం ప్రకారం కూల్చారో తెలియక గ్రామస్తులు విస్తుపోతున్నారు.




### ప్రజా ధనం వృథాపై ఆగ్రహం

ప్రభుత్వ ఆస్తి అంటే ఎవరికీ పట్టని చులకన భావం పెరిగిపోతోందని పలువురు మేధావులు, గ్రామస్తులు మండిపడుతున్నారు. "ప్రజల కోసం నిర్మించిన ట్యాంకును అడ్డగోలుగా కూల్చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నిస్తున్నారు. ఇది కేవలం ఒక కట్టడం కూల్చివేత మాత్రమే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థను మరియు ప్రభుత్వ నిబంధనలను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
గ్రామ పంచాయతీకి సమాచారం లేకుండా, తీర్మానం లేకుండా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం నేరం. దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎంతటి వారైనా సరే, వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి స్థానిక గ్రామస్తుల డిమాండ్

### తక్షణ చర్యలు అవసరం

ఈ ఘటనపై జిల్లా, మండల ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరి ప్రయోజనాల కోసం ఈ కూల్చివేత జరిగింది? దీనికి బాధ్యులైన వారు ఎవరు? అనే కోణంలో విచారణ జరిపి, ప్రభుత్వ ఆస్తిని నష్టపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ సెక్రటరీ ని వివరణ కోరగా ఈ ట్యాంకు మీరు ఉపయోగంగా ఉంది గతంలో సంవత్సరం క్రితం నాకు ఫిర్యాదు కూడా ఇచ్చారు కానీ ఇప్పటివరకు ఎటువంటి తీర్మానం కానీ ఏమీ చేయలేదని వారు సమాచారం ఇచ్చారు.

## సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటిన అంగరాజు నవీన్



**నేరేడుచర్ల, మార్చి 8 (జనంసాక్షి) :** లక్ష్యం దరి చేరాలంటే ఆషా మషి కాదు గెలుపు వెనుక కష్టాలు కన్నీళ్లు త్యాగాలు ఒడుదోడుకు లెన్నో వాటిని దాటితేనే విజయం వచ్చింది కదా,అని ఆ యువకుడు అక్కడతో ఉద్యోగం చేస్తూ తాను కలలుగన్న,సివిల్స్ ఫలితాల్లో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాల్టీ పరిధిలో రామాపురంకు చెందిన అంగరాజు సైదులు,లింగమ్మ దంపతుల కుమారుడు అంగరాజు నవీన్ సివిల్స్ లో 715 ర్యాంకు సాధించారు..అంగరాజు నవీన్ ప్రాథమిక విద్యాభ్యాసం. 01 నుండి 05 సరస్వతి శిశు మందిర్ నేరేడుచర్ల. 6.నుంచి 08 వరకు తెలంగాణ సోషియల్. రెసిడెన్షియల్ స్కూల్ ,భువనగిరి. 9 నుండి 10 తెలంగాణ సోషియల్. రెసిడెన్షియల్ స్కూల్ కరీంనగర్. ఇంటర్మీడియట్ తెలంగాణ సోషియల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల,గౌలిదొడ్డి హైదరాబాద్. ఎంబిబిఎస్ కాకతీయ మెడికల్ కాలేజీ వరంగల్.2021 పూర్తి చేశారు. నల్గొండ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో మెడికల్ ఆఫీసర్ పని చేశారు. 2023 లో మెడికల్ ఆఫీసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యారు.గత ఏడాది గ్రూపు 01లో డిపివో గా ఎంపికైనారు. ప్రస్తుతం జనగామ జిల్లా డిపివో గా శిక్షణలో ఉన్నారు.మూడుసార్లు సివిల్స్ పరీక్ష రాయగా, నాల్గవ ప్రయత్నంలో సివిల్స్ పరీక్షలో 715 ర్యాంకు సాధించారు. ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ లో లభించవచ్చునీ, ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని నవీన్ తెలిపారు. సివిల్స్ లో ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# విపణి

## యుద్ధభయం

**4 రోజుల్లో రూ.21 వేల కోట్లు ఆవిరి**

**న్యూఢిల్లీ:**అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థి తులు కొనసాగుతున్నాయి. ఈ దాడులు దేశీయ ఈక్విటీ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రూ.21 వేల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరిలో రూ.22,615 కోట్ల విలువైన పెట్టుబడులను విక్రయించారు. గత 17 నెలల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. మార్చి 2 నుంచి 6వ తేదీల మధ్య రూ.21 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం మార్కెట్‌పై పడిందని నిపుణులు చెబుతున్నారు. ముడి చమురు, గ్యాస్ రవాణాకు కేంద్ర బిందువైన హర్మూజ్ జలసంధి చుట్టూ నెలకొన్న అడ్డంకులు, బ్రెంట్ ముడి చమురు ధర 90 డాలర్లకు చేరడం ప్రపంచ మార్కెట్ సెంట్‌మెంట్‌ను దెబ్బతీసిందని సీనియర్ నిపుణుడు వకార్ జావేద్ ఖాన్ తెలిపారు. రూపాయి విలువ పతనమవడం అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరగడం పెట్టుబడులు తరలిపోవడానికి మరో కారణమన్నారు. దీనికితోడు ఐటీ, వినియోగ రంగాలపై ఒత్తిళ్ల కారణంగా క్యూ4 త్రైమాసిక ఫలితాలపై మిశ్రమ అంచనాలు నెలకొన్నాయన్నారు. బ్రెంట్ క్రూడ్ ధర పెరగడం భారతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారిందని మరో అనలిస్ట్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో విదేశీ మదుపర్లు సురక్షితమైన పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నారని తెలిపారు.

# సమ్మర్‌లో హీటెక్కిస్తున్న ఏసీలు

## ధరలు పెంచేస్తున్న కంపెనీలు



**న్యూఢిల్లీ:**ఈ వేసవికి ఏసీ కొనాలనుకుంటున్నారా? అయితే మీకో బ్యాడ్ న్యూస్. ముడి పదార్థాల ధరల పెరుగుదల, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఏసీ తయారీ కంపెనీలు ధరలు పెంపునకు సిద్ధమవుతున్నాయి. రవాణా ఖర్చులు, కొత్త ఇంధన వినియోగ నిబంధనలు కూడా పెరుగుదలకు కారణమయ్యాయి. దీంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు ధరలు పెంచగా.. మరికొన్ని పెంపునకు సిద్ధమవుతున్నాయి. డైకిన్, వోల్టాస్, బ్లూస్టార్, ఎల్‌జీ, హైయర్, మిత్సుబిషి వంటివి ఈ జాబితాలో ఉన్నాయి.ప్రముఖ ఏసీల తయారీ కంపెనీ డైకిన్ తన ఏసీ ధరలను 12 శాతం వరకు పెంచనుంది. మోడల్‌ను బట్టి ఏప్రిల్ నుంచి ఈ పెంపు ఉండబోతోందని డైకిన్ ఇండియా ఛైర్మన్, ఎండీ కన్వల్జీత్ జావా పేర్కొన్నారు. ఏసీల తయారీలో వినియోగించే రాగి వంటి ముడి సరకుల ధరలు పెరగడంతో పాటు, కొత్త ఇంధన నిబంధనల వల్ల ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల వల్ల సరకు రవాణా ఖర్చులు పెరగడంతో ప్రత్యామ్నాయం లేక ఏసీ ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపారు. ప్రతి ఏసీ కంపెనీదీ ఇదే పరిస్థితి అని వివరించారు. ఈ ఏడాది ఏసీల విక్రయాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేశారు. బ్లూస్టార్ ఇది వరకే: మరో ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఫిబ్రవరి మధ్యలోనే ఏసీ ధరలను 8-10 శాతం పెంచేసింది. అయితే పాత ధరల ఇన్వెంటరీ ఇప్పటికీ మార్కెట్లో ఉన్నందువల్ల రేటులో పెద్దగా తేడా ఉండబోదని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. ఏసీల ధరల పెరుగుదల ఊహించి డీలర్లు ముందుగానే స్టాక్ పెట్టుకుని, వాటిని విక్రయిస్తున్నారని చెప్పారు. కొత్త స్టాక్‌పై మాత్రం ధరల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.టాటా గ్రూప్‌నకు చెందిన వోల్టాస్ సైతం 5-15 శాతం మేర ఏసీల ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. గడిచిన కొన్ని నెలలుగా రాగి ధరలు పెరగడం, రూపాయి విలువ పతనం అవ్వడం వంటి కారణాలతో రేట్లు పెంచాల్సి వస్తోందని వోల్టాస్ ఎండీ ముకందన్ మేనన్ పేర్కొన్నారు. దీంతో పాటు ఎల్‌జీ సంస్థ 3 స్టార్ ఏసీలపై 7 శాతం, 5 స్టార్ మోడళ్లపై 9-10 శాతం చొప్పున ధరల పెంచుతున్నట్లు వెల్లడించింది. హైయర్ ఇండియా సైతం 5-8 శాతం మధ్య ధరలు పెంచబోతోందని ఆ కంపెనీ ప్రెసిడెంట్ సతీష్ పేర్కొన్నారు. మిత్సుబిషి ఏసీ ధరలు 5 శాతం మేర పెరగనున్నాయని ఆ కంపెనీ పేర్కొంది. 2026పైనే ఆశలు: ఏసీ తయారీ కంపెనీలన్నీ దాదాపు ఈ ఏడాది విక్రయాలపై పెద్దగానే ఆశలు పెట్టుకున్నాయి. గతేడాది వీటి విక్రయాలు మందగించడమే ఇందుకు కారణం. అకాల వర్షాలు, ఇతర అంశాలు వీటి విక్రయాలపై ప్రభావం చూపాయి. 2024లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు, ఉక్కపోత కారణంగా రికార్డు స్థాయిలో ఏసీల విక్రయా లు నమోదయ్యాయి. మళ్లీ ఆ స్థాయిలో విక్రయాలను ఈ ఏడాది ఉంటాయని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి.

## మహిళలకు ఉచిత లాకర్, ఆరోగ్య బీమా

**న్యూఢిల్లీ:**మహిళల కోసం ప్రత్యేక వేతన ఖాతాను తీసుకొచ్చినట్లు ప్రైవేట్ రంగ యెస్ బ్యాంక్ ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి ఆర్థిక, జీవనశైలి అవసరాలకు అనుగుణంగా దీన్ని రూపొందించినట్లు తెలిపింది. ఆర్థిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, జీవనశైలి ప్రయోజనాలు, సంపద సృష్టి వంటి ప్రత్యేక సేవలను ఈ ఖాతా ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకువస్తుందని బ్యాంక్ వెల్లడించింది. యెస్ ఎసెన్స్ ఉమెన్స్ శాలరీ అకౌంట్‌లో తొలి సంవత్సరం ఉచిత లాకర్ సౌకర్యం, ఏడాది పాటు రూ.5 లక్షల కాంప్లిమెంటరీ హెల్త్ కవర్, ఏడాదికి ఒకసారి ఉచిత ఆరోగ్య పరీక్షలు వంటి ఫీచర్లు ఉన్నాయి. వీటితో పాటు ఖాతాదారులు కాంప్లిమెంటరీ ఎలిగెన్స్ డెబిట్ కార్డు పొందొచ్చు. దీని ద్వారా ఎంపిక చేసిన విభాగాల్లో 5 శాతం క్యాష్‌బ్యాక్ (ఏటా రూ.6,000 వరకు) పొందొచ్చు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4,590 కోట్లు) సామాజిక రుణ సౌకర్యాన్ని తీసుకొచ్చింది. లింగ వివక్షను తగ్గించేందుకు, ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యం సాధించేందుకు ఇది దోహదం చేస్తుంది. పర్యావరణం, సామాజిక, పాలన సూత్రాలపై బ్యాంకుకు ఉన్న నిబద్ధతకు, స్థిరమైన అభివృద్ధికి నిదర్శనంగా ఇది నిలుస్తుందని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జెండర్-థీమ్ రుణంగా పేర్కొంటున్న ఈ పథకం.. ఆర్థిక వృద్ధితో పాటు, సామాజిక మార్పును తీసుకొచ్చేందుకు ఉద్దేశించింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,49,300 | ₹ 1,62,880 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

## రూ.లక్ష కోట్ల వ్యవసాయ ఎగుమతుల సంగతేంటి?




పశ్చిమాసియా ప్రాంతంలోని ఉద్రిక్తతల వల్ల భారత వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై గణనీయ ప్రభావం పడనుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అభిప్రాయపడింది. 2025లో భారత్ నుంచి ఈ ప్రాంతానికి 11.8 బిలియన్ డాలర్ల విలువైన (సుమారు రూ.1 లక్ష కోట్లు) వ్యవసాయ, ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయిన విషయాన్ని గుర్తు చేసింది. ఇప్పుడీ ఉద్రిక్తతలతో ఈ మేరకు విలువైన ఎగుమతులు ఇబ్బందుల్లో పడొచ్చని తెలిపింది. నౌకా రవాణా మార్గాల్లో అంతరాయాలు, బీమా వ్యయాలు పెరగడం, సరఫరాపరంగా అనిశ్చితులు నెలకొనడం ఇందుకు కారణాలుగా పేర్కొంది. 'భౌగోళికపరమైన సారూప్యత ఉండటం, భారతీయులు అక్కడ పెద్ద సంఖ్యలో నివసిస్తుండటంతో సహజంగానే భారత ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు గల్ఫ్ ప్రాంతం కీలకంగా మారింది. కొన్ని దశాబ్దాలుగా గల్ఫ్ మార్కెట్లపై భారత వ్యవసాయ ఎగుమతులు ఆధారపడటం పెరుగుతూ వచ్చింది. తాజా పరిణామాలతో భారత్ నుంచి ఈ తరహా ఉత్పత్తుల ఎగుమతులకు సంక్షోభ పరిస్థితి ఏర్పడింద'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు.బియ్యం ఎగుమతులపై అధిక ప్రభావం పడొచ్చు. గతేడాది పశ్చిమాసియా ప్రాంతానికి భారత్ 4.43 బిలియన్ డాలర్ల విలువైన బియ్యాన్ని ఎగుమతి చేసింది. భారత్ మొత్తం బియ్యం ఎగుమతుల్లో పశ్చిమాసియా దేశాల వాటానే 36.7 శాతం. ముఖ్యంగా పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి గల్ఫ్ మార్కెట్లకు అధికంగా బియ్యం ఎగుమతి అవుతున్నాయి. తాజా పరిణామాలతో ఈ రాష్ట్రాల్లోని రైతులపై నేరుగా ప్రభావం పడనుందని శ్రీవాస్తవ తెలిపారు.పశ్చిమాసియాకు భారత్ 7.48 బిలియన్ డాలర్ల విలువైన తృణధాన్యాలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసింది. ఈ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా భారత్ మొత్తం ఎగుమతుల విలువలో పశ్చిమాసియా ప్రాంత వాటా 29.2 శాతంగా ఉంది.అరటి ఎగుమతులు 396.5 మిలియన్ డాలర్లు కాగా.. ఉల్లి, వెల్లుల్లి ఎగుమతులు 111 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇవేకాకుండా జాజికాయ, జాపత్రి, యాలకులు (295.5 మిలియన్ డాలర్లు), జీలకర్ర, ధనియాలు (163 మిలియన్ డాలర్లు), అల్లం, పసుపు (173 మి.డాలర్లు), కాఫీ (240.70 మి.డాలర్లు), తేయాకు (410.10 మి.డాలర్లు), ప్రాసెస్డ్ ఫుడ్, పంచదార (1.35 బి.డాలర్లు), చేపలు, మాంసం, ఫ్రోజెన్, ప్రాసెస్డ్ ఉత్పత్తులు (1.81 బి.డాలర్లు) కూడా చెప్పుకోదగిన స్థాయిలో భారత్ నుంచి పశ్చిమాసియా దేశాలకు ఎగుమతి అయ్యాయి. గతేడాది 281.1 మిలియన్ డాలర్ల విలువైన పాల ఉత్పత్తులను పశ్చిమాసియా ప్రాంతానికి భారత్ ఎగుమతి చేసింది. ఆల్కహాల్, ఆల్కహాలేతర పానీయాల ఎగుమతులు 197.5 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అయిదో వంతుకు పైగా ఇవే జీటీఆర్ఐ గణాంకాల ప్రకారం.. గతేడాది భారత వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల మొత్తం ఎగుమతుల్లో అయిదో వంతుకు పైగా (21.8%) పశ్చిమాసియా దేశాలకే వెళ్లాయి. వీటిల్లో బియ్యం, పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, తృణ ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు లాంటివి ఎక్కువగా ఉన్నాయి.పశ్చిమాసియా ప్రాంత సంక్షోభం వల్ల వస్తువుల రవాణా విషయంలో ఎగుమతిదార్లు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో.. వాళ్లకు కొన్ని సడలింపులను ప్రభుత్వం ఇచ్చింది.'తాజా భౌగోళిక, రాజకీయ పరిణామాలతో అంతర్జాతీయంగా ఓడ రవాణా మార్గాలు, సరఫరా వ్యవస్థలపై ప్రభావం పడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని.. 2026 మార్చి 1 నుంచి మే 31 మధ్య గడువు తీరిపోయే ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కేపిటల్ గూడ్స్ (ఈపీసీజీ) అనుమతులు, ఇతరత్రా ముందస్తు అనుమతులకు సంబంధించి ఎక్స్‌పోర్ట్ ఆబ్లిగేషన్ (ఈఓ) సమయాన్ని ఆటోమేటిక్‌గా 2026 ఆగస్టు 31 వరకు పొడిగించాం. ఇందుకు ప్రత్యేకంగా దరఖాస్తును సమర్పించనక్కర్లేదు. రుసుమూ చెల్లించనవసరం లేద'ని డైరక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) తెలిపింది. ఈపీసీజీ పథకం కింద... దేశీయ సంస్థలు ఎటువంటి సుంకం లేకుండా యంత్ర సామగ్రిని దిగుమతి చేసుకునే వీలుంటుంది. అయితే అవి ఎగుమతులపరంగా కొన్ని లక్ష్యాలను పూర్తిచేయాల్సి ఉంటుంది.నౌకల ఛార్జీల్లో మార్పులు సహా పలు రుసుములను తగ్గించడం లేదా రద్దు చేయడం లాంటి వినతులను పరిశీలించాల్సిందిగా పోర్ట్‌లకు ప్రభుత్వం సూచించింది.

# రూటు మార్చిన ఇరాన్

## ఆర్థిక యుద్ధం దిశగా పయనం






టెహ్రాన్:"హర్మూజ్ జలసంధిని మూసేశాం. బ్యారెల్ చమురు ధర ఇప్పుడు 80డాలర్లకు చేరుకుంది. త్వరలోనే ఇది 200 డాలర్లకు చేరుతుంది. మేం ఇకమీదట చమురు పైపులైన్లపై కూడా దాడులు చేస్తాం." రెండురోజుల కిందట ఇరాన్ ఐఆర్‌జీసీ అధికార సలహాదారు బ్రిగేడియర్ జనరల్ ఇబ్రహీం జబారీ చేసిన ఈ ప్రకటన పైకి హెచ్చరికలా కనిపిస్తున్నా... ఇది ఇరాన్ యుద్ధ వ్యూహాన్ని బయటపెడుతోంది.మామూలుగానైతే ఈ యుద్ధం ఇరాన్‌కు అమెరికా-ఇజ్రాయెల్ కూటమికి మధ్యలోనే సాగితే... ఖమేనీ దేశం ఏకాకిగా మిగిలిపోతుంది. చైనా, రష్యా, ఉత్తరకొరియాల నుంచి మద్దతు ఉన్నా... అది యుద్ధంలో ఇరాన్‌కు ఎంతమేరకు ప్రత్యక్షంగా ఉపయోగపడుతుందనేది ప్రశ్నే! ప్రస్తుత పరిస్థితుల్లో ఆయా దేశాలు ఇరాన్ తరఫున రంగంలోకి దిగే అవకాశాలు తక్కువ. ఇరాన్ పరిస్థితి పట్ల సానుభూతి, అమెరికా తీరుపట్ల ప్రపంచదేశాల్లో ఆగ్రహం ఉన్నా... అది కూడా పనికొచ్చేదేమీ కాదు. ప్రేక్షకపాత్ర పోషించటం తప్ప ఏమీ చేయలేని అశక్తతే! ఎంత తల ఎగరేసినా... క్షిపణులతో విరుచుకుపడ్డా... కొద్దిరోజుల్లో అమెరికా బలం, బలగం ముందు లొంగిపోవాల్సిందే!చమురు దారులను కట్టడి చేస్తే... ఇరుగుపొరుగు దేశాల్లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తే... గల్ఫ్ దేశాలకూ, అక్కడి ప్రజలకూ, ఆర్థిక వ్యవస్థలకూ దెబ్బతగిలితే... ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగితే... ఈ యుద్ధంతో సంబంధం లేని దేశాలూ.. ఒత్తిడికి గురవ్వాల్సిన పరిస్థితి! చమురు ధరలు పెరిగినా... ఎగుమతులు తగ్గినా... ప్రపంచంలోని ప్రజలందరికీ ఆ చురకంటుతుంది. అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలూ అతలాకుతలం అవుతాయి. హర్మూజ్ జలసంధి ద్వారా రోజుకు 25 లక్షల బ్యారెల్స్ చమురు దిగుమతి చేసుకునే భారత్‌కు, 22% ఎల్‌పీజీ దిగుమతి చేసుకునే ఐరోపాకు, 70శాతం ఈ జలసంధి ద్వారానే చమురు తీసుకునే జపాన్, దక్షిణకొరియాలకు, ఇక ఇరాన్ చమురుపై భారీగా ఆధారపడ్డ చైనాకూ, చివరకు అమెరికాకూ... ఇరాన్ యుద్ధవేడి తగులుతుంది. ఇలా ఇరాన్ ఎక్కడుందో తెలియని దేశాల ప్రజలూ ధరలు పెరిగి గిలగిలలాడతారు. ఎగుమతులకు దారులు మూసుకుపోతుండటంతో చమురు కేంద్రాలను ఇరాక్ మూసేస్తోంది. ఇలా ప్రపంచ మానవాళి జీవనాడిలా వ్యవహరిస్తున్న చమురు సరఫరా, పెట్రోలియం ఉత్పత్తులను లక్ష్యంగా చేసుకోవటం ద్వారా... తలెత్తే అపార ఆర్థిక ఒత్తిడి మామూలుగా ఉండదు. ఇది కేవలం ఆయా దేశాలకే పరిమితమూ కాదు. దిల్లీలో, బీజింగ్‌లో, టోక్యోలో... సియోల్‌లో, బ్రసెల్స్‌లో... ఆందోళన గంటలు మోగిస్తుంది. అవన్నీ అంతిమంగా వాషింగ్టన్‌లో ప్రతిధ్వనిస్తాయి!
సంక్షోభంలో ప్రపంచ దేశాలూ తలదూర్చాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. తద్వారా ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతుంది. అలా ఆర్థిక వాత పెట్టి... అమెరికా ఆగ్రహానికి పగ్గాలు వేయాలన్నది ఇరాన్ అనుసరిస్తున్న వ్యూహంలా కనిపిస్తోంది. కేవలం చమురుతోనే ఆగిపోకుండా... డేటా కేంద్రాలు, ప్రపంచ ఆర్థిక, మౌలిక వ్యవస్థలన్నింటికీ కీలకమైన సముద్రమార్గంలోని సబ్‌సీ కేబుల్స్‌పై కూడా ఇరాన్ దాడులు చేసే అవకాశాలున్నాయి. ఇప్పటికే బహ్రెయిన్‌లోని డేటా కేంద్రాలపై దాడులు జరిగాయి. సముద్రగర్భంలోని కేబుళ్లకూ యుద్ధ దెబ్బ తగిలితే... అనేక దేశాల్లో ఆర్థిక, కమ్యూనికేషన్ వ్యవస్థలు అస్తవ్యస్తమవుతాయి. ఇరాన్ ఇలా.. ప్రత్యామ్నాయాలన్నింటినీ చూసుకుంటూ... సైనికపరంగా అమెరికా-ఇజ్రాయెల్‌లతో యుద్ధాన్ని నెగ్గలేనన్న సంగతి గుర్తించి తెలివిగా ఈ యుద్ధాన్ని ఆయుధమార్గం నుంచి ఆర్థికమార్గం పట్టించే దిశగా అడుగులు వేసింది. హర్మూజ్ జలసంధిని కట్టడి చేసినా... గల్ఫ్ దేశాలపై పదేపదే దాడులు చేస్తున్నా... కారణమదే! అంతేతప్ప యుద్ధం గెలుస్తామనో... అమెరికాను తిప్పికొడతామనో ధైర్యంతో ఏమాత్రం కాదు. ఇతర దేశాలకు కాక తగిలి దౌత్య రాయబారాలు మొదలయ్యేది ఎప్పుడు... ట్రంప్ పెట్టే షరతులెలా ఉంటాయి... వాటికి ఇరాన్ ఎలా స్పందిస్తుంది... ఈ లోపు ఇరాన్‌లో అంతర్గత పరిస్థితులు... ఇవన్నీ ఆసక్తికరాంశాలు! ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ క్షిపణులు ఆగితే యుద్ధం ఆగిపోవచ్చు! కానీ గల్ఫ్ దేశాల చమురు కేంద్రాలపై దాడులతో ఇరాన్ మొదలెట్టిన ఆర్థికయుద్ధం ప్రభావం ఎంతకాలం ఉంటుందనేదే కీలకం!

## నౌకను వదిలి పారిపోండి

**ఇరాన్ యుద్ధనౌకపై దాడికి ముందు హెచ్చరించిన అమెరికా..?**

**వాషింగ్టన్:**ఇటీవల శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్-దేనాపై అమెరికా జలాంతర్గామి దాడి చేసి ముంచేసిన విషయం తెలిసిందే. అయితే, దాడికి ముందే.. ఈ విషయం గురించి నౌకలోని సిబ్బందిని అమెరికా హెచ్చరించినట్లు తెలుస్తోంది. వెంటనే నౌకను వదిలి పెట్టి వెళ్లాలని ఇరాన్ యుద్ధ నౌక కమాండర్‌ను రెండు సార్లు ఆదేశించినట్లు సమాచారం. దాడి జరిగే కొన్ని నిమిషాల ముందే ఈ విషయాన్ని నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం వెల్లడించింది.విశాఖలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన ఇరాన్ యుద్ధ నౌక.. తిరిగి వెళ్తున్న క్రమంలో మార్చి 4న అమెరికా జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయి. సిబ్బంది ఖాళీ చేసి వెళ్లిపోవాలని హెచ్చరించినా.. నౌక కమాండర్ అందుకు నిరాకరించారని తెలిసింది. దీంతో కొందరు సిబ్బంది కమాండర్‌తో వాదనకు దిగారనే వాదన ఉంది. ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడిన వారిలో కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్లను చేరుకున్న వారే ఎక్కువగా ఉన్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. అయితే, దీనిపై తన తండ్రికి ఫోన్ చేసిన ఆ నావికుడు అమెరికా జలాంతర్గామి దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది.అమెరికా దాడి వేళ ఆ యుద్ధ నౌకలో 180 మంది సిబ్బంది ఉండగా.. 87 మంది మృత దేహాలను స్వాధీనం చేసుకున్నట్లు శ్రీలంక నౌకాదళం ఇటీవల వెల్లడించింది. మరో 32 మందిని రక్షించి ఆసుపత్రుల్లో చేర్పించినట్లు తెలిపింది. నౌక మునిగిన విషయం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు గల్లంతైన వారికోసం గాలింపు చేపట్టాయి.



## ఇజ్రాయెల్ దాడిలో ఖమేనీ కుమారుడికి గాయాలు..!

టెహ్రాన్:ఇజ్రాయెల్ వాయుసేన ఇరాన్ నాయకత్వంపై జరిపిన తొలిదాడికి సంబంధించి మరిన్ని విషయాలు బయటకు వస్తున్నాయి. ఫిబ్రవరి 28న ఆపరేషన్ లయన్స్ రోర్‌లో భాగంగా ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో ఇరాన్ తదుపరి నేతగా భావిస్తున్న ముజ్తబా హ్సేనీ ఖమేనీ (ఓనీతీబిజీఎజీ ఊనీబబవతినితి ఐష్త్రజీఎవనివతి) కూడా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ దాడి నుంచి ఆయన ప్రాణాలతో బయటపడినట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ కథనంలో పేర్కొంది. ఇదే ఆపరేషన్‌లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీఖమేనీ సహా 40 మంది కీలక నాయకులు, జనరల్స్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ముజ్తబా భార్య జహ్రా కూడా మరణించారు. దాడి జరిగిన సమయంలో ముజ్తబా తన తండ్రితోపాటు ఆయతుల్లా కాంపౌండ్‌లోనే ఉన్నారా అన్న విషయంపై స్పష్టత రాలేదు. ఆయనకు అయిన గాయాల తీవ్రత కూడా తెలియరాలేదు. ముజ్తబాకు ఇరాన్‌లోని శక్తిమంతమైన ఐఆర్‌జీసీపై బలమైన పట్టు ఉంది. దీంతో ఆయనే ఖమేనీ స్థానాన్ని భర్తీ చేస్తారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే.. 88 మంది సభ్యులున్న గార్డియన్ కౌన్సిల్‌లో కొందరు మాత్రం అధికారాన్ని వారసత్వంగా ముజ్తబాకు అందించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ముజ్తబాకు అధికారం అప్పజెప్పడానికి అంగీకరించడం లేదు.

## భారత్, చైనా మధ్య శత్రుత్వం వద్దు

- ఇరు దేశాలు భాగస్వాములుగా ఉండాలి
- అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఇరుదేశాలు కట్టుబడి ఉండాలి
- సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా ముందడుగు వేయాలి
- చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ

విషయానికి ఇరుదేశాలు కట్టుబడి ఉండాలని చెప్పారు."2024లో కజాన్ వేదికగా మోదీ జిన్‌పింగ్‌ల సమావేశం అనంతరం ఇరుదేశాల మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. గతేడాది తియాంజిన్‌లో ఇరునేతలు మరోసారి భేటీ అయిన తర్వాత మరింత మెరుగుదల కనిపించింది. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటివి ఇరుదేశాలకూ ప్రయోజనం చేకూర్చాయి" అని వాంగ్ యీ అన్నారు. భారత్, చైనా (అష్ట్రతినిజీ)లు సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని, సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని తెలిపారు."పొరుగు దేశాలుగా, గ్లోబల్ సౌత్ సభ్యులుగా.. భారత్, చైనా దీర్ఘకాలిక సంబంధాలు కలిగి ఉన్నాయి. పరస్పర విశ్వాసం, సహకారం అనేవి రెండు దేశాల అభివృద్ధికి ప్రయోజనకరంగా ఉంటాయి. విభజనవాదం, ఘర్షణలు.. అభివృద్ధిని దెబ్బతీస్తాయి" అని అన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు సైన్యాల మధ్య జరిగిన ఘర్షణతో ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే. అయితే, పలు దఫాలుగా చర్చలు జరిపిన భారత్, చైనాలు.. పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకున్నాయి.

### యుద్ధం గెలిచిన తర్వాత

## మీ అవసరం లేదు..

**స్టార్మర్‌పై విరుచుకుపడ్డ ట్రంప్**

**వాషింగ్టన్:**ఇరాన్‌తో యుద్ధం అమెరికా- యూకే మధ్య సంబంధాలపై ప్రభావం చూపిస్తోంది. పశ్చిమాసియాకు విమాన వాహక నౌకలను పంపించే విషయంపై యూకే ప్రభుత్వం ఇంకా తేల్చుకోలేకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూకే ప్రధాని స్టార్మర్ విమర్శలు చేశారు. బ్రిటన్ రక్షణ మంత్రిత్వశాఖ 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' విమాన వాహకనౌకను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొంది. అయితే, దీన్ని పశ్చిమాసియాకు తరలించే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని ఆ దేశానికి చెందిన ఓ అధికారి మీడియాతో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే స్టార్మర్‌ను విమర్శిస్తూ.. ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఒకప్పుడు యూకే తమ మిత్రదేశం అని పేర్కొన్నారు. పశ్చిమాసియాకు రెండు విమాన వాహకనౌకలను తరలించే విషయంపై వారు తీవ్రంగా ఆలోచిస్తున్నారని విమర్శించారు. అమెరికా బలగాలకు ఇప్పుడు వాటి అవసరం లేదన్నారు. ఈ చర్యను తాము ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటాం అంటూ స్టార్మర్‌కు హెచ్చరికలు చేశారు. యుద్ధం గెలిచిన తర్వాత.. చేరే వ్యక్తులు తమకు అవసరం లేదన్నారు.ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా చేస్తున్న యుద్ధంలో తమ బలగాలు ప్రత్యక్షంగా పాల్గొనబోవని బ్రిటన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే, తమ సైనిక స్థావరాలను ఆత్మరక్షణ కోసం ఉపయోగించుకునేందుకు అమెరికా, ఇజ్రాయెల్‌కు అనుమతిస్తున్నట్లు స్టార్మర్ ఇటీవల తెలిపారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్.. బ్రిటన్ చర్యలతో తాను సంతోషంగా లేనని వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుర్దులు కలిసి రావాలని ట్రంప్ ఇటీవల పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై ఆయన స్వరం మార్చారు. ఇరాన్‌పై దాడి చేసేందుకు కుర్దుల అవసరం లేదన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కుర్దులతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అయితే, యుద్ధాన్ని మరింత సంక్లిష్టం చేయాలని తాము అనుకోవడం లేదన్నారు.

## బంగ్లాదేశ్‌లో దారుణం..

**పూజ చేసుకుంటున్న వారిపై బాంబులు**

ఢాకా:బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో ఘటన చోటుచేసుకుంది. కోమిల్లా ప్రాంతంలో శనివారం నాడు పూజ చేసుకుంటున్న హిందువుల బృందంపై గుర్తు తెలియని దుండగులు బాంబులు విసిరారు. భయభ్రాంతులకు గురైన ప్రజలు పరుగులు పెట్టారు. పూజా కార్యక్రమానికి హాజరైన పలువురు ఈ ఘటనలో గాయపడినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి.పూజారి కేశవ్ చక్రవర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో ఆ దేశంలో బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో ఆ దేశంలోఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి దేశంలోని హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు పదుల సంఖ్యలో హిందువులు ప్రాణాలు కోల్పోయారు.




# ఇలా కూలుస్తున్నారు అలా కట్టేస్తున్నారు

**శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్‌లో అస్తవ్యస్తం..**

తెలంగాణలో హైడ్రా అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల స్వాధీనంపై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతున్నప్పటికీ, శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగంలో వేలకోట్ల రూపాయల కుంభకోణాలు బట్టబయలవుతున్నాయి. జిహెచ్‌ఎంసీ ప్రతిష్టకు దెబ్బ మీద దెబ్బ పడుతున్నా, అధికారులు ధోరణి మార్చుకోకపోవడంతో స్థానికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ఏం జరుగుతుందో ఎవరికీ అంతుబట్టడంలేదని, రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలో నిజాయితీగా పనిచేసే అధికారులు లేరని ప్రజలు మిలియన్ డాలర్ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

- వేలకోట్ల అక్రమ నిర్మాణాలపై అధికారులు మౌనం
- జెవి కాలనీలో హైడ్రామా.. రాత్రికి రాత్రే మరమ్మత్తులు
- ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు లెక్కచేయకుండా అవినీతి
- రాష్ట్రస్థాయి ప్రక్షాళన కావాలని ప్రజల డిమాండ్

**శేరిలింగంపల్లి, మార్చి 8 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని జెవి కాలనీ గత కొన్ని నెలలుగా వార్తల్లో నిలుస్తూ తీవ్ర విమర్శలకు గురవుతోంది. సర్వే నంబర్ 99లోని వివాదాస్పద స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతున్నప్పటికీ, సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ 2025 సెప్టెంబర్ 22న సమగ్ర సమాచారంతో ఫిర్యాదు చేసినా, అధికారులు 'అదిగో.. అదిగో' అంటూ సమయాన్ని దాటేసారు. భవనం పూర్తి చేసి తుది మెరుగులు దిద్దుకుంటున్న సమయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది మొక్కుబడిగా వచ్చి అయిష్టంగా కొద్దిసేపు కూల్చి వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం కల్లా కూల్చివేతలు ఆపేసి వెళ్లిపోతూ, సాయంత్రం నుంచి రాత్రి వరకు భవన నిర్మాణదారుడు మరమ్మత్తులు చేసుకుంటున్నాడు.

ఈ పరిపాటి మార్చలేదని, అధికారులే పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గత శుక్రవారం శేరిలింగంపల్లి జిహెచ్ ఎంసీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినప్పుడు జెవి కాలనీ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటారని నమ్మకం వచ్చినా, అది తీరని కలగా మిగిలిపోయింది. భవనానికి సంబంధించిన ఫైలే మాయమైందన్న వార్తలు కలకలం రేపాయి. ప్రజాప్రతినిధుల ఫిర్యాదులను సైతం లెక్కచేయకుండా అవినీతి ఊబిలో మునిగిపోయారని, సామాన్యుడి పరిస్థితి ఏమిటో ఊహించుకోవాలని సామాజిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగంలో తెర వెనుక ఎంతటి చక్రాలు తిప్పుతున్నాయో అంతుబట్టడం అసాధ్యమని, ఇలాంటి అధికారులపై తక్షణ చర్యలు తీసుకునే సమర్థవంతమైన ఉన్నతాధికారి, తెలంగాణ ప్రభుత్వ వ్యవస్థ ఉన్నదా అని ప్రశ్నలు వర్షం కురుస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి, జిహెచ్‌ఎంసీ ప్రతిష్టను కాపాడాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇలాంటి అక్రమాలు కొనసాగితే శేరి లింగంపల్లి ప్రజలు మరింత అగ్రహావేశాలకు గురవుతారని, పట్టణ ప్రణా ళిక విభాగం ధోరణి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# కన్నకూతుళ్లపై కనికరం లేని తండ్రి

- ముగ్గురు పసిపిల్లలను చెరువులో నెట్టి చంపిన కిరాతకుడు
- కామారెడ్డి పోలీసుల వేగవంతమైన దర్యాప్తులో వీడిన మిస్టరీ
- ఆర్థిక ఇబ్బందులు తాత్కాలికం.. అనాలోచిత నిర్ణయాలు తీరని శోకం
- నిందితుడిపై కఠిన చర్యలు.. చట్టం నుండి ఎవరూ తప్పించుకోలేరన్న ఎస్పీ
- వివరాలు వెల్లడించిన ఏఎస్పి బి. చైతన్య రెడ్డి






**కామారెడ్డి, మార్చి 08 ( జనం సాక్షి) :** కన్నతండ్రే కాలయముడై తన ముగ్గురు పసిపిల్లలను కడతేర్చిన ఈ ఘటన మానవ సమాజానికే మచ్చ. ఆర్థిక ఇబ్బందులు తాత్కాలికమే.. కానీ అనాలోచిత నిర్ణయాలు తీరని శోకాన్ని మిగిల్చుతాయి. ఏ తండ్రీ తన బిడ్డల ప్రాణం తీసే స్థాయికి వెళ్లకూడదు. కామారెడ్డి పట్టణంలోని ఆర్.బి. నగర్ కాలనీకి చెందిన ఇస్మాయిల్ రాజ్ షేక్ భార్య షబీన బేగమ్, తన ముగ్గురు కుమార్తెలు సిఫత్ (8), అయ్యద్ (5), మరియమ్ (3) మార్చి 6న ఉదయం 11 గంటల నుంచి కనిపించడం లేదని కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ముగ్గురు చిన్నారులు ఒకేసారి మాయం కావడంతో పట్టణంలో కలకలం రేగింది. ఈ ఘటన తీవ్రతను గుర్తించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సాంకేతిక ఆధారాలు, స్థానిక విచారణలతో అన్ని కోణాల్లో గాలించిన పోలీసులకు పిల్లల తండ్రి ఇస్మాయిల్ రాజ్ షేక్ ప్రవర్తనపై అనుమానం కలిగింది.

వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ అయిన ఇస్మాయిల్ రాజ్ షేక్ తన చెడు అలవాట్ల వల్ల ఆదాయాన్ని వృథా చేస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. కుటుంబ పోషణ భారం, ముగ్గురు కుమార్తెల ఖర్చులు పెరగడంతో మానసిక ఒత్తిడికి గురై, తన సొంత రక్తమని కూడా చూడకుండా కన్నకూతుళ్లను హతమార్చాలని ముందే పథకం రచించాడు. మార్చి 6న ఉదయం 11 గంటలకు పిల్లలకు స్నాక్స్ కొనిస్తానని మాయమాటలు చెప్పి తన ఆటోలో కామారెడ్డిలోని పెద్ద చెరువు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ కొంతసేపు పిల్లలతో కలిసి సమయం గడిపినట్లు నటించి, ఎవరూ లేని సమయం చూసి ఒక్కొక్కరిగా ముగ్గురు పసిపిల్లలను వరుసగా చెరువు నీటిలోకి నెట్టివేశాడు. వారు ప్రాణ భయంతో కొట్టుకుంటున్నా కనికరం లేకుండా చూస్తూ ఉండి, మునిగిపోయిన తర్వాత అక్కడి నుంచి పరారై, ఇంటికి వెళ్లి ఏమీ తెలియనట్లు నటించాడు. పోలీసుల విచారణలో పొంతన లేని సమాధానాలు చెప్పి దొరికిపోయిన నిందితుడు చివరకు తన నేరాన్ని అంగీకరించాడు. పిల్లల ఆధార్ కార్డులను కూడా సాక్ష్యాలు దొరక్కుండా చెరువు వద్ద రాళ్ల మధ్య పడేసినట్లు తెలిపాడు. హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన కామారెడ్డి ఇన్స్పెక్టర్ నరహరి, రూరల్ ఇన్స్పెక్టర్ రామన్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి అమానుష చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని, నిందితుడికి గరిష్ట శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు.

## హబ్సిగూడలో హాస్టల్ మూడో అంతస్తు నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

**సికింద్రాబాద్(జనంసాక్షి):** హబ్సిగూడలోని ఓ హాస్టల్‌లో మూడో అంతస్తు నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బి. నాగేశ్వరరావు (59) అనే వ్యక్తి హబ్సిగూడలోని డీలక్స్ బాయ్స్ మెన్స్ హాస్టల్‌లో గత నెల రోజులుగా ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 3:17 గంటల సమయంలో హాస్టల్ మూడో అంతస్తులోని పెంట్ హౌస్ నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఓయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు ఇటీవల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఆ కారణంగానే ఆయన ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## పారమిత ఉన్నత పాఠశాలలో ఘనంగా "త్రింశత్ వైభవం" వార్షికోత్సవ వేడుకలు

**పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద రావు.**



**కరీంనగర్ బ్యూరో మార్చి 08 (జనం సాక్షి) :** మంకమ్మ తోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న "త్రింశత్ వైభవం" వార్షికోత్సవ వేడుకలను శనివారం ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వేడుకల్లో విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే బోనాలు, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే ఆహ్లాదకరమైన నృత్య ప్రదర్శనలు, ఆదివాసులు, గిరిజన తెగల కళా నైపుణ్యాన్ని నయనానందకరంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రస్తుత ప్రపంచంతో పోటీ పడుతూ సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులు చూపిన సృజనాత్మకత, అందమైన పదాలతో మనసుకు ఆకట్టుకునేలా మాట్లాడిన వైనం, చిన్నారుల ఆత్మస్థైర్యం కార్యక్రమానికి మరింత శోభ చేకూర్చాయి. పారమిత పాఠశాలలో విద్యనభ్యసించి ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ.. పారమిత పాఠశాల అనే అందమైన వృక్షం నీడన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి అందరికీ అదర్శప్రాయంగా నిలిచామని, గర్వంగా ఉందని, గురువులకు ఎంతో ఋణపడి ఉన్నామని భావోద్వేగంతో తమ ఆనందాలను పంచుకున్నారు.

ముఖ్య అతిథి డాక్టర్ ఇనుగంటి ప్రసాద్ రావు మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాల పాఠాలు మార్కులకే పరిమితం కాకుండా మానసిక వికాసం, నిజ జీవితానికి అన్వయించుకుని భవిష్యత్తుకు మంచి బాట వేయాలనే ఆలోచనతో పారమిత పాఠశాల ప్రారంభించి ముప్పై సంవత్సరాలలో ఎన్నో మైలురాళ్లను అందుకుందని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టి మారుతున్న కాలంతో పాటు అత్యాధునిక బోధనా పద్ధతులను అవలంబిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు రాబోయే మార్పులను ఊహించి కాలంతో పోటీ పడుతూ సాంస్కృతిక, నైతిక విలువలను పెంపొందించుకుంటూ మారుతున్న టెక్నాలజీని విద్యావిషయాలకు అనుసంధానించుకుంటూ ముందుకు వెళ్లాలని, ఈ వార్షికోత్సవ వేడుకలు విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతను, సాంస్కృతిక నైపుణ్యాలను పెంపొందించేలా చేస్తాయని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, శ్రీకర్, శర్మిష్ట, గోపీకృష్ణ, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హెచ్‌సీఏలో పైరవీలు, డబ్బులు తీసుకుని సెలెక్ట్ చేసే దుస్థితి

- ప్రతిభతో క్రీడల్లో రాణించే పరిస్థితి లేకపోవడం బాధాకరం.
- రాబోయే దశాబ్ద కాలానికి కేంద్రం "ఖేలో ఇండియా" మిషన్ ఏర్పాటు.
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి.
- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఘనంగా ముగిసిన "ఛాంపియన్షిప్ సంసద్ ఖేల్ మహోత్సవ్" ఉత్సవాలు.




**కరీంనగర్ బ్యూరో, మార్చి 08 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రతిభతో క్రీడల్లో రాగణించే పరిస్థితి లేకపోవడం బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిదర్శనమన్నారు. హెచ్ సీఏలో సెలెక్ట్ కావాలంటే పైరవీ లు, డబ్బులు తీసుకొని సెలెక్ట్ చేసే సంస్కృతిని కొందరు తీసుకొచ్చారని, క్రీడాకారుల ప్రతిభను దెబ్బతీసే దుర్మార్గానికి చరమ గీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు.

వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం రాబోయే దశాబ్ద కాలానికి గాను 'ఖేలో ఇండియా మిషన్' ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ మిషన్ ద్వారా క్రీడాకారుల్లోని సమగ్ర ప్రతిభాభివృద్ధికి మార్గం చూపడంతోపాటు కోచ్‌లు, సహాయక సిబ్బంది వ్యవస్థాగత అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. స్పోర్ట్స్ సైన్స్ , టెక్నాలజీ సమీకరణతోపాటు క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోటీలు, లీగ్స్ పేరిట క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడా శిక్షణ, పోటీల కోసం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు ప్రారంభించిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారుల కోసం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 1 నుండి 7 వరకు "ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్" పేరిట వారం రోజులపాటు ఆటల పోటీలు నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం లోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో వివిధ క్రీడా పోటీల్లో అర్హత సాధించి, విజేతలుగా నిలిచిన టీంలకు, పార్లమెంటు స్థాయిలో జరిగిన పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు, జట్లకు ఆదివారం రోజు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని హోటల్ "త్రిద"లో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది.

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తో పాటు కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణా రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ కోలగాని శ్రీనివా స్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ప్రోగ్రాం కోఆర్డినే టర్లు గుజ్జ శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, కార్పొరే టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... ఆరోగ్య వంతమైన జీవన శైలిలో క్రీడలు ఒక భాగమని, క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకునే కాకుండా, మానసిక సమస్యలను దూరం చేస్తాయన్నారు. ఆత్మవిశ్వా సాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. క్రీడలు క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, చెట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలు, వ్యూహరచన నైపుణ్యం, విమర్శనాత్మక ఆలోచన అలవాడేలా చేస్తాయన్నారు. ఈ ఆధునిక కాలంలో విద్య ఎంత అవసరమో క్రీడలు అంతే అవసరం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి పార్లమెంటు నియోజకవర్గం ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్



**రుద్రంగి మార్చి 8 (జనం సాక్షి) :** రంజాన్ మాసం సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై,ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం సమానత్వం, పరస్పర సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు..తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి సర్పంచ్ గండి నారాయణ, నాయకులు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్ సలీం

**కరీంనగర్ టౌన్ మార్చి 8 ( జనం సాక్షి ) :** కరీంనగర్ నగరంలో పోచమ్మ వాడ నుండి వన్ హాస్పిటల్ కి ఆటోలో వెళ్లడం జరిగింది. తన తండ్రిగారి ఆరోగ్యం నిమిత్తం ఒక లక్షా ఇరవై వేల రూపాయలు (రూ. 1,20,000) డబ్బులను మర్చిపోయి హడావిడిగా వెళ్లిపోవడం జరిగింది ఇది గమనించిన ఆటో డ్రైవర్ సలీం తిరిగి వారికి డబ్బులను అప్పగించి సలీం మానవత్వం చాటుకుంటారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ సలీంను పలువురు అభినందిస్తున్నారు.

# మహిళలపై హింసకు మద్యపానమే ప్రధాన కారణం

- హైకోర్టు న్యాయవాది శారదా
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి



**అబ్దుల్లాపూర్ మెట్టు, మార్చి 8(జనం సాక్షి ):** దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ మహిళలపై హింస, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇందుకు పురుషాధిక్య భావజాలంతో పాటు మద్యపానం కూడా ప్రధాన కారణమని హైకోర్టు ప్రముఖ న్యాయవాది శారదా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి పేర్కొన్నారు. మద్యపానాన్ని పూర్తిగా రద్దు చేయాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్-2లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు కాటి అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయవాది శారదా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 1910లో కోపెన్ హేగెన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మహిళా నాయకురాలు క్లారా జెట్‌కిన్ ప్రతిపాదనతో మహిళా దినోత్సవం ప్రారంభమైందని తెలిపారు. ఈ దినం పండుగ కాదు, మహిళలు తమ హక్కుల సాధన కోసం పోరాటం చేసి సాధించుకున్న చారిత్రాత్మక దినమని పేర్కొన్నారు.ప్రస్తుతం సమాజంలో ప్రతి 15 నిమిషాలకు ఒకసారి మహిళలపై దాడులు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానం వల్ల వ్యక్తులు మత్తులో ఉండి ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది మహిళలపై హింసకు ప్రధాన కారణమవుతుందని అన్నారు. ప్రభుత్వాలు మద్యం, గుట్కా, పాన్ మసాలా వంటి వాటి ద్వారా ఆదాయం పొందడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు.మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు జరిగితే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠ్యపుస్తకాలలో ఉన్న పురుషాధిక్య భావజాలాన్ని ప్రోత్సహించే అంశాలను తొలగించాలని కూడా సూచించారు. దేశపు మొదటి పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒక మహిళ అని గుర్తు చేస్తూ రాజకీయ, సామాజిక, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ హక్కుల సాధన కోసం చట్టపరమైన పోరాటాలు చేయాలని, నిర్భయ చట్టం, ఆస్తి హక్కు చట్టం, లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాలపై అవగాహన పెంచాలని అన్నారు.

# 14-15 ఏండ్లలోపు బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలి

- మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 08 (జనం సాక్షి) :** జిల్లాలోని 14 నుంచి 15 ఏండ్ల వయసులోపు బాలికలకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపి లోమా వైరస్) వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు అనగా (ఏప్రిల్1 తేదీ 2011- మార్చి31 తేదీ 2012 మధ్య పుట్టిన) పలువురికి వ్యాక్సిన్‌లు వేశారు. అనంతరం వారికి వాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు ఆడపిల్లల తల్లిదండ్రులు బాధ్యత వహించి హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని పిలుపు ఇచ్చారు. జిల్లాలో 3, 773 మంది బాలికలను గుర్తించారని, బాలికల తల్లిదండ్రులు గుర్తింపు కార్డుతో వచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ పంపిణీ మొదలు పెట్టామని తెలిపారు.

**మహిళా దినోత్సవ వేడుకలు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, డీఎంహెచ్ఓ రజిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా,జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.



# 99 రోజుల కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సన్నద్ధం

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా సన్నాహక సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- గ్రామ పంచాయతీలకు 21.04 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల




**పెద్దపల్లి, , మార్చి 8: (జనం సాక్షి):** 99 రోజుల కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం హాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 99 రోజుల ప్రోగ్రాం సన్నాహక కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా తరపున కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రతి అధికారికి నిర్దిష్ట బాధ్యతలు అప్పగించామని తెలిపారు. సర్పంచ్‌లు, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, వారందరూ 99 రోజుల కార్యక్రమంలో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు చేపట్టామని వివరించారు. కార్యక్రమం తర్వాత ప్రజలకు స్పష్టమైన మార్పు కనిపించే దిశగా పెద్దపల్లి జిల్లాలో కార్యాచరణ రూపొందించామని, ప్రభుత్వ లక్ష్యాల సాధన దిశగా మంత్రివర్యుల సూచనలు, ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి. వేణు, జే. అరుణ శ్రీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు 21.04 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల

జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 21 కోట్ల 4 లక్షల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 13 గ్రామీణ మండలాల పరిధిలోని గ్రామాలకు 2023-24, 2024-25 సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు మూడు విడతల్లో (13 జనవరి 2026, 17 ఫిబ్రవరి 2026, 26 ఫిబ్రవరి 2026) విడుదలయ్యాయని వివరించారు. ఇందులో అన్‌టైడ్ గ్రాంట్ 5 కోట్ల 73 లక్షలు, టైడ్ గ్రాంట్ 15 కోట్ల 31 లక్షలు ఉన్నాయని తెలిపారు. అన్‌టైడ్ గ్రాంట్ నిధులతో కరెంట్ బిల్లుల చెల్లింపు, జీతాల చెల్లింపు, ఇతర కార్యాలయ ఖర్చులు, టైడ్ గ్రాంట్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

# మహిళా విద్యకు ప్రత్యేక ప్రణాళికలు అవసరం : ప్రొఫెసర్ హరగోపాల్

- మహిళల సాధికారతతోనే అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యం : డా. వనమాల



**ముషీరాబాద్, మార్చి 8: (జనం సాక్షి):** మహిళా విద్యకు ప్రత్యేక ప్రణాళికలు అవసరం అని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బాగ్లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మహిళా ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో "తెలంగాణ విద్యా కమిషన్ -- మహిళా విద్య" అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, డాక్టర్ వనమాల, జర్నలిస్టు సజయ్య లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారతతోనే అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యమని, మహిళలకు కుటుంబం, ప్రభుత్వాలు అందించవలసిన ముఖ్యమైన ఆయుధం విద్య మాత్రమేనని పేర్కొన్నారు. అయితే తెలంగాణ విద్యా కమిషన్‌లో మహిళలు, బాలికల విద్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక సూచనలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతంలో పురుషులు 87 శాతం ఉండగా మహిళలు 74 శాతం మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. వైద్య, సాంకేతిక, వృత్తి విద్యలలో మహిళలకు ప్రత్యేక సీట్ల కేటాయింపు అవసరమని, ప్రపంచ స్థాయి క్రీడల్లో మహిళలు విజేతలుగా నిలిచినప్పుడు ప్రభుత్వం భారీ నగదు బహుమతులు ప్రకటిస్తున్నప్పటికీ మహిళల కోసం ప్రత్యేక క్రీడా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలనే సూచనలు లేకపోవడం కూడా నిరాశ కలిగించే అంశమని తెలిపారు. పారిశ్రామికీకరణలో మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య అంగడి సరుకుగా మారుతున్న పరిస్థితుల్లో మహిళా ఉపాధ్యాయుల మేధోశ్రమ రక్షణకు ఎలాంటి సూచనలు లేకపోవడం విచారకరమని తెలిపారు.

# పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

## సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్



**జమ్మికుంట, మార్చి 8 (జనం సాక్షి):** పెంచిన వంట గ్యాస్ ధరలకు నిరసనగా జమ్మికుంట పట్టణంలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాళీ గ్యాస్ సిలిండర్ చౌరస్తాలో పెట్టి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు పెరగకుండానే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాత్రం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. గ్యాస్ ధరల పెంపు అనేది కేవలం ఆర్థిక భారం మాత్రమే కాదు, ఇది ప్రజల జీవన ప్రమాణాలపై చేస్తున్న ప్రత్యక్ష దాడి అన్నారు. ఉజ్వల పథకం పేరుతో ఉచిత కనెక్షన్లు ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు రీ ఫిల్లింగ్ గ్యాస్ ధరలను ఆకాశానికి పెంపు మూలంగా ఉమ్మడి జిల్లా ప్రజలపై నెలకు అదనంగా 9 కోట్ల భారం పడుతుందన్నారు. గృహ వినియోగ సిలిండర్ పై 60రూపాయలు, కమర్షియల్ సిలిండర్ పై 115 రూపాయలు పెంచడం మూలంగా సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు.

2014 కు ముందు గ్యాస్ సిలిండర్ ధర 500 లోపు ఉంటే బిజెపి ప్రభుత్వం వచ్చిన 12 సంవత్సరాల కాలంలో వెయ్యికి చేరుకుందన్నారు. పెరిగిన ధరలు సామాన్య ప్రజలతోపాటు చిరు వ్యాపారులపై కూడా భారంగా మారిందన్నారు. గ్యాస్ బుకింగ్ వ్యవధిని పెంచడం కూడా సామాన్యులను ఇబ్బంది పెట్టినట్టే అన్నారు. మోడీ ప్రభుత్వం మహిళా దినోత్సవం ముందు రోజు గ్యాస్ ధరలు పెంచి మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. గ్యాస్ ధరలు పెరగడంతో నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతాయని, రవాణా చార్జీల భారం కూడా పడుతుందన్నారు. పెంచిన వంటగ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. గ్యాస్ సబ్సిడీని పునరుద్ధరించి వినియోగదారుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి దండిగారి సతీష్ ,మండల కమిటీ సభ్యులు కన్నాము సదానందం, వడ్లూరి కిషోర్,జక్కుల రమేష్,మారపల్లి కిరణ్, పుల్లూరి రాములు, సాగర్ల కుమార్, గేరా రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు హక్కుల కోసం పోరాడాలి

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

**కరీంనగర్ టౌన్ మార్చి 8 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, టియుసిసి కేంద్రకమిటీ సభ్యులు బండారి శేఖర్ ఆధ్వర్యంలో మహిళలంతా కలిసి కేక్ కట్ చేసి ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా టియుసిసి కేంద్రకమిటీ సభ్యులు బండారి శేఖర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలనీ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ద్వారా హక్కులు సంక్రమించినా సమాన పనికి సమాన వేతనం అనేది నేటికీ అందని ద్రాక్షగానే ఉందని అన్నారు. పైగా పని స్థలాల్లో లైంగిక వేధింపులు, అకృత్యాలు,అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం రోజు బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వాలు మహిళల పట్ల ప్రకటనాలకు వాగ్దానలకే పరిమితం అవుతున్నాయని ఏద్దవః చేశారు. ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేసే కార్మికులకు కనీసం వేతనం 26వేలు ఇవ్వాలని, ఏజిన్సిలను రద్దు చేసి నేరుగా కార్మికులను వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి. అరుణ్, నాయకులు శారదా, పద్మ, అరుణ, సకిన బేగం, రజియా, మమతా, సుకన్య, శ్వేతా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# పిడిఎస్ బియ్యం పట్టివేత

**రాయికల్:** రాయికల్ పట్టణంలోని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నట్లు చెపుతున్నా, వ్యాన్ నిండ దాదాపు 150 క్వింటలకు పైగా పిడిఎస్ బియ్యంన్ని రాయికల్ పట్టణంలోని ఓ రేషన్ డీలర్ సంరక్షణలో డంప్ చేసినట్లు తెలిసింది.

# మహిళలను సన్మానించిన హుజురాబాద్ ఏసిపి మాదవి



**వీణవంక మార్చి 08 (జనంసాక్షి) :** వీణవంక అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరిం చుకొని హుజురాబాద్ సబ్ సబ్ డివిజనల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో హుజురాబాద్ ఏసిపి మాధవి పర్యవేక్షణలో సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ హుజురాబాద్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినారు. వీణ వంక మండలానికి చెందిన వివిధ గ్రామాలలో మహిళా సర్పంచులు,ఉప సర్పంచ్ లు వివిధ రంగాలలో కృషి చేసిన మహిళలను ఘనంగా సన్మానించినారు. అనంతరం ఏసీపీ మాధవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, సమాజంలో తమ పాత్ర ఎంతో గొప్పదని,అన్ని రంగాలలో ముందుకు నడువాలని,కుటుంబాన్ని చూసుకుంటునే జీవితాన్ని కొనసాగించాలని సూచించినారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోనెల సమ్మన్న ముదిరాజ్ కవి,గాయకులు దరిపెల్లి మురళి (సింగర్),పొట్టాల శివకుమార్ (సింగర్) తమ పాటలతో మహిళలను కొనియాడినారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ,వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి,హుజురాబాద్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది,మహిళా తదితరులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణంకు
# ఫారెస్ట్ అధికారుల అడ్డంకులు

### నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగించాలి : వైస్ ఎంపీపీ వర్ధ మల్లికార్జున్



**ధారూర్ మర్చి 08( జనం సాక్షి)** మండల పరిధిలోని నాగసముందర్.రుద్రారం గ్రామాల మధ్య కోట్‌పల్లి ప్రాజెక్ట్ అలుగు నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 27.50 లక్షల నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఆర్అండ్.బి శాఖ సిబ్బంది వంతెన నిర్మాణానికి సంబంధించిన మట్టి నమూనా పరీక్షలు (సోయిల్ టెస్టింగ్) నిర్వహించేందుకు అక్కడికి చేరుకున్నారు. అయితే వంతెన నిర్మాణం జరగనున్న ప్రదేశం అటవీ శాఖ మరియు ఆర్అండ్ బి.పరిధిలో ఉండడంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అనుమతి లేకుండా పనులు చేయరాదని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనడంతో నమూనా పరీక్షలను నిలిపివేసినట్లు ఆర్అండ్ బి సిబ్బంది ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించారు. దీంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ వరద మల్లిఖార్జున్ వెంటనే జిల్లా అటవీ శాఖ అధికారి డీఎఫ్ఓను సంప్రదించి సమస్యను వివరించారు. నాగసముందర్ రుద్రారం గ్రామాలకోసమే కాకుండా కోట్‌పల్లి మండలం బంట్వారం మండలం కోహిర్ కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం. వివిధ మండలాలు వివిధ రాష్ట్రాల నుంచి ఈ ప్రధాన రహదారిపై నిత్యం వాహనాలు వెళుతుంటాయని ప్రజలకు ఈ వంతెన ఎంతో అవసరమని,నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతా యని వివరించారు. దీంతో ఫారెస్ట్ జిల్లా స్థాయి అధికారులు బ్రిడ్జి నిర్మాణం విషయంలో సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. నాగసముందర్ ఫారెస్ట్ ఆఫీసర్ బీట్ ఆఫీసర్ పై ప్రజలు సోషల్ మీడియాలో ఫైర్ అవుతున్నారు.




# బాలికలు తప్పనిసరి వ్యాక్సినేషన్ తీసుకోవాలి

## నగర మేయర్ మహంకాళి స్వామి..

**గోదావరిఖని, జనంసాక్షి:** ప్రాణాంతక గర్భాశయ క్యాన్సర్ నివారణకై 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలు తప్పని సరిగా వ్యాక్సినేషన్ తీసుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఆదివారం గోదావరి ఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో రీజనల్ మెడికల్ ఆఫీసర్ కృపాభాయ్‌తో కలిసి హ్యూమన్ పాపిలోనా వైరస్ ( హెచ్‌పివి ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది మహిళలు ప్రతి ఏటా గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతుండడంతో నివారణా చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆరంభించిందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని అన్నారు. మహిళా దినోత్సవం రోజున ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాళ్ సింగ్, స్థానిక కార్పొరేటర్ సాగి సంతోష్ రావు , వన్ టౌన్ సి ఐ ఇంద్రసేనా రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ఇంటర్నేషనల్ వియ్ లవ్ యు ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన 895 వ వరల్డ్ వైడ్ బ్లడ్ డ్రైవ్ కార్యక్రమాన్ని కూడా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వియ్ లవ్ యు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. రక్త దాత లను అభినందించారు. ఈ కార్యక్రమంలో 50 మంది దాతలు రక్త దానం చేశారు. పలువురు కార్పొరేటర్ లతో పాటు స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రతినిధి ప్రేమ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో
# స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు

### డా. కె. ప్రమోద్ కుమార్ (జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి)



పెద్దపల్లి,మార్చి 08(జనంసాక్షి) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 100 రోజుల కార్యక్రమం లో భాగంగా 6.3.2026 నుండి ఆరోగ్య శాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు రోజు ఒక ఆరోగ్య కేంద్రములో నిర్వహించు చున్నాము అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ అన్నారు. ఇందులో గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, ఆప్తల్మోలజి, జనరల్ మెడిసిన్ మరియు డెంటల్ స్పెషలిస్ట్ సేవలు అందించడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమం లోని స్పెషలిస్ట్ సేవలను సమీప ఆరోగ్య కేంద్రంలో నిర్వహించినపుడు ప్రజలు సద్వినియోగం చేసు కావాలని కోరారు. స్పెషలిస్ట్ ఆరోగ్య శిబిరాల షెడ్యూల్ ఇదీ మార్చి 6న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాఘవాపూర్, 7న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఓదల మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అడ్డగుంటపల్లి, 9న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అల్లురు, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పుట్నూర్, 10న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జనగాం మరియు పట్టాన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 5- ఇన్‌ఇంక్లిన్, 11న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాగినేడు , మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లక్ష్మీపూర్, 12న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద్దపల్లి, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామగుండం , 13న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామగుండం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీరాంపూర్, 14న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంతర్గం, 16న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బాసంతానగర్,17న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బేగంపేట్, 18న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎలిగేడు, 20న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గద్దలపల్లి, 23న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గర్రెపల్లి, 24న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జూలపల్లి, 25న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కామాన్పుర్, 26న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొలనూర్, 28న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూనారం, 30న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మేడారం, 31న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముత్తారంలో జరుగుతాయని తెలిపారు.

## ఎన్నికల వరకే రాజకీయాలని...
# నగర అభివృద్దే మా పాలకవర్గ లక్ష్యం

### కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, మార్చి 08 (జనంసాక్షి) :**


ఎన్నికల వరకే రాజకీయాలని, నగర అభివృద్దే మా పాలకవర్గ లక్ష్యం అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమ నేపథ్యంలో ఆదివారం రోజు కరీంనగర్ లోని 9,10,11 డివిజన్ లలో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యటించారు. 99 రోజుల కార్యచరణలో భాగంగా 3 వ రోజు మొదటగా 10 వ డివిజన్ లో కార్పోరేటర్ కొమురయ్యతో కలిసి కట్టరాంపూర్ గిద్దెపెరుమాండ్ల గ్రౌండ్ వద్ద 5 లక్షల నిధులతో గ్రౌండ్ గేటు నిర్మాణం కు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్ లో పారిశుధ్య పనులు ప్రారంభం చేసి కార్మీకులు యంత్రాల సహాయంతో పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు డ్రైనేజీలలో సిల్ట్ తొలగించి, ఖాళీ స్థలాలను శుభ్ర చేశారు. అనంతరం 9 వ డివిజన్ లో కట్టరాంపూర్ శివారు కాలనీలో కార్పోరేటర్ టేల భూమయ్యతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి 2.50 లక్షలతో డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం కు భూమి పూజ చేశారు. ఉజ్వల పార్కు సమీపంలో ఎంపి ల్యాడ్ 5 లక్షల నిధులతో గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కు భూమీ పూజ చేశారు. అనంతరం 11వ డివిజన్ లో స్థానిక కార్పోరేటర్ ఆకుల నర్మద నర్సయ్యతో కలిసి న్యూ శ్రీనగర్ కాలనీ లో రెండు చోట్ల 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు, మరో 5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా నగరంలోని అన్ని డివిజన్లను సమాంతరంగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంధర్భంగా మహిళలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విలీన గ్రామాల డివిజన్లతో పాటు శివారు ప్రాంతాల డివిజన్లలో కూడ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల నిధులతో 66 డివిజన్ల ప్రజల సమస్యలను దశల వారిగా పరిష్కరించి కరీంనగర్ నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రం మొదటి పది రోజుల్లో డివిజన్ల లో ప్రధాన సమస్యలైన పారిశుధ్యం, వీది దీపాలు, మంచి నీటి సరఫరా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు.

మరో వైపు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో ప్రత్యేక ప్రణాళిక ను రూపొందించుకొని ప్రతి డివిజన్ లో పారిశుధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి రోజు స్పెషల్ డ్రైవ్ లో 5 డివిజన్లను ఎంపిక చేస్కోని పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్ లో 50 మంది అదనంగా కార్మీకులను ఏర్పాటు చేస్కోని డివిజన్ లలో పరిసరాలను శుభ్రం చేయడం డ్రైనేజీలలో సిల్ట్ తొలగించడం, డిబ్రీలను తొలగించడం, రోడ్ల పై చెత్తను తొలగించడం జరుగుతుందని తెలిపారు.

మరో వైపు సుడా చైర్మన్ నరెందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి చేపట్టారని తెలిపారు. పల్లెలతో పాటు పట్టణాలను కూడ పారిశుధ్య పరంగా మెరుగు పరాచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ లో ప్రతి డివిజన్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు మేయర్, కమీషనర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు డివిజన్లను పారిశుధ్య పనులతో మెరుగు పరచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పోరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**రాయికల్ జనం సాక్షి :** రంజాన్ మాసం సందర్భంగా జమాతే ఇస్లామిక్ హింద్ రాయికల్ శాఖ ఆధ్వర్యంలో రాయికల్ మున్సిపల్ నూతన పాలకవర్గానికి ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి సన్మానం చేసిన జమాతే ఇస్లామిక్ హింద్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జమాతే ఇస్లామిక్ హింద్ రూపొందించిన రంజాన్ మాసం గేటు రాయి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్, రాకేష్ నాయక్,పుర్రె శ్రీధర్,నాయకులు తురగ శ్రీధర్, అడ్వకేట్ మచ్చ శేఖర్, బత్తిని నాగరాజు, తోపారపు సురేష్, కునారపు భూమేష్, జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యక్షులు షంషేర్,కార్యదర్శి మహమ్మద్ నయీమ్, కోరుట్ల శాఖ అధ్యక్షులు మొహమ్మద్ ఇలియాజ్ ఖాన్, ముస్లిం సోదరులు ఇంతియాజ్, మున్ను, సోహెల్, ఆరిఫ్ ఖాన్,అబ్దుల్ ఖదీర్, నయీమ్, ముజాఫర్, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
09 మార్చి 2026



# ఉప్పల్ భగాయత్‌లో రూ.13.35 కోట్లతో అభివృద్ధి

- కాలనీవాసులకు నిధుల మంజూరు పత్రాలు అందజేసిన పరమేశ్వర్ రెడ్డి
- త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పనుల ప్రారంభం

**ఉప్పల్, మార్చి 8 (జనంసాక్షి) :** ఉప్పల్ భగాయత్ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూ.13.35 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పనులు పూర్తయితే ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో భగాయత్ ప్రాంతానికి అవసరమైన నిధులు మంజూరు చేయించామని, కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. భగాయత్ ప్రాంతంలో రహదారుల నిర్మాణం మరియు అభివృద్ధి కోసం రూ.9.85 కోట్ల నిధులు మంజూరు కాగా, ప్రజలకు ఉపయోగపడే విధంగా సామూహిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక పెద్ద సామూహిక భవనం నిర్మాణానికి రూ.3.50 కోట్ల నిధులు మంజూరు అయినట్లు వివరించారు. ఈ నిధులు మంజూరు కావడానికి గతంలో కార్పొరేటర్‌గా పనిచేసిన మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి కృషి ఎంతో కీలకమైందని తెలిపారు. వారి నిరంతర కృషి ఫలితంగానే ఈ ప్రాంతానికి భారీ మొత్తంలో నిధులు లభించాయని పేర్కొన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి కాలనీవాసులకు నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. త్వరలోనే పనులకు సంబంధించిన ఒప్పంద ప్రక్రియ పూర్తి చేసి ఆలస్యం లేకుండా అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అదేవిధంగా సోమవారం ఉదయం నుంచి భగాయత్ ప్రాంతంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని, మొత్తం 42 మంది పారిశుధ్య కార్మికులతో కాలనీ పరిశుభ్రత పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రాంత ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భగాయత్ సంక్షేమ సంఘం సభ్యులు వక్కంటి శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, వంశీచందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పూజల ప్రభాకర్, బాలయ్య, రాజు, కిషన్ ముదిరాజ్, విప్లవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం,ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేస్తున్నారని, భవిష్యత్తులో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి భగాయత్ ప్రాంతాన్ని ఆదర్శవంతమైన కాలనిగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని వారు తెలిపారు.

# మహిళలకు ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన సర్కారు ధ్యేయం

- మహిళల శక్తి సమాజాన్ని మార్చగలదు : మంత్రి సీతక్క
- మహిళలతోనే సమాజ అభివృద్ధి : మంత్రి దామోదర రాజనర్సింహా
- డ్వాక్రా మహిళల హెల్త్ ప్రొఫైలింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి
- నేటినుంచి రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కుమరం భీం ఆదివాసి భవన్‌లో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క ముఖ్య అతిథులుగా హాజరై పలు మహిళా సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలను మంత్రులు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రులు స్వయంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అలాగే బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో శిశువులకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ గదుల నమూనాను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం కౌమార బాలికలకు హెచ్‌పీవీ టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ బాలికలకు ధైర్యం చెప్పి మంత్రులు స్వయంగా టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఆన్‌లైన్ పోర్టల్ "మహిళా వసతి" ను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. అలాగే "ఇందిరా మహిళా శక్తి అచీవ్‌మెంట్స్" పుస్తకాన్ని మంత్రి సీతక్క విడుదల చేశారు. కార్యక్రమంలో వినూత్న వ్యాపారాలతో రాణిస్తున్న 31 మంది మహిళలను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించి, వారికి రూ.25,000 చొప్పున ఆర్థిక ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలే సమాజానికి మూలాధారం అని పేర్కొన్నారు. ఒకప్పుడు మహిళలకు ఓటు హక్కు కూడా లేకపోయినా పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. అవకాశం ఇస్తే మహిళలు పంట పొలాల నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. పంట పొలాల్లో 80 శాతం పనిని మహిళలే చేస్తారని పేర్కొంటూ, ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మహిళలు అందరి గురించి ఆలోచిస్తారని కానీ తమ ఆరోగ్యం



గురించి పట్టించుకునే సమయం ఉండదని, అందుకే మహిళా సంఘాల సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వివరించారు. ముందుగానే వ్యాధులను గుర్తించి వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా లోన్లు అందించి పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైటెక్ సిటీలో వందల కోట్ల విలువైన మార్కెట్‌ను మహిళా సంఘాలకు అప్పగించినట్లు చెప్పారు. మహిళలు ఇప్పపువ్వు లడ్డూల నుంచి రైస్ మిల్లుల నిర్వహణ, సోలార్ ప్లాంట్ల వరకు వ్యాపారాల్లో ముందుకు వస్తున్నారని తెలిపారు. మేడారం జాతరలో 565 మహిళా సంఘాలకు దుకాణాలు ఏర్పాటు చేసి, రూ.6 కోట్ల పెట్టుబడితో రూ.3.5 కోట్లకు పైగా లాభాలు సాధించారని మంత్రి తెలిపారు. ఒకప్పుడు చిన్నచిన్న వ్యాపారాలు చేసిన మహిళలు ఇప్పుడు సంపద సృష్టికర్తలుగా ఎదుగుతున్నారని అన్నారు. మహిళలు బాల్య వివాహాలను అడ్డుకోవాలని, అమ్మాయిలకు న్యాయం జరిగేలా మహిళా సంఘాలు ముందుండాలని పిలుపునిచ్చారు. వచ్చే మహిళా దినోత్సవానికి వేలాది మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం సమాజ అభివృద్ధికి కీలకమని అన్నారు. మహిళా సంఘాలపై బ్యాంకులకు ఎంతో విశ్వాసముందని, వారు తీసుకున్న రుణాలను 98 శాతం తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యం బాగుండాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ఈ పరీక్షలను పూర్తిచేసి, మహిళలకు డిజిటల్ ఆరోగ్య కార్డులను అందజేస్తామని వెల్లడించారు. అమ్మాయిల బంగారు భవిష్యత్తు కోసం హెచ్‌పీవీ టీకాను అందిస్తున్నామని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు ఈ టీకా గురించి అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, దివ్య దేవరాజన్, శృతి ఓజా, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**మహిళల సాధికారత కోసం**

# సంఘటితంగా ముందుకు సాగాలి

## మహిళలను ఆర్థికంగా బలంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల బ్యూరో మార్చి8 (జనంసాక్షి)**

జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఎ. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే మహిళలకు అండగా ఉండాలనే సంకల్పంతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై తొలి సంతకం చేసి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని తెలిపారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు నడిపించే అవకాశాలు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు వంటి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ మహిళలను ఆర్థికంగా బలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజారాంపల్లి గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు



ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తాను పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో మటన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడంతో పాటు మరిన్ని అభివృద్ధి పథకాలు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, డీఆర్‌డీఓ రఘువరన్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్ సైబరాబాద్ దేవాలయానికి భూమిపూజ

## ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ

## ఇస్కాన్ దేవాలయ నిర్మాణంతో ఆధ్యాత్మిక సేవలు విస్తరిస్తాయి: కొండా సురేఖ



**శేరిలింగంపల్లి (జనంసాక్షి) :** సైబరాబాద్ పరిధిలోని నలగండ్లలో నిర్మించబోయే అతి పెద్ద ఇస్కాన్ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం పలికారు..అర్చకులు వేద మంత్రాల నడుమ కొండా సురేఖ భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇస్కాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని భారతీయ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో వారిపాత్ర గొప్పదని కొనియాడారు. వారు కృష్ణతత్వాన్ని బోధించడంతో పాటుగా పేదవారికి ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయమన్నారు.ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో నేను పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వంలో దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి కోసం కాళ్లు అరిగేలా తిరిగారని అయినా వారికి స్థలం కేటాయించలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ఇస్కాన్ దేవాలయం నిర్మాణం కోసం 6000 గజాల భూమిని 22 సంవత్సరాల పాటు లీజ్‌పై కేటాయించినట్లు తెలిపారు. ఇస్కాన్ దేవాలయం నిర్మాణంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజానికి మేలు జరుగుతుందన్న విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, నాయకులు జగదీశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఇస్కాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మొబైల్ డ్యూటీ పోలీసులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ

## ప్రమాద స్థలానికి ముందుగా చేరుకునే అవకాశం

**సికింద్రాబాద్(జనంసాక్షి):** ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం ,రోడ్డు ప్రమాదాల సమయంలో తక్షణ అత్యవసర సహాయం అందించేందుకు మల్కాజిగిరి పరిధిలోని తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు ఆదివారం ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై నిరంతరం పర్యవేక్షణ నిర్వహించే మొబైల్ డ్యూటీ అధికారులు సాధారణంగా ప్రమాద స్థలానికి ముందుగా చేరుకునే అవకాశం ఉండటంతో, ఇకపై వారు తమ పెట్రోలింగ్ వాహనాల్లో ఈ ఫస్ట్ ఎయిడ్ కిట్లను వెంట తీసుకెళ్తారనీ చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగిన సందర్భంలో గాయపడిన వారికి సంఘటనా స్థలంలోనే తక్షణ ప్రథమ చికిత్స అందించడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. అనంతరం వారిని సమీప ఆసుపత్రులకు తరలించే వరకు ఈ ప్రథమ చికిత్స గాయపడినవారి ప్రాణాలను కాపాడటంలో,పరిస్థితిని స్థిర పరచడంలో సహాయపడుతుంది అన్నారు. ఈ కా ర్యక్రమం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు, ప్రజల భద్రత పట్ల ట్రాఫిక్ పోలీసుల బాధ్యతను మరింత బలపరుస్తోంది అన్నారు.

# రెనే సేవాతత్పరతతో అమ్మకు మరింత గౌరవం

## రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రముఖ గాయని, సినీ నటి కుమారి నాగదుర్గ చే లక్కీ డ్రా ఎంపికైన పది మందికి లక్షల రూపాయల వైద్యం ఉచితం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 08 (జనంసాక్షి) :** ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉన్నట్లే, ప్రతి మహిళ శక్తి వెనుక పురుషుడి హస్తం తప్పనిసరి అని నాగదుర్గ అన్నారు. ఆదివారం రోజు స్థానిక రెనే మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో రజని సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ గాయని, సినీనటి కుమారి నాగదుర్గ హాజరై మాట్లాడుతూ... సృష్టికి మూలం అమ్మ అని, ఆడతామో అందాల ఆనంద పౌర సమాజ నిర్మాత అని తెప్పాల్సిన పని లేదని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రతి ఏట ఒక ప్రత్యేక ఉచిత ఫర్టిలిటీ సేవలు పొందడానికి అర్హులైన 10 మందిని లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసుకొని లక్షల విలువైన ఆధునిక వైద్య సేవలను ఉచితంగా కల్పిస్తున్న రెనే ఆసుపత్రి చైర్మన్ ప్రో. డా. బంగారి స్వామి, డైరెక్టర్ డా. రజనీ ప్రియదర్శిని దంపతులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాట, పాట కలగలిపి అమ్మ గొప్పతనాన్ని ఆవిష్కరించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య సేవలు పొందే పది మందిని లక్కీడిప్ ద్వారా 10 మందిని ఎంపిక చేసారు. డా రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ... తమ అత్త గారి పేరిట ప్రతి ఏట 20 లక్షల విలువైన సంతాన సాఫల్య ఉచిత సేవలు అందించడం చాలా సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. డా.బంగారి స్వామి మాట్లాడుతూ... చిన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేర్చిన సమాజానికి ఎంతో రుణపడి ఉన్నామని, తమ ఆసుపత్రి ద్వారా ఏడాదికి 50 లక్షలకు పైగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని డా.రజనీ ప్రియదర్శిని అన్న , ఎన్ఆర్ఐ అయిన పెద్దపల్లి రంజన్, వారి భార్య మీనా లు అదనంగా ఇంకో ముగ్గురు జంటలకు ఉచితంగా ఐవిఎఫ్ చికిత్సను అందించడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఇంకొక జంటకు ప్రొఫెసర్ డా.బంగారి స్వామి ఉచితంగా ఐవిఎఫ్ చికిత్సను అందించడానికి ముందుకు వచ్చారు. మొత్తం 14 మంది దంపతులకు ఉచిత ఐవిఎఫ్ చికిత్స అవకాశం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నాగదుర్గను ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాయత్రి, మానుకోండూర్ మహిళా సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలత, మహిళా కార్పొరేటర్లు, చొప్పరి జయశ్రీ, పెద్దపల్లి శ్రీలేఖ, సామాజిక సేవా ప్రతినిధుకైన, మీనా రంజన్, శ్యామల తో పాటు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రవీంద్రారెడ్డి చారి, జనరల్ ఫిజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, డా.లతీష్ రెడ్డి, నాన్ క్లినికల్ డైరెక్టర్ మేకల అరవింద్ రావు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# మహిళల శ్రమను గుర్తించడమే సరైన గౌరవం

## ప్రొఫెసర్ కోదండరాం

**ముషీరాబాద్, మార్చ్ 08 (జనం సాక్షి):** సమాజంలో మహిళల శ్రమను గుర్తించడమే వారికి ఇచ్చే సరైన గౌరవమని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అడిక్మెట్ డివిజన్ రాంనగర్ గుండు వద్ద డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్ అధ్యక్షతన సయ్యద్ మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ ఇమామ్ ల సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించినప్పుడే ఆ సమాజ అభివృద్ధి సమగ్రంగా జరుగుతుందని అన్నారు. ఇంటా బయట మహిళలు వివక్షతకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు ప్రతి ఒక్కరి పైన ఉందని పేర్కొన్నారు. మహిళలు ఇంట్లో చేసే ప్రతి పని నుంచి బయట కార్యాలయాలలో చేసే పని వరకు గుర్తింపునిస్తూ సరైన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం నరసయ్య, జన సమితి నాయకులు పుష్పలీల, రాణి జైపాల్ రెడ్డి, జస్వంత్, రామచందర్,రవీందర్ యాదవ్,హనుమంతు గౌడ్, లక్ష్మణ్, స్థానిక వాసులు అపర్ణ, అరుణ ,పద్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370